ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 4, ఫిబ్రవరి 2025



ప్రాథమికోన్నత పాఠశాల (యూపీఎస్)లు ఇక కనిపించవు. జాతీయ విద్యావిధానం-2020 అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా యూపీఎస్‌లు చాలావరకు కనుమరుగు కాబోతున్నాయి. హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం ప్రతిపాదించిన పాఠశాలల్లో యుపీఎస్‌లకు స్థానం లేకుండాపోయింది. దీంతో గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న యూపీ స్కూళ్లు.. అయితే విలీనం, లేకుంటే అప్‌గ్రేడ్, కాకుంటే డౌన్ గ్రేడ్ కానున్నాయి. ఎలా అన్నది విద్యార్థుల సంఖ్య ప్రకారం అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. నదులు, కొండలు తదితర ఇబ్బందికర పరిస్థితులు ఉన్నచోట్ల మాత్రమే యూపీఎస్‌లను కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.


డౌన్‌గ్రేడ్ కానున్న ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరు యూపీ స్కూలు

యూపీ స్కూళ్లు మాయం!

జిల్లాలో 181 యూపీ స్కూళ్లు

జిల్లాలో మొత్తం 181 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 17,648 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 9,877 మంది ఉండగా 6, 7, 8 తరగతుల్లో 7,771 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు యూపీ స్కూళ్ల మనుగడకు ముప్పు పొంచి ఉంది. మొత్తంగా ఆ వ్యవస్థను లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో హైస్కూళ్లకు దూరంగా ఉన్న యూపీ స్కూళ్లలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను హైస్కూళ్లలో విలీనం చేసి యూపీఎస్‌లను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించడానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు మెమో ఇచ్చారు. అవి ఇప్పుడు యూపీ స్కూళ్ల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

30మంది లోపు పిల్లలున్న స్కూళ్లు డౌన్‌గ్రేడ్

పాఠశాలల హేతుబద్ధీకరణకు ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల మేరకు 6, 7, 8 తరగతుల్లో 30మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న యూపీ స్కూళ్లను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేస్తారు. తదుపరి ఆ బడులను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ నిబంధనల ప్రకారం 30మందిలోపు పిల్లలు ఉన్న 62 యూపీ స్కూళ్ల మండల ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ కాబోతున్నాయి. ఈ పాఠశాలలకు హైస్కూళ్ల దూరమైనా సరే విలీనం చేయాల్సిందే. అవసరమైతే విద్యార్థికి సంవత్సరానికి రూ.6వేలు ప్రయాణ భత్యం చెల్లిస్తామని అధికారులు చెప్తున్నారు. 30మందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలల్లో కొన్నింటిలో ముగ్గురు, నలుగురు, పదిమంది లోపు సుమారు 10 యూపీ స్కూళ్లలో ఉన్నారు. ఈ పాఠశాలలు అనివార్యంగా డౌన్‌గ్రేడ్ కావాల్సిందే.

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గతంలో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేకపోవడంతో వారు ప్రాథమిక స్థాయిలోనే చదువులకు స్వస్తి చెబుతుండేవారు. ఈనేపథ్యంలో 8వతరగతి వరకు విద్యార్థులకు పాఠశాలలు అందుబాటులో ఉంచేందుకు యూపీ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవస్థను సమూలంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటి దగ్గరలో బడి ఉంటే పిల్లలు ఆడుతూపాడుతూ వెళ్లి చదువుకుంటారు. అదే 6వ తరగతికే విద్యార్థులు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవాలంటే ఎంత కష్టమో పాలకులు ఆలోచించడం లేదు. ప్రభుత్వం తాజా సంస్కరణల ఫలితంగా జిల్లాలో 62 యూపీ స్కూళ్లు ప్రాథమిక పాఠశాలలుగా డౌన్ గ్రేడ్

మిగతా 6వ పేజీలో

విద్యా సంస్కరణలలో భాగంగా మార్పులు

- హేతుబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిర్ణయం
- 62 యూపీఎస్‌లు పీఎస్‌లుగా డౌన్‌గ్రేడ్
- 48 పాఠశాలలు హైస్కూళ్లుగా ఉన్నతి
- 71 బడులపై వేలాడుతున్న కత్తి


రథ సప్తమి సందర్భంగా విద్యుత్ దీపాలతో మెరిసిపోతున్న మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయం

శ్రీ సూర్యనారాయణ.. వేదపారాయణ!

నేడు రథసప్తమి

- సూర్యుడి ఆరాధనకు విశిష్టమైన రోజు
- వేడుకలకు ఆలయాలు ముస్తాబు

7

ఒంగోలు రైల్వే స్టేషన్



ఒంగోలు రైల్వేస్టేషన్‌కు మహర్దశ..!

'అమృత్ భారత్'కు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే అభివృద్ధిలో భాగంగా భారత రైల్వే శాఖ ఈనెల 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్టేషన్‌ల ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించింది. దేశవ్యాప్తంగా 56 స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేయగా, అందులో ఒంగోలు కూడా ఉంది. ఈ మేరకు ఇకపై ఒంగోలు రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక సౌకర్యాలతో ప్రయాణికులకు మరింత సేవలు అందనున్నాయి. ఆధునికమైన ప్లాట్‌ఫాం, ఏసీ వెయిటింగ్ హాల్, మొదలు నుంచి చివరి వరకు స్టేషన్ బిల్డింగ్ అభివృద్ధి, ఎయిర్‌పోర్ట్ తరహా లైటింగ్, ఆధునిక పార్కింగ్‌తోపాటు, క్యాంటీన్‌లు, మినరల్ వాటర్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఈ తరహాలో ప్రయాగ, అయోధ్య, షిర్డీ వంటి రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చెందాయి. అదే విధంగా ఒంగోలు రైల్వేస్టేషన్ రూపురేఖలు కూడా మారనున్నాయి.



దర్శిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాతం వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణమ్మ

ఆదరణ కరువై.. వ్యాధులు తీవ్రమై..

ఎలుకల మందు తిని దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్తకు నడుం నొప్పి, భార్య క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం

ముండ్లమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బిడ్డల భవిష్యత్తే పరమావధిగా భావించి అహర్నిశలు శ్రమించారు. పిల్లలతోపాటే తమ జీవితమని భావించారు. వారి ఉజ్వల భవిష్యత్ కోసం చమటోడ్చి పనిచేశారు. కాస్తోకూస్తో కూడబెట్టిన సొమ్మును బిడ్డలకే పంచిపెట్టారు. అవసాన దశలో ఆదరిస్తాడనుకొన్న కన్నకొడుకే మమకారాన్ని వీడి పట్టించుకోకపోవడంతో ఆ వృద్ధ దంపతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దీనికితోడు వ్యాధులు వారిని పట్టిపీడిస్తున్నాయి. దీంతో తట్టుకోలేని వారు ఆత్మహత్యే శరణ్యమని ఎలుకల మందు తిన్నారు. ఈ ఘటన సోమవారం ముండ్లమూరు మండలంలోని వేములలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాతం వెంకటేశ్వరరెడ్డి, నారాయణమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఆడపిల్లలు ఇద్దరూ మృతిచెందారు. కుమారుడికి పెళ్లైంది. భార్య పిల్లలు ఉన్నారు. తండ్రీ కొడుకులు వేర్వేరుగా ఉంటున్నారు. వెంకటేశ్వరరెడ్డి నడుము నొప్పితో, భార్య నారాయణమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. బాగోగులు చూడాల్సిన కుమారుడు పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక సోమవారం ఉదయం ఎలుకల మందు తిన్నారు. ఇంట్లో స్పృహతప్పి పడిపోయిన వారిని ఇరుగుపొరుగు వారు చూసి వెంటనే దర్శిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ

- 58/1 నంబర్‌లో సర్వే చేయించి వివరాలు సేకరించిన సబ్ కలెక్టర్
- కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడి

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలో నకిలీ పత్రాలు సృష్టించి సర్వే నంబరు 58/1లో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. ఆమె ఆదేశాలతో సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ విచారణ చేపట్టారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ, సబ్ రిజిస్ట్రార్‌ను విచారించారు. అనంతరం అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిన ప్రదేశాన్ని ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. రెండు డాక్యుమెంట్‌లకు సంబంధించి సర్వే మ్యాప్, రికార్డులను పరిశీలించారు. హద్దుల ప్రకారం సర్వేయర్‌లతో కొలతలు వేయించారు. ఫిర్యాదు చేసిన వారి రికార్డులను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రికార్డులు తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివాదాస్పద భూమి రికార్డులను పరిశీలించామన్నారు. తహసీల్దారు సెలవులో ఉండటంతో ఆయన్ను విచారించలేదని చెప్పారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఎర్రగొండపాలెంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిన ప్రదేశంలో కొలతలు వేయిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, రెవెన్యూ సిబ్బంది


ఒంగోలు టూటౌన్ స్టేషన్‌లో పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

జవాబుదారీగా ఉండాలి


- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- 5 గంటలపాటు ఒంగోలు టూటౌన్ స్టేషన్ తనిఖీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు జవాబుదారీగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఆయన సోమవారం స్థానిక రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్టేషన్‌కు వచ్చిన ఐజీ రాత్రి 7 గంటల వరకు అన్ని గదులను పరిశీలించారు. రికార్డులను క్షుణంగా చూశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు విషయాన్ని లోతుగా పరిశీలించిన ఆయన కొన్ని

మిగతా 6వ పేజీలో

సీపీఎం సారథిగా వీఎస్ఆర్

- రెండోసారి రాష్ట్ర కార్యదర్శిగా జిల్లావాసి
- కీలక స్థానాల్లో ఉమ్మడి జిల్లా నేతలు



ఒంగోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం రాష్ట్ర సారథ్యం మరోసారి జిల్లాకు చెందిన వి.శ్రీనివాసరావుకు దక్కింది. వరుసగా రెండోసారి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. నెల్లూరు నగరంలో మూడు రోజులపాటు జరిగిన సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం పార్టీ నూతన రాష్ట్ర నాయకత్వ ఎన్నిక జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పలు ప్రజాసంఘాలలో పనిచేసే కీలక నేతలు మొత్తం 49 మందితో రాష్ట్ర కమిటీ, వారిలో 15 మందితో కార్యదర్శివర్గం ఏర్పాటైంది. ఆ కమిటీ కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జిల్లాలోని మద్దిపాడు మండలం కెల్లంపల్లికి చెందిన శ్రీనివాసరావు విద్యార్థి దశ నుంచి సీపీఎంలో పనిచేస్తున్నారు. నెల్లూరు, కావలిలో చదువుతూ సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐలో క్రియాశీలకంగా నెల్లూరు జిల్లాలో వ్యవహరించారు. అనంతరం యువజన సంఘమైన డీవైఎఫ్ఐలోనూ అదే జిల్లాలో పనిచేశారు. డీవైఎఫ్ఐలో రాష్ట్ర, జాతీయ నేతగా బాధ్యతలు నిర్వహించిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుసంఘం ప్రధాన కార్యదర్శిగా కొంతకాలం కొనసాగారు. ఆసమయంలో రైతు సంఘ నేతగా గుర్తింపు పొందారు. సీపీఎం జాతీయ కమిటీలోనూ పనిచేసిన వీఎస్ఆర్ రాష్ట్ర విభజన అనంతరం తిరిగి ఏపీకి వచ్చి క్రియాశీలకంగా పనిచేశారు.

తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో..

2021 మార్చిలో తాడేపల్లిలో జరిగిన పార్టీ 26వ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. తీవ్రప్రతికూల రాజకీయ పరిస్థితులలో ఉన్న సీపీఎం ఉనికిని నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషిచేసిన ఆయన వ్యక్తిగత జీవితంలో అత్యంత నిరాడంబరంగా ఉంటారు. నెల్లూరులో తాజాగా జరిగిన 27వ రాష్ట్ర మహాసభలో తిరిగి రాష్ట్ర కార్యదర్శిగా ఆయన్ను

మిగతా 6వ పేజీలో


సుజాతనగర్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

సుజాతనగర్‌లో పారిశుధ్యం మెరుగు..!

- ఇప్పటికే ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చొరవతో సమస్యలకు పరిష్కారం

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంతో నగరంలోని 37వ డివిజన్‌లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గతనెల 28న అక్కడి ఎన్టీఆర్ పార్కులో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల మధ్య నిర్వహించిన చర్చావేదికతో పనులు ఒక్కొక్కటిగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే చెన్నకేశవ స్వామి లేఅవుట్ ఎన్టీఆర్ పార్కులోని సమస్యల పరిష్కారానికి

మిగతా 6వ పేజీలో

యూపీ స్కూళ్లు మాయం

(5వ పేజీ తరువాయి)

కాబోతున్నాయి. మరో 71 యూపీఎస్‌లపై మూసివేత కత్తి వేలాడుతోంది. ఇంకో 48 బడులను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

71 పాఠశాలలను మూసివేసే అవకాశం

71 యూపీ స్కూళ్లపై మూసివేత కత్తివేలాడుతోంది. నిబంధనల ప్రకారం 6, 7, 8 తరగతుల్లో 31 నుంచి 59మంది వరకు 6, 7, 8 తరగతుల విద్యార్థులు పాఠశాలలకు సంబంధించి ప్రతి పాఠశాలను కేస్ స్టడీ చేసి తగు నిర్ణయం తీసుకోమన్నారు. ఈ పాఠశాలలకు సమీపంలో హైస్కూళ్లు ఉంటే ఇక్కడి యూపీ సెక్షన్ల విద్యార్థులను విలీనం చేయమన్నారు. అయితే యూపీఎస్‌కు హైస్కూలుకు మధ్య కుంటలు, వాగులు, వంకలు, జాతీయ రహదారులు తదితర అవరోధాలు ఉంటే ఈ పాఠశాలలను కొనసాగించమన్నారు. అదే జరిగితే ఈ పాఠశాలలకు స్కూలు అసిస్టెంట్లకు బదులుగా కేవలం ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను మాత్రమే కేటాయిస్తారు.

60 మంది కంటే ఎక్కువ మంది ఉంటే అప్‌గ్రేడ్

6, 7, 8 తరగతుల్లో 60మంది అంతకంటే ఎక్కువమంది విద్యార్థులు ఉన్న యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయమన్నారు. ఈ నిబంధనల ప్రకారం జిల్లాలో 48 యూపీ స్కూళ్లు అప్‌గ్రేడ్ కానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలకు 9వతరగతి వస్తుంది. గెజిటెడ్ హెచ్‌ఎం, పీడీ/పీఈటీ పోస్టులు మంజూరు చేస్తారు. చదువు చెప్పేందుకు ప్రతి సబ్జెక్టుకు స్కూలు అసిస్టెంటను నియమిస్తారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్పులు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు యూపీ స్కూళ్ల మనుగడపై చర్యలు తీసుకుంటాం. అరవై మందిపైగా యూపీ సెక్షన్‌లో విద్యార్థులు ఉంటే వాటిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్‌చేస్తాం. అరవై మందిలోపు పిల్లలు ఉన్న యూపీ స్కూళ్లను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా డౌన్ గ్రేడ్ చేస్తాం. అక్కడ 6, 7, 8 తరగతుల పిల్లలను సమీపంలోని హైస్కూల్‌కు పంపుతాం. హైవే, నీటివనరులు, కొండలు తదితర ఇబ్బందికర ప్రాంత యూపీఎస్‌ను అలాగే కొనసాగించే అవకాశం ఉంది. **-ఎ.కిరణ్‌కుమార్, డీఈవో**

సీపీఎం సారథిగా వీఎస్ఆర్

(5వ పేజీ తరువాయి)

పార్టీ నేతలు ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలు కీలక స్థానాలకు ఎన్నికయ్యారు. అద్దంకి నియోజకవర్గానికి చెందిన డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, పర్చూరు నియోజకవర్గానికి చెందిన వి.కృష్ణయ్యలు 15మందితో కూడిన రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఎన్నికయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, కొండపికి చెందిన కేవీపీఎస్ నేత అంద్ర మాల్యాద్రి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సోమవారం నెల్లూరులో జరిగిన సీపీఎం ర్యాలీ, సభకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ఆ పార్టీశ్రేణులు తరలివెళ్లాయి.

జవాబుదారీగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

సీడీ ఫైళ్లలో ఎఫ్ఐఆర్ మినహా ఎలాంటి పేపర్లు లేవని గుర్తించారు. దీనిపై అధికారులను ప్రశ్నించారు. స్టేషన్ పరిధిలో అధికంగా నేరాలు నమోదయ్యే ప్రాంతాలలో ఎలాంటి చర్యలు చేపట్టారని సీఐ శ్రీనివాసరావును ప్రశ్నించారు. పాత నేరస్థులపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని చెప్పారు. సాంకేతిక పద్ధతులను వినియోగించుకొని కేసుల దర్యాప్తును వేగంగా పూర్తిచేయాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి పూర్తి భరోసా కల్పించాలన్నారు. సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఐజీ మొక్కను నాటారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, సీఐలు శ్రీకాంత్‌బాబు, నాగరాజు, అజయ్‌బాబు, సుబ్బారావు, ఎస్ఐలు పున్నారావు, త్యాగరాజు తదితరులు ఉన్నారు.

సుజాతనగర్‌లో పారిశుధ్యం మెరుగు

(5వ పేజీ తరువాయి)

కమిషనరు డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుతో కలిసి పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సుజాతనగర్‌లోని దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని పారిశుధ్య సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు సమతానగర్ నుంచి తాలూకా పోలీస్ స్టేషన్ వరకు సైడు కాలువల్లో పూడికతీత పనులు, అలాగే కాలువలపై ర్యాంపులు తొలగింపుతోపాటు, ఇకపై మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపడే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. అవసరమైన సైడు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలను మునిసిపల్ ఇంజనీర్లు సిద్ధం చేశారు. చర్చా వేదికలో ఆ డివిజన్‌లోని పలు కాలనీల ప్రజలు తెలిపిన సమస్యలు ఇటు అధికారులు, ఇటు ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక చొరవతో పరిష్కారమవుతున్నాయి. దీంతో ఆ డివిజన్ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలువలోకి దూసుకుపోయిన బస్సు

తప్పిన పెనుప్రమాదం

పర్చూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాలువలోకి బస్సు దూసుకుపోయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి పర్చూరు - చీరాల ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా, నర్సరావుపేట పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడం, దట్టంగా పొగ మంచు కారణంతో ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు చెప్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బస్సు కాలువలో పడితే పెనుప్రమాదం జరిగి ఉండేది.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఈనెల 7న తలపెట్టిన లక్షల డప్పులు - వేల గొంతులు కార్యక్రమానికి హైదరాబాద్‌కు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీ నర్సయ్య కోరారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆయన పలువురు నాయకులతో కలిసి విడుదల చేశారు.

ఎపిఫని మెరిట్ టెస్ట్ ఫలితాల విడుదల


అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎడ్యూకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్ ఫలితాలను సోమవారం విజయవాడలో స్కూల్ ఎడ్యూకేషనల్ డైరెక్టర్ వి.విజయ్‌రామరాజు తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎడ్యూకేషనల్ ఎపిఫని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టి.వెంకటరావు, కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూరి పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన 94 మంది విద్యార్థులకు రూ.5,03,000 నగదు బహుమతులు ప్రకటించించారు. వీటితో పాటు టోపీలు, జ్ఞాపికలు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపా రు. ఈనెల 8న విజయవాడలో ఎంబీ విజ్ఞాన క్రేంద్రంలో జరిగే కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 7వ తరగతిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన వారికి రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, పదివ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన వారికి రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు అందిస్తామని తెలిపారు. జిల్లా, మండల స్థాయి విద్యార్థులకు కూడా నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు.

చదువు ఆటపాటలా సాగాలి

మార్టూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలు బడిలో ఆడుతూపాడుతూ చదువు సాగేలా ఉండాలని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. సోమవారం వసంత పంచమి సందర్భంగా మార్టూరులోని శ్రీహర్షిణి ఒలంపియాడ్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ గోరంట్ల రవికుమార్ కవిత దంపతులు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సరస్వతీ పూజా కార్యక్రమంలో రవికుమార్ దంపతులతోపాటు పలువురు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమానికి విచ్చేసిన చిన్నపిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పలకలును, పుస్తకాలను రవికుమార్ దంపతులు పంపిణీ చేశారు. అంతేగాకుండా వారితో అక్షరాలును దిద్దించారు. వారితలపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లలను ప్రేమతో బడిపట్ల వారికి ఆసక్తి కలిగించేవిధంగా ప్రవర్తించాలన్నారు. వారికి కూడా బహుమతులను పంపిణీ చేశారు తరువాత. అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఉపాధ్యాయినులు పార్వతి, నిర్మల, అంజలి, సంపూర్ణ, మాధవి, పద్మ పాల్గొన్నారు.

సంఘ సేవకుడు జ్యోతయ్య మృతి

» మొక్కల పెంపకం, శ్మశాన వాటికల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న పంతంగి



పంతంగి జ్యోతయ్య (ఫైల్)

అద్దంకి, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత మిలటరీ ఉద్యోగి, సంఘ సేవకుడు పంతంగి జ్యోతయ్య (76) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. అద్దంకి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురు నివాసం ఉండే పంతంగి జ్యోతయ్య మిలటరీలో పనిచేసి అనంతరం ఎస్‌బీఐ గార్డ్‌గా కొంత కాలం పని చేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జ్యోతయ్య ఇటీవల బెంగళూరులో కుమార్తె వద్దకు వెళ్లి మిలటరీ వైద్యశాలలో వైద్య చికిత్సలు పొందుతున్నారు. సోమవారం అనారోగ్యంగా ఉందని చెప్పటంతో మిలటరీ వైద్యశాలకు తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయానికి జ్యోతయ్య మృతదేహం అద్దంకి తీసుకు వస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఒక వైపు బ్యాంక్‌లో పనిచేసేటప్పటి నుంచి ఉద్యోగ విరమణ చేసిన తరువాత కూడా నిత్యం సమాజ సేవలో నిమగ్నమై ఉండే వారు. చిట్టడవిని తలపించేలా ఉన్న నర్రావారిపాలెం శ్మశానాన్ని అభివృద్ధి చేయడంలో కీలక భూమిక పోషించారు. అదే సమయం లో పలు శ్మశానాల్లో మొక్కలు నాటి, పూర్తి సంరక్షణ చేశారు. ప్రస్తుతం ఆయా శ్మశానాలలో జ్యోతయ్య నాటిన మొక్కలు పెద్ద పెద్ద వృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. అద్దంకి పట్టణంలో మొక్కలు పెరగవు అనే అభిప్రాయం ఉండగా అది నిజం కాదని నిరూపిస్తూ పలు రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని జ్యోతయ్య సంరక్షించారు. వీటన్నిటికీ మించి అనాథలు, సమీప బంధువులు లేని వారు మృతి చెందితే నేనున్నానంటూ అన్నీ తానై వ్యవహరించి దహన సంస్కారాలు కూడా చేసేవారు.

ఫంక్షన్‌లు, వివాహాలు జరిగే సమయంలో ఆహార పదార్థాలు మిగిలి పారవేసే పరిస్థితి ఏర్పడుతుండగా, మిగిలిపోయిన ఆహార పదార్థాలను అర్ధరాత్రి సమయంలో కూడా ఆర్టీసీ బస్టాండ్ తో పాటు పలు కాలనీలలో నివశించే పేద ప్రజల వద్దకు ప్రత్యేక వాహనంలో తీసుకుపోయి పంపిణీ చేసి పేద ప్రజల ఆకలి మంట తీర్చేవారు. ఇంకా కొద్దిపాటి ఖాళీ సమయం దొరికితే తాను పనిచేసిన బ్యాంక్ వద్దకు వెళ్లి నిరక్షరాశ్యులు, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన లేని వారికి సహాయం చేస్తూ సేవలందిస్తుంటారు. ఇలా నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై నిజమైన ప్రజా సేవకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.

నిస్వార్థ సేవకుడు జ్యోతయ్య

సంతాపం తెలిపిన మం త్రి గొట్టిపాటి

నిస్వార్థ సేవకుడు జ్యోతయ్య అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంఘ సేవకుడు పంతంగి జ్యోతయ్య మృతి పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిరుపయోగంగా కొత్త భవనాలు

» పగిలిన కిటికీల అద్దాలు

» మందుబాబులకు నిలయాలు

మార్టూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలు వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ప్రారంభించకుండానే శిథిల దశకు చేరుతున్నాయి. ఈ భవనాల చుట్టూ, ఎదురుగా ముళ్లచెట్లు పెరిగిపోతున్నాయి. భవనాలకు ఉన్న కిటికీల అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. మార్టూరుటౌన్‌లో చెరువు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో వైసీపీ హయాంలో కొత్తగా మూడు ప్రభుత్వ భవనాలను విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను నిర్మాణం చేశారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చి ఆరునెలలు దాటినప్పటికీ ఇంతవరకు ఈ మూడు ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. ముఖ్యంగా మార్టూరులో రెండవ గ్రామ సచివాలయం అద్దె ఇంటిలో నిర్వహిస్తుండగా, దాని కోసం రూ.40లక్షల వ్యయంతో రెండవ గ్రామ సచివాలయంగా కొత్తభవనం నిర్మించారు. కానీ అద్దె ఇంటి నుంచి రెండవ గ్రామ సచివాలయాన్ని కొత్తభవనంలోకి మార్చలేదు. అదేవిధంగా మిగిలిన రెండు భవనాలు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు మూడుభవనాల కిటికీలకు ఉన్న అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. రాత్రి సమయాలలో మందుబాబులకు భవనాల వరండాలు నిలయాలుగా మారాయి. వారిని అదేమిటని అడిగే వారే లేరు. గతంలో ఓసారి ఈ విషయమై నిలదీసిన గ్రామస్థులతో మందుబాబులు వాదనకు దిగిన సందర్భాలు ఉన్నాయి. దాంతో ఎవరూ వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఇదేవిధంగా పరిస్థితి కొనసాగితే బూత్ బంగళాలుగా మూడు భవనాలు మిగిలిపోయే అవ కాశం ఉందని గ్రామస్థులు అంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పగలగొట్టిన కిటికీ అద్దాలు



తుమ్మచెట్లతో నండిని విలేజ్‌హెల్త్‌క్లినిక్ ప్రాంగణం



భవనం పూర్తయినా నేటికీ ప్రారంభించని గ్రామ సచివాలయం

శనగకు ఎండు తెగులు బెడద

రైతుల్లో ఆందోళన

పంగులూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : శనగలో ఎండు తెగులు విస్తరిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవని, పంట మార్పిడి విధానంతోనే తెగులు అరికట్టే అవకాశం ఉందన్న శాస్త్రవేత్తలు సూచిస్తుండగా, తెగులు రోజురోజుకూ పైరంతా విస్తరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చందలూరు, పంగులూరు, తూర్పు కొప్పెరపాడు, కోటపాడు పరిసర గ్రామాలలో 2,500ఎకరాల్లో రైతులు రబీ పంటగా శనగ సాగు చేపట్టారు. ఆయా గ్రామాలలో తెగులు సోకి పైరు కల్లాలుగా ఎండుతూ కనిపించడంతో రైతులు పైరు చేతికి దక్కదని వాపోతున్నారు. సుమారు 200 ఎకరాలలో ఎండు తెగులు సోకినట్లు గుర్తించామని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. గత నెల మూడవ తేదీన చందలూరులో తెగులు సోకిన తొలిదశలో పలువురు శాస్త్రవేత్తలు పైరును పరిశీలించారు. మొక్క దశలో తెగులు ఆశించిన పైరుపై పాలిక్యూర్ మందు ద్రావణాన్ని వేరు తడిచేలా పిచికారీ చేయడం కొంత ఉపశమనంగా సూచించారు. దీర్ఘకాలం ఒకే పంట సాగు చేయడంతో ఇలాంటి తెగుళ్లు ఆశిస్తాయని, పంట మార్పిడితోనే తెగుళ్లను నివారించ వచ్చన్నారు. తెగులు నివారించే అవకాశం ఉందన్న శాస్త్రవేత్తల సూచనలు, తెగులు విస్తరించి పైరు ఎండుతున్న తీరుతో వాటిల్లే నష్టం తలుచుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు.



చందలూరులో తెగులు సోకి ఎండుతున్న శనగ

ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు

ఆటోల్లో ప్రయాణించే కూలీలకు, డ్రైవర్లకు సీఐ సుబ్బరాజు సూచన

అద్దంకి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కూలీలు ఆటోల్లో ప్రయాణించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సీఐ సుబ్బరాజు అన్నారు. సోమవారం అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో వాహనాలను సీఐ సుబ్బరాజు తనిఖీలు చేశారు. ప్రధానంగా కూలీలలు పెద్ద సంఖ్యలో ట్రాలీ ఆటోలలో ప్రయాణించడం, పరిమితికి మించి ఆటోలలో ప్రయాణించడం గుర్తించి కూలీలను దించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గూడ్స్ ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో ప్రయాణికుల ఆటోల్లో కూడా పరిమితికి మించి ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్సై ఖాదర్‌బాషా ఉన్నారు.



భవానీ సెంటర్‌లో ఆటోల్లో ప్రయాణిస్తున్న కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు

నేటి నుంచి జీజీహెచ్‌లో సదరమ్ సర్టిఫికెట్‌ల పునఃపరిశీలన

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సదరం సర్టిఫికెట్‌ల పునఃపరిశీలన ఈనెల 4వ తేదీ నుంచి ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకోమోటివ్, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, వినికిడిలోపం, మానసి వైకల్యం, కంటి విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఆమేరకు సర్టిఫికెట్‌లు పరిశీలన చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 4,926 మంది ఈఎన్‌జీ, 2,726 మంది ఆఫ్తాలజీ విభాగం, 6,040 మంది ఆర్థోపెడిక్ విభాగం, 5,686 మందికి సైక్రియాట్రిక్ విభాగాలలో పరీక్షలు చేయవలసి ఉందన్నారు. అయితే రోజువారీ సామర్థ్యాన్ని బట్టి డీఆర్‌డీఏ సిబ్బంది ద్వారా నోటీసులు అందుకున్న వారు, వారికి తెలిపిన తేదీల ప్రకారం జీజీహెచ్‌లో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు, డాక్టర్లు, సిబ్బంది నియామకం చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

● లైంగిక వేధింపుల ఆరోపణతో సస్పెన్షన్

మద్దిపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం కాటంవారిపాలెంకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గోపనబోయిన రవికుమార్‌పై పోక్సో నమోదైంది. ఆయన్ను డీఈవో కిరణ్‌కుమార్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. మద్దిపాడు మండల పరిధిలోని వెల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో 2017 ఆగస్టు నుంచి రవికుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన బాలికల పట్ల బ్యాడ్ టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో రాబట్టిన ఆధారాలను కలెక్టర్‌కు సమర్పించారు. ఈమేరకు కలెక్టర్ ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. అనంతరం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో విచారణ అధికారులు జీసీడీవో హైమావతి, డీఈవో కిరణ్‌కుమార్, స్థానిక ఎంఈవో 2 బి.శ్రీనివాసరావు విచారణలో లభించిన ఆధారాలను సమర్పించి ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై బి.శివరామయ్య ఉన్నతస్థాయి అధికారులకు నివేదికను పంపి వారి సూచనమేరకు పోక్సో కేసు నమోదు చేశారు.

రేపు జిల్లాస్థాయి హాకీ జట్టు ఎంపిక

సంతనూతలపాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జిల్లా సీనియర్ హాకీజట్టు ఎంపిక జరగనుందని జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, సుందరరామిరెడ్డిలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని ఉదయం 10గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 8 నుంచి 10 వతేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలకు 1996 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9666067764నెంబరును సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలో పంగులూరు ఎడ్లకు ద్వితీయం



బండలాగుడు పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచిన పంగులూరు ఎడ్ల జత

పంగులూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా నాదెండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలలో పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజతకు ద్వితీయ స్థానం దక్కింది. విఘ్నేశ్వరస్వామి వార్షిక మహోత్సవం సందర్భగా నాదెండ్లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో నిర్వహించిన బండలాగుడు పోటీలో గొట్టిపాటి యూత్ సారథ్యంలో పంగులూరుకు చెందిన నాగేశ్వరరావు ఎడ్ల జత పాల్గొంది. ఈ పోటీలో సోమవారం రాత్రి జరిగిన పోటీలో పాల్గొన్న పంగులూరు ఎడ్లజత నిర్ణీత 15 నిముషాలలో 39,023 అడుగుల దూరాన్ని చేరుకుని ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలో పాల్గొన్న పురుషోత్తపట్నం ఎడ్లజత 33 అడుగుల తేడాతో ప్రథమస్థానంలో నిలువగా పంగులూరు ఎడ్లజతకు ద్వితీయ స్థానం దక్కింది. గత నెలలో సంక్రాంతి సందర్భంగా అన్నంబొట్లవారిపాలెంలో జరిగిన పోటీలతో పాటు రెంటచింతలలో జరిగిన ఎడ్ల బండలాగుడు పోటీలలో ఈ ఎడ్లజతకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎడ్ల యజమాని నాగేశ్వరరావు తెలిపారు.

10న సీతారామాలయం ప్రతిష్ఠ

ప్రారంభానికి ముస్తాబవుతున్న నూతన దేవస్థానం



అంబడిపూడిలో ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న సీతారామాలయం

బల్లికురవ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో ఈనెల 10వ తేదీన శ్రీ సీతారామస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. గతంలో జీర్ణావస్థలో రామాలయం ఉండగా, గ్రామస్థులు సమష్టి కృషితో పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి ఏడాదిగా నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. గ్రామానికి నడి బొడ్డున పురాతన కాలం నుంచి సీతారామాలయ పునర్నిర్మాణం చేపట్టేందుకు భక్తులు పనులను శరవేగంగా చేపడుతున్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 8-49 నిమిషాలకు దేవాలయ ప్రతిష్ఠ చేసేందుకు వేద పండితులు ముహూర్తం నిర్ణయించారు. 8వ తేదీ నుంచి ప్రతిష్ఠ పూజలు ప్రారంభం కానున్నాయి. గ్రామంలో నూతన దేవాలయ ప్రతిష్ఠ నిర్వహించనుండటంతో ప్రజలు రానున్న వారం రోజులు ఆపనుల్లో పనులలో పూర్తిగా నిమగ్నం అయ్యారు.

7న సీతారామస్వామి బాలాలయం ప్రతిష్ఠ

చినగంజాం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో సీతారామస్వామి బాలాలయం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు సీతారామస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు తెలిపారు. 7వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, చతుర్థశ కలశస్నపన, అభిషేకాలు, అఖండ స్థాపన, సకల దేవతాహ్వానం, అంకురారోపణం, 8వ తేదీ ఉదయం 11.22 గంటలకు సీతారామస్వామి ప్రతిష్ఠమహోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామసుబ్బారావు తెలిపారు.

శ్రీ సూర్యనారాయణ వేదపారాయణ!

నేడు రథసప్తమి పండుగ

సూర్యుడి ఆరాధనకు విశిష్టమైన రోజు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మానవులు ఎంతమంది దేవుళ్లను ఆరాధిస్తున్నప్పటికీ ప్రత్యక్షదైవంగా పిలువబడేది మాత్రం సూర్యుడినే. ఆయనను సూర్యనారాయణుడు అనే పేరుతో కొలుస్తారు. అటువంటి సూర్యుడి ఆరాధనకు విశిష్టమైన రోజు 'రథసప్తమి'. మాఘమాసం శుక్లపక్షంలో వచ్చేటువంటి సప్తమి తిథిని రథసప్తమిగా జరుపుకుంటారు. ఆ రోజున సూర్యారాధన చేస్తే సంపదలే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం సైతం సమకూరుతుందని భక్తుల నమ్మకం. ఈ రథసప్తమి రోజున ప్రజలు ఉదయాన్నే తలపైన ఏడు జిల్లేడు ఆకులను ఉంచుకుని తలస్నానం చేయటం ఆనవాయితీ. జిల్లేడు ఆకులను అర్కపత్రం అని పిలుస్తారు. అర్కం అంటే సూర్యుడు అని అర్థం. అందువల్లే రథసప్తమి రోజు జిల్లేడు ఆకులను తలపై ఉంచుకుని తలస్నానం చేస్తే సూర్యనారాయణుని అనుగ్రహం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ ఏడు జిల్లేడు ఆకులు సూర్యుని రథానికి ఉంటే ఏడు గుర్రాలుగా కూడా పురాణప్రతీతి. వీటివల్ల ఏడు జన్మలలో చేసిన పాపం నశిస్తుందని, మనిషిని ఎంతగానో బాధించే ఏడు రకాల వ్యాధులను హరింపజేస్తుందని సైతం చెబుతారు. రథసప్తమి రోజు మహిళలు తమ వాకిళ్లముందు రథం ముగ్గులను సైతం వేస్తారు. ఆ రోజు ఎర్రని వస్త్రం, ఎర్రని పూలతో సూర్యుని పూజించి శక్తి ఉన్నవారు వెండి లేదా బంగారు రథం బొమ్మను దానం ఇస్తారు. జిల్లాలో ఉన్న అనేక వైష్ణవాలయాలలో రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. ఒంగోలు కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, కోదండ రామస్వామి దేవస్థానం ఇలా పలు ఆలయాల్లో ఈ రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా దేవస్థానాల అధికారులు, నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.



స్వామి ఊరేగించే వాహనాలు



ఆలయంలో సిద్ధం చేసిన చలువ పందిళ్లు



విద్యుత్ దీపాలంకరణలో చెన్నకేశవస్వామి ఆలయం

చెన్నకేశవాలయంలో ఏర్పాట్లు పూర్తి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకుని మార్కాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా ఒకేరోజు స్వామి వివిధ వాహనాలపై పలు అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 5.30 నుంచి 7.00 వరకు సూర్యప్రభ వాహనం, 9 నుంచి 10 గంటల వరకు శేషవాహనం, 11 నుంచి 12 గంటల వరకు గరుడ వాహనంపై స్వామి విహరించనున్నారని ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 1గంట నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం, 2 నుంచి 3 గంటల వరకు శ్రీచక్ర స్నానం, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రజిత రథోత్సవం, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై స్వామి నాలుగు మాడవీధులలో దర్శనమిస్తారని తెలిపారు. ప్రతి వాహనం వెంట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలోని వెండి రథం వివిధ వాహనాలకు తుది మెరుగులు దిద్దారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాల వెలుగులో కళకళలాడుతోంది.



తుది మెరుగులు దిద్దుకుంటున్న వెండిరథం

విశ్రాంత ఎంఈవోకు రూ.35లక్షల టోకరా!

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న విశ్రాంతం ఎంఈవోకు ఏసీబీ అధికారులమంటూ ఫోన్‌చేసి రూ.35 లక్షలు ఆన్‌లైన్ ద్వారా నొక్కేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. కొత్తపేటలో నివాసం ఉంటున్న విశ్రాంత ఎంఈవో బ్రహ్మారెడ్డికి ఏసీబీ అధికారుల మంటూ ఫోన్ కాల్ వచ్చింది. మీ భార్య పైన, మీ ఇద్దరి కుమారులపైన ఏసీబీ కేసులు నమోదు చేస్తున్నామని వీడియోకాల్ వచ్చింది. కేసు నమోదు అయితే మీ కుటుంబం జైలు పాలవుతుందని హెచ్చరికగా మాట్లాడారు. కేసు నుంచి రక్షించుకోవాలంటే మేము చెప్పినట్లు వినాలని హుకుం జారీ చేశారు. ఈ విషయాన్ని బయట పెడితే మొదటికే మీకు నష్టం వస్తుందని బెదిరించారు. ముందుగా ఓ రూ.లక్ష కట్టాలని చెప్పారు. దీంతో ఆ ఎంఈవో తమ వద్ద అంత డబ్బులు లేవని చెప్పటంతో ఫోన్ కట్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన బాధితుడు తిరిగి అదే ఫోన్ నంబరుకు ఫోన్ చేయగా, మీ ఇష్టం ఆలోచించుకోండి అంటూ చెప్పటంతో మోసగాడు చెప్పిన అకౌంట్ నంబరుకు రూ.50 వేలు వేశాడు. నగదు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయిన తర్వాత తిరిగి ఫోన్ చేసిన మోసగాడు ఇది చాలా పెద్ద నేరంగా కేసు నమోదు అవుతుందని, మీ ఆస్తులను కూడా జప్తు చేయాల్సి వస్తుందని బెదిరించాడు. ఏ విషయం రేపు చెప్తామంటూ ఫోన్ కట్ చేశాడు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పలేక తనలో తానే ఆందోళన చెందుతున్న బాధితుడికి మరుసటి రోజు ఫోన్

ఆలస్యంగా వెలుగుచూసిన మోసం

వచ్చింది. ఏకంగా రూ.50 లక్షలు డిమాండ్ చేయటంతో ఆయన గుండె గుభేల్ మంది. చేసేది లేక అంత డబ్బు ఒక్కసారిగా మా వద్ద లేదని, అసలు ఏ విషయంలో కేసులు నమోదవుతున్నాయి సార్ అంటూ మాట్లాడిన బాధితుడికి మీకు వివరాలన్ని కేసు నమోదు చేశాక చెప్తామని చెప్పి మళ్ళీ ఫోన్ కట్ చేశాడా మోసగాడు. దీంతో చేసేది లేక కేసు నమోదు చేయవద్దంటూ మోసగాడిని వేడుకుని విడతల వారీగా డబ్బులు వేస్తామని మోసగాడితో ఒప్పించుకున్నాడు. ఈక్రమంలో గత పది రోజులుగా రూ.లక్ష, రూ.రెండు లక్షలు చొప్పున వేశాడు. గత నెల 28న ఏకంగా రూ.10 లక్షలు వేసేందుకు కుమారుడి నుంచి రూ.2 లక్షలు డబ్బులు వేయించుకున్నాడు. రూ. పదిలక్షలను మోసగాడి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసిన బ్రహ్మారెడ్డి (బాధితుడు) పట్ల ఆయన కుమారుడికి అనుమానం కలిగింది. ఎప్పుడూ డబ్బులు అడగని తన తండ్రి రూ.రెండు లక్షల కోసం తమను అడగటం ఏమిటని ఆరా తీయటంతో విషయం కుమారుడికి చెప్పాడు. దీంతో బెంగుళూరు నుంచి కనిగిరి వచ్చిన కుమారుడు స్థానిక పోలీస్‌స్టేషన్ ద్వారా సైబర్ క్రైం పోర్టల్‌లో నమోదు చేశారు. రూ.35 లక్షల మోసం విషయం పట్టణంలో కలకలం రేగింది. ఈ విషయంపై సీఐ ఖాజావలిని వివరణ కోరగా ఆన్‌లైన్ మోసం నిజమే అని, సైబర్ క్రైం కింద కేసు నమోదయిందని చెప్పారు.

70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ముండ్లమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మలూరు వద్ద సోమవారం తెల్లవారు జామున 70 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో మినీ లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వినుకొండకు తీసుకువెళ్తున్న లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి పరిశీలించగా, 70 బస్తాలు రేషన్ బియ్యంగా తేలింది. రాత్రికి కూడా పట్టుబడిన బియ్యం ఏ రేషన్ షాపు డీలర్‌కు చెందినవో చెప్పకుండా తమకు బియ్యం పట్టుకున్నట్టు పోలీసులు సమాచారమే ఇవ్వలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. ఎస్ఐ వై.నాగరాజు పట్టుబడిన 70 బస్తాల రేషన్ బియ్యాన్ని చీమకుర్తి సివిల్ సప్లయీస్ గోడౌన్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన మర్రిపూడి బసవయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. త్వరలోనే మిగతా నిందితులను అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.



పట్టుబడిన రేషన్ బియ్యం చూపిస్తున్న ఎస్ఐ నాగరాజు

గ్రామాల్లో నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట

● ఎస్పీ దామోదర్ ● పోలీస్ స్టేషన్‌లలో తనిఖీ



మార్కాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరా ఫుటేజీని ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ దామోదర్ తెలిపారు. స్థానిక పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లలో సోమవారం రాత్రి ఆయన సాధారణ తనిఖీ నిర్వహించారు. రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావులతో కలిసి మొక్కను నాటారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 20 గ్రామాల్లోని ప్రధాన వీధల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని రూరల్ స్టేషన్‌లో ప్రారంభించి పరిశీలించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సైలు, కానిస్టేబుళ్లతో మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలను నెలకొల్పడంలో సీసీ కెమెరాలు కీలకమని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామాల్లో జరిగే గొడవలను సీసీ కెమెరాలు నిక్షిప్తం చేస్తాయని, కేసుల దర్యాప్తులో వీడియోలు కీలకంగా మారుతున్నాయని తెలిపారు. స్థానికంగా జరిగే నేరాలపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం తెలియజేయాలని కోరారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సైలు అంకమ్మరావు, సైదుబాబు, రాజమోహన్‌రావు ఉన్నారు.

నీరు జలజల.. పైరు కళకళ

ఒంగోలు మండలంలో గుండ్లకమ్మ నదిపై చేజర్ల ఎత్తిపోతల పథకం కింద సాగు చేసిన వరి పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. సుమారుగా 700 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు దండిగా కురవడంతో నీటికి ఇబ్బంది లేకుండా పంటకు అనుకూలమైన పరిస్థితి పైరు ఏపుగా పెరిగింది. మార్చి చివరి నాటికి వరి కోతలు మొదలవుతాయి. ఎకరాకు 40 బస్తాలకుపైగా దిగుబడి రావచ్చునని రైతులు చెబుతున్నారు.

- ఒంగోలు(రూరల్), (ఆంధ్రజ్యోతి)



చేజర్ల ఎత్తిపోతల నుంచి వస్తున్న నీరు

మెలకువలు పాటిస్తే మేలిమి పొగాకు



ఉమ్మడి జిల్లా రెండు రీజియన్లలో సుమారుగా 2.10 లక్షల ఎకరాల్లో పొగాకు సాగైంది. గతేడాదికన్నా ఈసారి భారీగా సాగు పెరిగింది. ఇప్పటికే క్యూరింగ్ జరుగుతోంది. కొన్నిచోట్ల గ్రేడింగ్ కూడా మొదలైంది. క్యూరింగ్‌లోనూ, గ్రేడింగ్‌లోనూ, బేళ్ల నిర్వహణలోనూ మెలకువలు పాటిస్తే మేలిమి రకం పొగాకుతో మెరుగైన ధరను రైతులు పొందొచ్చని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు సూచించారు. పొదిలి మండలంలోని అక్కచెరువు, గురుగుబాడు, జువ్వలేరు, రామాపురం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. పొగాకు తోటలనూ, బ్యారన్‌లనూ పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. - పొదిలి, ఆంధ్రజ్యోతి

● క్యూరింగ్, గ్రేడింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి ● బేళ్లను అనువైన ప్రదేశంలో ఉంచాలి

రైతులకు పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు సూచనలు

అనువైన ప్రదేశంలో మండె ఏర్పాటు

- పొగాకు రైతులు హడావిడిగా మండె ఏర్పాటు చేయడం, బేళ్ల కట్టడం వంటివి చేయకూడదు. మండె వేసే సమయంలో నేలపై చెక్కలు పేర్చి వాటిపై మండెలు వేస్తే ఆకు దెబ్బతినకుండా ఉంటుంది.
- తగినంత తేమలేకపోతే ఆకులో జరగాల్సిన రసాయనిక మార్పులు జరగక నాణ్యత లోపించే ప్రమాదం ఉంటుంది. వివిధ రెలువుల ఆకులు విడివిడిగా మండెలు వేసుకోవాలి.
- గోడలకు సమీపంలో మండెలు వేసేటప్పుడు వాటి మధ్య గాలి ప్రసరణ జరిగేందుకు దూరం ఉండేలా చూసుకోవాలి.
- మండె నుంచి తేమపోకుండా, బయటతేమను ఆకు పీల్చకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టను ఏర్పాటు చేయాలి.
- వేపాకు దిండ్లు ఏర్పాటు చేయడం వల్ల పురుగు ఆశించకుండా ఉంటుంది. 20 రోజులకు ఒకసారి మండెను తిరగేయడం వల్ల బూజు, తేమను నివారించొచ్చు. పెద్ద మండెలు వేస్తే వేడి అధికంగా ఉత్పత్తి జరిగి కాలేందుకు, కుళ్లిపోయేందుకు అవకాశం ఉంటుంది.



క్యూరింగ్ అయిన పొగాకును చూపుతున్న రైతు, బోర్డు అధికారులు (వృత్తంలో) రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలిలా..

- బ్యారన్‌లో ప్రమాదాలు జరగకుండా అల్లినకర్ర 800 నుంచి 900 మాత్రమే బ్యారన్‌లో లోడు చేయాలి. అంతకు మించి చేస్తే కాల్పు సమయంలో కర్రలు జారిపడటం వల్ల ప్రమాదాలు జరుగుతుంటాయి.
- బ్యారన్‌లో వేడి సమాంతరంగా వ్యాపించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వెంచురీ పొయ్యి బిగించడం వల్ల కాల్పుకర్ర ఖర్చు తగ్గుతుంది.
- ఆకు రంగువచ్చే దశలో 105 డిగ్రీలు, రంగునిలిచే దశలో 120, ఆకు ఆరే దశలో 145, కాడ ఆరే దశలో 160 డిగ్రీలు ఫారన్ హీట్ ఉష్ణోగ్రతలు ఉండేలా చూసుకోవాలి.

గ్రేడింగ్ ఇలా చేయాలి..



- గ్రేడింగ్ చేసేటప్పుడు ఏ రెలువు ఆకుకు ఆ రెలువు ఆకును వేరుగా నిల్వచేసి గ్రేడ్ చేయాలి. ఒకే రంగు కలిగిన పొగాకును మాత్రమే కలిపి కట్ట కట్టుకోవాలి.
- నాణ్యతలో తేడాలున్న సెలైన్, బూజు ఆకులను కలపకూడదు. కురచఆకులు, పచ్చగ్రేడ్, ఇతర ముక్కలు, చూర వంటివి కలపకూడదు.
- గ్రేడింగ్ పరిసరాల్లో గడ్డిపరకలు, ప్లాస్టిక్ కవర్లు ఉంచకూడదు. పశువుల పాకాలను, ధాన్యం నిల్వచేసే ప్రదేశాలను ఎంచుకోకూడదు.

బోర్డు సరఫరా చేసిన పట్టలే వాడాలి



- పొగాకు బేళ్లు కట్టేటప్పుడు బోర్డు నుంచి సరఫరా చేసిన పట్టలు మాత్రమే వాడాలి. చిరిగినవి వాడకూడదు.
- బేళ్లు కట్టే సమయంలో సరైనతేమ శాతం ఉండే విధంగా చూడాలి. లేకపోతే రంగుమారే ప్రమాదం ఉంటుంది.
- ఎరువుల బస్తాలు, పాతన్యూస్ పేపర్లు వాడకూడదు. వాటి రంగు ఆకుకు అంటుకుంటుంది.
- బేళ్ల అమ్మకానికి తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా తేమశాతం సరిచూసుకోవడం వల్ల తిరస్కరణకు గురికాకుండా ఉంటాయి.

అవీ..ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న సత్య

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా సత్య

టంగుటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల టీడీపీ ఇన్‌చార్జిగా రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నియమితులయ్యారు. ఆయన సోమవారం అక్కడ పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా విజయవాడలో సమావేశం నిర్వహించారు. పట్టభద్రులంతా ఈనెల 27న జరిగే ఎన్నికల్లో పాల్గొని ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

రవాణా సేవల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రవాణా రంగం సేవలు ప్రైవేటీకరణ చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రవాణా రంగంలోని సేవలన్నీ ప్రైవేటు పరం చేయాలని జీవోలు తీసుకొని రావడం దారుణంగా ఉందన్నారు. దీని ఫలితంగా ఆ రంగంలో పనిచేస్తున్న కార్మికుల జీవన పరిస్థితి దారుణంగా మారుతుందని, వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు మహ్మద్‌బేగ్, హుస్సేన్, రాజేష్, హరి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆలయ ప్రథమ వార్షిక వేడుకలు

సంతనూతలపాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో శ్రీసీతలాంబ అమ్మవారు, చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలోని బొడ్డురాయి, ధ్వజస్తంభం ఏర్పాటు చేసి ఏడాది అయిన సందర్భంగా ప్రథమవార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అర్చకులు నాగసాయి కృష్ణశర్మ ఆధ్వర్యంలో, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గొట్టిపాటి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక జిల్లా కోర్టులోని పోక్సో కోర్టులో అద్దంకికి చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా న్యాయాధికారి భారతిని కలిసి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వరన్యాయం అందిచేందుకు కృషి చేస్తానని చెప్పారు. నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సీఎంను కలిసిన మాగుంట


సీఎం చంద్రబాబుతో ఎంపీ మాటామంతీ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఢిల్లీ వెళ్ళిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎంపి మాగుంట కలిశారు. ఎంపీతో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టి.అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పొద లింగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎంపీటీసీ పొద పవన్ ఆధ్వర్యంలో కిమ్స్ వైద్యశాల సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె, కిడ్నీ, కంటి సంబంధ వ్యాధులు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు కిమ్స్ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 45 మందికి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి సమర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి అన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషుతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.


గ్రీవెన్స్‌లో అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్ అన్సారియా

● ఫించన్ కోసం అని తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించుకొని తన పేరుతో ఉన్న భూమిని కాజేశారని పుల్లలచెరువు మండలం సి.కొత్తపల్లికి చెందిన 69 సంవత్సరాల నున్న లింగం కోటయ్య కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి చెందిన వ్యక్తులే ఆస్తిని కాజేయడంతో ఎటువంటి ఆధారం లేకుండా రోడ్డున పడ్డానని కన్నీరు పెట్టుకున్నారు. తన భూమిని తనకు అప్పగించే విధంగా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు.

● ప్రభుత్వం ఇచ్చిన భూమిని సర్వేచేసి అప్పగించాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని తాళ్ళూరు మండలం సోమవరప్పాడు ఈస్ గంగవరంకు చెందిన, పి. సుబ్బారావు విన్నవించారు. గతంలో ప్రభుత్వం 675 సర్వేనెంబరులో భూమి ఇచ్చిందన్నారు. ఆ భూమిని కొలతలు వేసి చూపించాలని వేడుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమ భూమిని తమకు అప్పగించేవిధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

● ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎస్టీలకు కూడా గిరిజన జనాభా కులగణన చేసి తద్వారా ఎస్టీ వర్గీకరణను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని యానాది సంఘాల మహాకూటమి నాయకులు కోరారు.

లక్ష్యం మేరకు ఉపాధి పనులు కల్పించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకం లక్ష్యం మేరకు పనిదినాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వ్యవసాయ పనుల వలన కూలీలు రావడం లేదంటూ ఉపాధి పనిదినాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫారం పాండ్స్, ఫిష్ పాండ్స్ వంటి వ్యవసాయఅనుబంధ పనులపై ఎంపీడీవోలు, ఏపీవోలు దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారం గోకులం షెడ్ల నిర్మాణ నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయన్నారు. అందువల్ల ఎంబుక్ వంటి పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ నుంచి రుణాల కోసం ఈనెల 7వతేదీలోపు దరఖాస్తులు చేసుకొనేలా సచివాలయ స్థాయిలో అర్హులకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ హౌసింగ్ పథకాల కింద జరుగుతున్న నిర్మాణాలలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలన్నారు. కేవలం హౌసింగ్ ఏఈఈలు మాత్రమే కాకుండా ఎంపీడీవోలు కూడా ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం, స్కూలు టాయిలెట్ల తనిఖీ, బయోమెట్రిక్ హాజరు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంతో పాటు మంచినీటి కుళాయి కనెక్షన్లు, ఇంటి పన్నులను వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చిన ఓబులేషు, వివిధశాఖల అధికారులు జోసఫ్‌కుమార్, వెంకట నాయుడు, పి. శ్రీనివాసప్రసాద్, చిరంజీవి, రవికుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం

ఎక్కడి చెత్త అక్కడే.. పట్టించుకోని పంచాయతీ అధికారులు


మద్దిపాడులోని ప్రధాన సెంటర్లలో రోడ్లపక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు



మద్దిపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వారానికి ఒకసారి కూడా చెత్తను తరలించిన పాపాన పోలేదు. మద్దిపాడు పంచాయతీ అప్‌గ్రేడ్ అయినప్పటికీ పారిశుధ్యం తరలించటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను తరలించకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకొని పోయింది. తీవ్రమైన దోమల బెడద, చెత్తకుప్పలు రోజు వారీ నిలువ ఉండటంతో పాటు మురికి కదలకపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. మద్దిపాడు అరుంధతి నగర్‌లో మురుగు నీరు ముందుకు కదలకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కడియాల యానాదయ్య ప్రభుత్వ కళాశాల గోడ సమీపంలో చెత్తాచెదారం పేరుకొని పోయింది. గడియపూడి కాలనీలోకి కనీసం చెత్తబండి కూడా రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా వసంతపంచమి వేడుకలు

ఒంగోలు కల్చరల్ , ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంతపంచమి వేడుకలను సోమవారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సరస్వతీ అమ్మవారికి నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తమ పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతీ అమ్మవారి జన్మతిథిగా పేర్కొనే మాఘ శుద్ధ పంచమిని వసంతపంచమిగా జరుపుకుని ఆరోజు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే విద్యలో బాగా రాణిస్తారని నమ్మకం. స్థానిక మంగమూరు రోడ్డులోని మాంటిస్సోరి స్కూలులో సరస్వతీ పూజ అక్షరాభ్యాస వేడుకలను ప్రముఖ పురోహితులు కప్పర పణిశర్మ యాజ్ఞీకంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.శబరీనాథ్ నాయర్, పి.ప్రకాష్ బాబు, డైరెక్టర్ ఈషా గుప్తా, ప్రిన్సిపాల్ నరేష్ బాబు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పలు దేవాలయాలో సైతం సరస్వతీ పూజను నిర్వహించారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: వసంత పంచమి వేడుకలు మండలంలోని పలుగ్రామాలలో ఘనంగా జరిగాయి. పలు పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాల వద్ద విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతపంచమి నాడు అక్షరాభ్యాసం చేయటం పురాతనకాలం నుంచి వస్తున్న ఆచారం. మండల పరిధిలోని గ్రామాలలో గ్రామ దేవత ఆలయాలలో, మద్దిపాడు నారాయణ స్కూలు, నాగార్జున స్కూలు, ఎస్వీఎస్ లిటిల్ చాంప్స్, గుళ్లాపల్లి భరత్ స్కూలులో వసంత పంచమి వేడుకలు నిర్వహించి చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఎన్టీఆర్ కళాపరిషత్ పాటల పోటీ విజేతలు వీరే

ఒంగోలు కల్చరల్ , ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన పాటల పోటీ విజేతలను ఆదివారం రాత్రి ప్రకటించి బహుమతులు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 60 మంది గాయనీగాయకులు ఈ పోటీలలో పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజేతలకు, కన్సోలేషన్ విజేతలకు ఆదివారం రాత్రి నిర్వహించిన సభలో అతిథుల చేతులమీదుగా నగదు బహుమతిని, జ్ఞాపికను అందజేశారు. ఈ పోటీలలో పల్నాడు జిల్లా గుత్తికొండకు చెందిన రాయిని నాగరాజు ప్రథమ బహుమతిని, నెల్లూరుకు చెందిన గాయని పి.శ్రావ్యరెడ్డి ద్వితీయ బహుమతిని, కే.దుర్గా ప్రసాదరావు తృతీయ బహుమతిని కైవసం చేసుకోగా, రాజ్‌కుమార్, శౌరి శాండిల్యలు కన్సోలేషన్ బహుమతులను పొందారు. విజేతలకు ఏపీరాష్ట్ర పోలీస్ హౌసింగ్ చైర్మన్ ఏబీ వెంకటేశ్వర రావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తదితరులు బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు విజేతలను అభినందించారు.


ఏబీ వెంకటేశ్వర రావు నుంచి బహుమతి అందుకుంటున్న గాయని

ఇసుక తవ్వకాలను అడ్డుకొన్న తహసీల్దార్

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

నాగులుప్పలపాడు ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చదలవాడ వద్ద గుండ్లకమ్మ నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను స్థానిక తహసీల్దార్ కె.ప్రవీణ్ కుమార్ అడ్డుకొన్నారు. 'గుండ్లకమ్మలో ఇసుక తవ్వకాలు' అనే శీర్షికతో కథనం సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ స్పందించి ఆ భూముల రికార్డులను పరిశీలించారు. తవ్వకాలు జరుగుతున్న 403 సర్వే నంబరు పట్టా భూమిగా ప్రభుత్వ రికార్డులలో నమోదయినట్లు తెలిపారు. అక్కడ ఇసుక తవ్వకాలు జరపాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా పొందాలని, తవ్వకాలు చేస్తున్న వ్యక్తులకు సూచించారు. అనుమతులు లేకపోవడంతో తవ్వకాలను నిలిపివేసి అక్కడ ఎలాంటి తవ్వకాలు జరగకుండా గ్రామ రెవెన్యూ సహాయకులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

కనుల పండువగా కలశాభిషేకం

చీమకుర్తి,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావనారుషిస్వామి వారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కలశాభిషేకం జరిగింది. 108 కలశాలతో మహిళలు పవిత్ర జలాలను గాంధీనగర్‌లో ఉన్న కోదండరామస్వామి దేవాలయం నుంచి భావనారుషి దేవాలయం వరకు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. తదుపరి వేదమంత్రాల మధ్య మూలవిరాట్లకు అభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు.


పవిత్ర జల కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) అభిషేకం చేస్తున్న అర్చకుడు

పాఠశాలల్లో పాలిసెట్‌పై అవగాహన

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్‌పై పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సాంకేతిక సిబ్బందిని పాఠశాలల్లోకి అనుమతించాలని ఆదేశిస్తూ పాఠశాల విద్యా కమిషనర్ వి. విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ అభ్యర్థన మేరకు పాఠశాల విద్య కమిషనర్ ఈమేరకు డీఈవోలను ఆదేశించారు. సాంకేతిక విద్యపై పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది పాలిసెట్ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసి పరీక్షకు హాజరయ్యేలా చైతన్యవంతులను చేస్తారు. పాలిసెట్ జిల్లా నోడల్ ప్రిన్సిపాల్, వారి సిబ్బంది సంప్రదించినప్పుడు పదవ తరగతి విద్యార్థుల వివరాలను వారికి అందించి సహకరించాలని ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ ఆదేశించారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు విద్య,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకూరి అవినాష్, బి. శామ్యూల్‌లు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. కార్పొరేట్ విద్యా సంస్థలు తమకు ఇష్టం వచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తూ అక్రమ అడ్మిషన్లు చేయడాన్ని వారు తప్పుపట్టారు. అక్రమ అడ్మిషన్లపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

శానిటేషన్ మేస్త్రీలను కొనసాగించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పాలక సంస్థలో 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న శానిటేషన్ మేస్త్రీలను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసరావు కోరారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు

మద్దిపాడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగన్నపాలెం గ్రామంలో మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు అయ్యింది. నాగన్నపాలెంకు చెందిన మహిళ గత నెల27వ తేదీన తన కుమార్తెను కుక్క కరవడంతో ఇంజెక్షన్ చేయించేందుకు ఒంగోలు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియక పోవడంతో సోమవారం అతని భర్త శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నతరహా ఫ్యాక్టరీలకు చేయూతనందించండి

చీమకుర్తి,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): చిన్నతరహా కటింగ్ ఫ్యాక్టరీలకు చేయూతనందించాలని గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్స్ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు.రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో ఓనర్ల అసోసియేషన్ నాయకులు ప్రత్యేకసమావేశాన్ని నిర్వహించారు. కార్పొరేట్ వ్యవస్థలు పెద్దస్థాయిలో ఫ్యాక్టరీలు ఏర్పాటుచేయబోతుండటం చిన్న ఫ్యాక్టరీలను తీవ్రంగా దెబ్బతీసి మూతపడేలా చేస్తున్నాయని, ఇలాంటి వాటికి అనుమతులు మంజూరు చేయవద్దని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, నూకల సురేంద్రకుమార్, కందిమళ్ల గంగాధరరావు, అహ్మద్‌బాషా, మలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


తన భర్త అంకబాబు తప్పి పోయారని టూటౌన్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న భార్య, కుటుంబసభ్యులు

ఆత్మహత్య చేసుకుంటున్నానని సిటీకేబుల్ అంకబాబు వీడియో

● మీడియా గ్రూపులలో వైరల్
● సాంకేతికత ఆధారంగా పోలీసుల గుర్తింపు
● మిస్సింగ్ కేసు నమోదు

ఒంగోలుక్రైం,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): సిటీకేబుల్ వ్యవహారంలో భాగస్వాములు మోసం చేశారని మనస్తాపానికి గురై తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి మీడియా గ్రూపులలో అడుసుమల్లి అంకబాబు సోమవారం వైరల్ చేశారు. అదేసమయంలో తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. దీంతో ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌కు అంకబాబు కుటుంబ సభ్యులు వచ్చారు. అక్కడ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి వార్షిక తనిఖీలో భాగంగా ఉన్నారు. దీంతో అంకబాబు కుమారుడు విజయ్ తన తండ్రి కనిపించడం లేదని, సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారని చెప్పడంతో వెంటనే అక్కడ పోలీసులను విచారించమని ఐజీ ఆదేశించించారు. సాంకేతిక పద్ధతుల ఆధారంగా సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిన ప్రాంతాన్ని గుర్తించారు. అంకబాబు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని ఆయన క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌కు విజయ్ వచ్చి తన తండ్రి ఆచూకీ తెలిసిందని క్షేమంగా ఉన్నాడని ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠికి, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో కషాయం తయారీపై అవగాహన

కొండపి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంలో కషాయం తయారీ విధానంపై మండలంలోని కట్టావారిపాలెంలో రైతులకు సంబంధిత అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. కోడిగుడ్లు, నిమ్మకాయలను ఉపయోగించి కషాయం తయారు చేసి చూపించారు. దాని వలన ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయం కొండపి యూనిట్ ఇన్‌చార్జి రంజిత్‌కుమార్ వివరించారు. ఈ కషాయం వలన మొక్కలకు అధిక పోషక విలువలు అందుతాయని, కాయలు బలంగా వృద్ధి చెందుతాయన్నారు. తాలు శాతం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు మాలకొండయ్య, గౌతమి, రైతులు ఆరికట్ల రాఘవులు, మద్దాల సుబ్బారావు, రమణయ్య, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.


కషాయం తయారీని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు :ఐటీసీ సహకారంతో గ్రామ సిరిసంస్థ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలు గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సోమవారం శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఐటీసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ఢీకొని రైతు మృతి


మాలకొండయ్య (ఫైల్)

కొండపి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పొలంలో అరక పనులు ముగించుకొని కాడెడ్లతో వెళ్తున్న రైతును మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఆయన మృతి చెందాడు. బైకిస్టుకు గాయాలయ్యాయి. ఈ ఘటన పెరిదేపి-కొండపి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మిట్టపాలెం గ్రామానికి చెందిన ధర్నాశి శివ మోటార్ సైకిల్‌పై సోమవారం రాత్రి 7గంటల సమయంలో కొండపి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదేసమయంలో జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన మంచాల మాలకొండయ్య పెరిదేపి సమీపంలోని పొగాకు చేలో అరక తోలి ఎద్దులతో పెరిదేపికి వస్తున్నాడు. చీకటి కావడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న శివ కాడెడ్లను తోలుకొని వెళ్తున్న మాలకొండయ్యను ఢీకొట్టి కింద పడ్డాడు. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అక్కడ వైద్య సాయం పొందుతూ మాలకొండయ్య మృతి చెందాడు. కొండపి పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసు నమోదు చేయడం లేదని ఐజీకి ఫిర్యాదు

ఒంగోలుక్రైం,ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): పదకొండేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదని కేశరాజు కుంటకు చెందిన బాధితురాలి తల్లిదండ్రులు గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వార్షిక తనిఖీకి వచ్చిన ఐజీని బాధితులు కలిసి తాలుకా పోలీసుల నిర్లక్ష్యం గురించి వివరించారు. వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఐజీ పోలీసులను ఆదేశించారు.

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్పీ దామోదార్

గిద్దలూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

రికార్డుల పరిశీలన, సిబ్బందికి పలు సూచనలు

పోలీసు పెట్రోల్ బంకు స్థలం పరిశీలన

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని జిల్లా ఎస్పీ దామోదర్ చెప్పారు. సోమవారం ఆయన గిద్దలూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. కేసులపై ఆరా తీశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, పోలీసు పాత క్వార్టర్స్ సిబ్బంది పనితీరు, విధులు ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను, ప్రాపర్టీని అధికారుల అనుమతితో డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాల పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు.



పోలీసు సిబ్బందితో కలిసి తేనీరు సేవిస్తున్న ఎస్పీ దామోదర్, డీఎస్పీ నాగరాజు

ప్రజలకు సీసీ కెమెరాల పట్ల అవగాహన కల్పించి వారు వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రిపూట ముమ్మరంగా గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారినపడితే 1930కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం పాత పోలీసుస్టేషన్ వద్ద పోలీసు పెట్రోలింగ్ బంకు కోసం కేటాయించిన స్థలాన్ని జిల్లా ఎస్పీ దామోదర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, స్పెషల్ బ్రాంచి ఇన్ స్పెక్టర్ రాఘవేంద్రరావు, సీఐలు కె.సురేష్, రామకోటయ్య, మల్లికార్జునరావు, ఎస్సై ఇమ్మానియేలు పాల్గొన్నారు.

రాచర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

గిద్దలూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : రాచర్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం ఉదయం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసుస్టేషన్ సిబ్బందితో కలిసి ఎస్పీ దామోదర్ తేనీరు సేవించి వారి కుటుంబాల నేపథ్యం, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కంభం, అర్థవీడులలో...

కంభం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కంభం సీఐ కార్యాలయాన్ని, అర్థవీడు పోలీసుస్టేషన్లను ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సందర్శించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ ఎన్ఆర్ఐ నాయకులు సయ్యద్ రఫి కంభం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల భద్రత కోసం పోలీసులకు 3 సీసీ కెమెరాలు ఇచ్చారు. టీడీపీ ఎస్సీ నాయకులు గోన చెన్నకేశవులు, మైనారిటీ నాయకులు ఖాదర్‌హుస్సేన్, జడ్పీటీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాసులు, ఆర్యవైశ్య టీడీపీ నాయకులు బిజ్జాల కిశోర్ పాల్గొన్నారు.

కొమరోలులో..

కొమరోలు, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): కొమరోలు పోలీసు స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ సందర్శించారు. సీఐ రామకోటయ్య మాట్లాడుతూ ఎస్సై వెంకటేశ్వర నాయక్ కొమరోలు, తాటిచర్ల మోటుల్లో సీసీ కెమరాలను ఏర్పాటుచేయించారన్నారు.

వైభవంగా సరస్వతీ దేవి పూజలు.. సామూహిక అక్షరాభ్యాసం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 3 ఆంధ్రజ్యోతి: చదువుల తల్లి సరస్వతీ దేవికి వసంత పంచమి సందర్భంగా మార్కాపురంలోని పలు పాఠశాలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కమలా కాన్సెప్ట్ స్కూల్‌లో కరస్పాండెంట్ పెనుగొండ పవన్ కుమార్ సరస్వతీదేవి పూజ చేసి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య ఆధ్వర్యంలో వసంత పంచమి, అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏవో రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక సాయి చైతన్య హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరస్వతీపూజ, అక్షరాభ్యాసం నిర్వహించారు. సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో వైభవంగా అక్షర స్వీకార మహోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు సరస్వతీ దేవి అలంకరణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

బోడపాడులో...

మార్కాపురం రూరల్, ఫి బ్రవరి3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీ దేవి వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహానికి విద్యార్థులతో కలిసి శ్లోకాలు ఆలపించారు. పూజలు చేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, హనుమంతరావు, షఫి ఉన్నిషా, హనుమంతు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రంగనాయకులు, డీలర్ రామక్రిష్ణారెడ్డి, విగ్రహ దాతలు తదితరులు పాల్గొన్నారు.



బోడపాడులో ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రార్థనలు

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం గౌతవరం గ్రామంలో పోలేరమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. జనసేన యూత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ముఖద్వారం ప్రారంభం

రాచర్ల మండలం అనుమలపల్లి గ్రామంలో జీవనమూర్తిస్వామి దేవాలయ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు కటికె యోగానంద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగనాయకులు, టీడీపీ నాయకులు జీవన్ రెడ్డి, వెంకటపతి, మాజీ సర్పంచ్ భూపని కాశయ్య పాల్గొన్నారు.

'కబ్జా చేసిన మా స్థలాన్ని ఇప్పించండి'

కంభం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ పేర్ల మీద ఉన్న 40 సెంట్ల స్థలంలో 20 సెంట్లను వేరే వ్యక్తులు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, తమ స్థలాన్ని ఇప్పించాలని కంభంకు చెందిన షేక్ ఫాతిమా సోమవారం కుటుంబసభ్యులతో వచ్చి స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కు అర్జీ ఇచ్చారు. స్పందించిన తహసీల్దార్ ఆ స్థలం రికార్డులను పరిశీలించారు. సోమవారం స్పందనలో 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న పొలాన్ని రెవెన్యూ అధికారులు వేరొకరికి ఆన్‌లైన్ చేశారంటూ బాధితురాలు గురవమ్మ తరఫున ఆయన అల్లుడు రమణారెడ్డి మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఎర్రగొండపాలెం పరిధిలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై విచారణకు వచ్చిన ఆయనకు ఈ ఫిర్యాదు రావడంతో షాక్‌కు గురయ్యారు. బాధితుడి మాటల్లోనే... ఎర్రగొండపాలెం - మార్కాపురం జాతీయ రహదారిలోని శేషాద్రి మిల్క్ సెంటర్ సమీపంలో సర్వే నెంబరు 333-1లో కొత్తపల్లికి చెందిన వనిపెంట గురవమ్మ(60) పేరిట ఉన్న పొలాన్ని షేక్ మహమ్మద్ రఫీ అనే వ్యక్తికి ఆన్‌లైన్ చేశారు. దీనిపై గత నెలలో తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా ఆన్‌లైన్ తొలగించకపోగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. సమస్యను చూసి పరిష్కరించాలని డీటీ మల్లికార్జున నాయుడును ఆదేశించారు. తహసీల్దారు బాలకిషోర్ చేసిన అక్రమ ఆన్‌లైన్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తుండడం గమనార్హం.



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నబాధితుడు రమణారెడ్డి

పొట్టకూటి కోసం వచ్చి అనంతలోకాలకు..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- యువకుడు మృతి

పామూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం ఊరు గాని ఊరు వచ్చి చనిపోయాడు. ఆదివారం అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలానికి చెందిన అశోక్ (21) మృత్యువాతపడ్డారు. ఈఘటన పామూరు వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ అశోక్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పామూరు పంచాయతీ పరిధిలోని గోపాలపురం వద్ద ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు రంపచోడవరం మండలం బూసిగూడెంకు చెందిన విష్ణు, అశోక్‌లు ఆదివారం ఉదయం గోపాలపురం గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో సరుకుల కోసం ఇటుక బట్టీ యజమానికి చెందిన ద్విచక్ర వాహనంపై పామూరుకు వచ్చి పనులు ముగించుకొని తిరిగి గోపాలపురం గ్రామానికి వెళుతున్నారు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి నెల్లూరు జిల్లా వరికుంటపాడు గ్రామానికి వెళుతున్న కారు గోపాలపురం జాతీయ రహదారి సమీపం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చొన్న అశోక్(21) ఎగిరి కారును తగిలి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న విష్ణుకు స్వల్ప గాయాలయ్యాయి. విష్ణును మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మృతుడు, క్షతగాత్రుడు అవివాహితులు. విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని రైతు మృతి

కొండపి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పొలంలో అరక పనులు ముగించుకొని కాడెడ్లతో వెళ్తున్న రైతును మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఆయన మృతి చెందాడు. ఈ ఘటన పెరిదేపి-కొండపి మధ్య చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మిట్టపాలేనికి చెందిన ధర్నాశి శివ మోటార్ సైకిల్‌పై సోమవారం రాత్రి కొండపి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన మంచాల మాలకొండయ్య పెరిదేపి సమీపంలోని పొగాకు చేలో అరక తోలి ఎద్దులతో పెరిదేపికి వస్తున్నాడు. బైక్‌పై వెళ్తున్న శివ కాడెడ్లను తోలుకొని వెళ్తున్న మాలకొండయ్యను ఢీకొట్టి కింద పడ్డాడు. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య సాయం పొందుతూ మాలకొండయ్య మృతి చెందాడు. కొండపి పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి). మండలంలోని బోడపాడు గ్రామ చెరువు అభివృద్ధి పనులను నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా బోడపాడు గ్రామ టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, రూపనగుడి వెంకటేశ్వరరెడ్డి, చదలవాడ రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన చాంపియన్స్ కరాటే డో స్పోర్ట్స్‌కు చెందిన 14మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ అందుకున్నారు. 8వ జాతీయస్థాయి కరాటే పోటీలు గత రెండు రోజులుగా విశాఖపట్నంలో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ యాసిన్ ఆధ్వర్యంలో వీరు ప్రతిభచూపారు. ఏ.వెంకటేశ్వరరెడ్డి, టి.మోహన్‌ప్రదీప్‌రెడ్డి, జి.లక్ష్మీదీపక్ కటాస్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఎస్కే సమాన్‌సర్ఫాజ్, పి.వెంకటరాజేశ్వరి, ఎస్కే అబ్దుల్ అజీమ్, ఎస్కే సాషీరా, జి.సుప్రియ, వి.దీక్షిత్‌సునీల్‌రెడ్డిలు బంగారు పతకాలు సాధించారు. పి.అవినాష్, ఏ. వెంకటధరణ్‌రెడ్డి కటాస్ ఫైట్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించగా, ఎస్కే అఫ్రుద్దీన్ సిల్వర్ మెడల్, కె.హవీస్‌వర్ధన్‌రెడ్డి గోల్డ్‌మెడల్, పి.వెంకటరాజ్యలక్ష్మి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని కరాటే మాస్టర్ యాసిన్ అభినందించారు.



పతకాలు సాధించిన చిన్నారులు

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మానసిక ఒత్తిడికిలోనై నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానిక పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదురుగా కుందారపు వసంతలక్ష్మీ(51) భర్త, కుమారుడితో కలసి టిఫిన్ సెంటరును నడుపుతున్నారు. కొద్ది రోజులుగా ఆమె ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు మానసికంగా ఒత్తిడికి లోనైందని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయిందని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్సై పి.చౌడయ్య సంఘటన స్థలానికి చెరుకొని మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలఉగ్రకు అధికార లాంచనాలతో అంత్యక్రియలు



బాలఉగ్ర అంత్యక్రియల్లో పోలీసులు

కొమరోలు, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లాంచనాలతో కానిస్టేబుల్ బాలఉగ్రకు సోమవారం ఆయన స్వగ్రామమైన మండలంలోని పుల్లారెడ్డిపల్లిలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. గత నెల 19న కారులో గుంటూరు వెళ్తుండగా రోడ్డుప్రమాదం తీవ్రగాయాలపాలై ఆదివారం మృతి చెందారు. అంత్యక్రియల సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గిద్దలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌కాలనీ నందు గల సంజీవిని అనాథ వృద్ధాశ్రమానికి గుర్రాల అమ్మన్ని ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబీకులు గుర్రాల మల్లికార్జున్ నిత్యావసర వస్తువులను, 1000 లీటర్ల సింటెక్స్ ట్యాంక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

గొర్రెలు, పొట్టేళ్లకు చికిత్స

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో శనివారం 30 గొర్రెలు, పొట్టేళ్లు మృతి చెందగా 8 గాయపడ్డాయి. సోమవారం పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తాళ్లపల్లి గ్రామానికి వెళ్లి వాటికి చికిత్స అందించారు. గాయాలైన జీవాలకు అవసరమైన మందులు, టీకాలను అందించారు. గ్రామానికి చెందిన చిన్నతిరుమలయ్య జరిగిన సంఘటన గురించి వైద్యులకు తెలిపారు. వైద్యం అందించిన వారిలో వీఏల్‌వో రంగనాయకులు, ఏహెచ్‌ఏ మోహన్ ఉన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.1.33 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానానికి ఆదాయం రూ.లక్షా 32 వేల 809 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.47,600, లడ్డూ అమ్మకం ద్వారా రూ.22,480, మహాప్రాకారానికి విరాళాల ద్వారా రూ.30,001, అన్నదానానికి రూ.23,596, ఇతర విరాళాల ద్వారా 9,132 వచ్చినట్లు తెలిపారు.

అవీఇవీ

నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 3 ఆంధ్రజ్యోతి : స్థానిక గుండ్లకమ్మ నదీతీరాన ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు చొక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణలు తెలిపారు. 4వ తేదీన ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 5న శేషవాహనం, 6 హనుమంత వాహనం, 7 బ్రహ్మోత్సవ కల్యాణం, అదేరోజు సాయంత్రం గరుడ వాహనం నిర్వహించనున్నట్లు తెలిపారు. 8న రథోత్సవం, 9న అశ్వవాహనం, 10న ఊంజల్ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను తిలకించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు సేవ చేసి మంచి పేరు తీసుకురావాలి



సచివాలయ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

కొమరోలు, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రజలకు సత్వరమే మంచి సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తహసీల్దార్ భాగ్యలక్ష్మి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీని తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు షేక్ జమాల్ వలి, మందా ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ దేశావత్ నాయక్, వీఆర్వోలు రమణారావు, పాండు, రమణ, సర్వేయర్లు సోమశేఖర్, సుభాని బాష, మనిషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంఈవో మస్తాన్ నాయక్

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాల గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు ఎంఈవో మస్తాన్‌నాయక్ సోమవారం భూమి పూజ చేశారు. ప్రధానోపాధ్యాయులు మండ్ల శ్రీనివాసులు పాఠశాల అభివృద్ధి కోసం ఇటీవల దాతల సహాయాన్ని కోరడంతో స్పందించి విరాళాలు అందజేశారు. ఈ నిధులతో సభా వేదిక, చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ సుబ్బారావు, గ్రామ సర్పంచి పోలమ్మ, పెద్దలు మల్లికార్జున రెడ్డి, శ్రీనివాసులు, రాజు, కాశీరావు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

పెద్దారవీడు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండంచర్ల సమీపంలోని వేనూతల కాటంరాజు దేవస్థానం సమీపంలో భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.24 లక్షలతో నూతన భోజనశాల నిర్మాణానికి యాదవ సంఘం జాతీయ క్రమశిక్షణ సంఘం చైర్మన్ పిన్నిక ప్రసాద్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరగనున్న కాటంరాజు తిరునాళ్ల సందర్భంగా సుమారు 2 లక్షలమంది భక్తులు దర్శనానికి వస్తారని తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చొరవతో రూ.50 లక్షలతో గుండంచర్లకు నూతన రోడ్డు నిర్మిస్తున్నట్లు టీడీపీ జిల్లా బీసీ సెల్ నాయకులు గుమ్మా గంగరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వెంకట్రాజు యాదవ్, యాదవ సంఘ నాయకులు ఒంటేరు నాగేశ్వరరావు, గోను సుబ్బారావు, గుమ్మా బాలనాగయ్య, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల పేద ఆర్యవైశ్య విద్యార్థులకు శ్రీవాసవి ఆర్యవైశ్య పేద విద్యార్థుల సేవాసంస్థ ఉపకార వేతనాలను అందచేసింది. స్థానిక వాసవీ భవన్‌లో 26 మంది ప్రతిభ గల పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికి 10వేల వంతున 2.60 లక్షల రూపాయల ఉపకార వేతనాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శివపురం పీరయ్య, సంస్థ కోశాధికారి రాచపూటి నరసింహారావు, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు, ఆవోపా అధ్యక్షులు దారా రాములు, పలువురు దాతలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థినులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతిలో అంతర్గత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు సోమవారం చిన్ని సేవాసంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ స్టడీమెటీరియల్ అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

» పదికి ప్రత్యేక బోధన
» వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ

దొనకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు తొలిమెట్టు. వారి బంగారు భవిష్యత్తుకు దశ, దిశ నిర్దేశించేది పదో తరగతే. ఇక్కడ మంచి ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట పడుతుంది. దీనిని అధిగమించేందుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉన్నతాధికారులు రూపొందించిన నూరు రోజుల ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యే శ్రద్ధ తీసుకుంటున్నారు.

మండలకేంద్రమైన దొనకొండ జడ్పీ పాఠశాల పరీక్షాకేంద్రం పరిధిలో దొనకొండ జడ్పీ పాఠశాలలో 157 మంది, ఆరవల్లిపాడు జడ్పీ పాఠశాలలో 35, చందవరం జడ్పీ పాఠశాలలో 38, గంగదేవిపల్లి జడ్పీ పాఠశాలలో 39, కొచ్చెర్లకోట జడ్పీ పాఠశాలలో 48, మల్లంపేట జడ్పీ పాఠశాలలో 71, మంగినపూడి జడ్పీ పాఠశాలలో 26, తెల్లబాడు జడ్పీ పాఠశాలలో 68, కేజీబీవీ పాఠశాలలో 46, శ్రీవివేకానంద ఉన్నత పాఠశాలలో 13, సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో 7, విశ్వభారతి ఉన్నత పాఠశాలలో 66 మంది చదువుతున్నారు. మొత్తం 12 పాఠశాలల్లో 614 మంది పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. అన్నీ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు డిసెంబర్‌కు సిలబస్


తెల్లబాడు జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

పూర్తి చేశారు. విద్యాశాఖ నిర్ణయించిన టైం టేబుల్ ప్రకారం జనవరి నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృతి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారిలో విద్యా సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

వంద రోజుల ప్రణాళిక

వీవీ రామాంజనేయులు, హెచ్‌ఎం, దొనకొండ జడ్పీ పాఠశాల



గతేడాది 95శాతం ఫలితాలను సాధించాం. ఈఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు నిర్ణయించిన వందరోజుల ప్రణాళికతో ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతున్నాం. ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు దాతల సహకారంతో స్నాక్స్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం

నీతమ్మ, హెచ్‌ఎం, తెల్లబాడు జడ్పీ ఉన్నత పాఠశాల



విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రోజుకో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఇందులో విద్యార్థుల లోపాలను గుర్తించి సరిదిద్దుతున్నాం. భయం లేకుండా పరీక్షలు వ్రాసేలా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నాం.

అర్ధంతరంగా ఆగిన రైతుబజారు

» ఏడాదిగా నిలిచిపోయిన పనులు
» గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం
» కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు


నిలిచిపోయిన రైతు బజారు నిర్మాణ పనులు

దర్శి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో కూరగాయలు, పండ్లు, పూల తోటలు సాగుచేసే రైతులు పండించిన పంటలను విక్రయించుకునేందుకు వీలుగా పట్టణంలోని కురిచేడు రోడ్డులో నిర్మాణం చేపట్టిన రైతుబజారు ఏడాదిగా మధ్యలోనే నిలిచిపోయింది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో నిధులు విడుదల చేయలేదు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలేశారు. ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారటంతో సంబంధిత కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. అప్పటినుంచిరైతుబజారు నిర్మాణం అలాగే ఉన్నది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోడలు వెక్కిరిస్తున్నాయి.

దర్శి ప్రాంతంలో ముమ్మరంగా కూరగాయలు, దానిమ్మ, బత్తాయి, నిమ్మ, డ్రాగిన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వారు నిల్వ చేసుకొని విక్రయించుకునే అవకాశంలేక పొలాల్లో నుంచే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రైతులకు ఎంతో ఉపయోగం కల్గే రైతుబజారు నిర్మాణం మధ్యలో నిలచిపోవటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారు నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ ద్వారా రూ.80 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇందులో 50 రూములు నిర్మాణం చేపట్టారు. అందులో 42 రూములు కూరగాయలు పండించే రైతులకు, మిగిలిన రూములు ఇతర పంటలు పండించే రైతులకు కేటాయించేందుకు వీలుగా షాపుల నిర్మాణం చేపట్టారు. అయితే, గోడలు నిర్మించి వదిలేయటంతో మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రైతుబజారు నిర్మాణానికి చర్యలు తీసుకుంటారని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యను గుర్తించి రైతుబజారు నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాళ్లూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అధ్వాన రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాళ్లూరు నుంచి కుంకుపాడు మీదుగా అద్దంకి వెళ్లే రహదారి గుంతలమయమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లూరు నుంచి కుంకుపాడు మీదుగా అద్దంకి 16 కిలోమీటర్లు ఉంటుంది. చీమకుర్తి, ఒంగోలు మండలాలకు చెందిన ప్రజలతో పాటు బొద్దికూరపాడు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఈరోడ్డు గుండా అద్దంకి వెళ్లి విజయవాడ, గుంటూరు వంటి పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు.


అధ్వానంగా తాళ్లూరు-అద్దంకి రోడ్డు


అద్దంకి వెళ్లేమార్గంలో తాళ్లూరు శివారున దెబ్బతిన్న రోడ్డు

అయితే, తాళ్లూరు నుంచి అద్దంకి మండలం కుంకుపాడుకు రోడ్డు దారుణంగా ఉంది. గత పాలకులు ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. గతంలో వేసిన మెటల్ లేచిపోయి గుంతలు పడ్డాయి. దీంతో వాహన రాకపోకలకు అవరోధంగా మారింది. ఈమార్గంలో నిత్యం అధిక సంఖ్యలో పాల వాహనాలు, ఇసుక లారీలు, ఇటుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి.

ప్రస్తుత అద్దంకి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన నియోజకవర్గ పరిధిలోని కుంకుపాడు వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. కుంకుపాడు నుంచి అద్దంకి వెళ్లే మార్గంలో కొటికలపూడి కాలనీ నుంచి తిమ్మాయిపాలెం వరకు తారు రోడ్డు వేశారు. కుంకుపాడు నుంచి తాళ్లూరు వెళ్లే మార్గం మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తాళ్లూరు - కుంకుపాడు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే జరిమానా

» డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేలు జరిమానా విధిస్తామని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. హెల్మెట్‌ధారణపై పట్టణంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొంతమంది తమ పిల్లలకు మోటార్‌బైక్‌లు ఇస్తున్నారని చెప్పారు. దీంతో వీరు నిబంధనలను ఉల్లంఘించటంతో పాటు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్‌ల కుటుంబసభ్యులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర


హెల్మెట్ ధరించి వాహనం నడిపేవారికి గులాబి పువ్వుతో అభినందిస్తున్న పోలీసులు

వాహనాలు నడిపేవారితో పాటు వారితో కలసి వెళ్ళేవారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారి బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. జరిమానాలు మూడుకు మించి ఉంటే వారి లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. హెల్మెట్ ధరించి నడిపే వారికి పోలీసులు గులాబి పువ్వు ఇచ్చి అభినందిస్తూ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్‌ఐ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన చాంపియన్స్ కరాటే డో స్పోర్ట్స్‌కు చెందిన 14మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి మెడల్స్ అందుకున్నారు. 8వ జాతీయస్థాయి కరాటే పోటీలు గత రెండు రోజులుగా విశాఖపట్నంలో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగాయి.

ఈ పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ యాసిన్ ఆధ్వర్యంలో వీరు ప్రతిభచూపారు. ఏ.వెంకటేశ్వరరెడ్డి, టి.మోహన్‌ప్రదీప్‌రెడ్డి, జి.లక్ష్మీదీ పక్ కటాస్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఎస్‌కే సమాన్‌సర్ఫ్రాజ్, పి.వెంకటరాజేశ్వరి, ఎస్‌కే అబ్దుల్ అజీమ్, ఎస్‌కే సాఫీరా, జి.సుప్రియ, వి.దీక్షిత్‌సునీస్‌రెడిలు బంగారు పతకాలు సాధించారు.

పి.అవినాష్, ఏ. వెంకటధరణిరెడ్డి కటాస్ ఫైట్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించగా, ఎస్‌కే అఫ్రుద్దీన్ సిల్వర్ మెడల్, కె.హావీస్‌వర్ధన్‌రెడ్డి గోల్డ్‌మెడల్, పి.వెంకటరాజ్యలక్ష్మి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని కరాటే మాస్టర్ యాసిన్ అభినందించారు.



జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ముఖాముఖి

రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా

షేక్ నాగూర్‌వలి, ఏఈ, దొనకొండ



ప్రశ్న: మండలంలో రైతులకు ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా ఇస్తున్నారు?

జవాబు: రైతులకు ఉదయం 8.45 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

ప్ర: రైతులకు త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్నిరోజులకు ఇస్తున్నారు?

జ: గతంలో నెలన్నర రోజుల వ్యవధిలో ఇచ్చేవారం. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న రెండు, మూడు నెలల వ్యవధిలో ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర: మండలంలో ఎన్ని విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి, లోటల్టేజీ సమస్య ఉందా?

జ: మండలంలో దొనకొండ, రుద్రసముద్రం, చందవరం, మంగినపూడి, కొచ్చెర్లకోట, వెంకటాపురంలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. మండలంలోని ఏ గ్రామంలోనూ లోటల్టేజీ సమస్య లేదు. అన్నీగ్రామాల్లో నాణ్యమైన కరెంట్‌ను ప్రజలకు అందిస్తున్నాం.

ప్ర: మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత ఉందా?

జ: మండలంలోని పోలేపల్లి, రామిరెడ్డిపల్లి, కందులవారిపల్లి, చందవరం, బట్టిపాడు, ఆరవల్లిపాడు, పి కంభంపాడు, తెల్లబాడు, సిద్దాయిపాలెం, కొచ్చెర్లకోట, రామాపురం, కట్టకిందపల్లి, బసిరెడ్డిపల్లి, నారపురెడ్డిపల్లి గ్రామాల్లో జేఎల్‌ఎం (ఎనర్జీ అసిస్టెంట్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్ర: మీటర్ల కొరత ఉందనేది వాస్తవమేనా?

జ: మండలంలో ఎటువంటి మీటర్ల కొరత లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వెంటనే తమ సిబ్బంది వెళ్లి మీటర్లు బిగిస్తున్నాం.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 33 వేలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం రూ.లక్షా 32 వేల 809 వచ్చినట్లు ఈవో నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.47,600, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ. 22,480, మహాప్రాకారానికి విరాళాల ద్వారా రూ.30,001, అన్నదానం విరాళాల ద్వారా రూ.23,596, ఇతర విరాళాల ద్వారా 9,132 వచ్చినట్లు తెలిపారు. మహాప్రాకారానికి జైపూర్‌కు చెందిన అట్లా భీమారాజు ఉషారాణి దంపతులు రూ.30,001 అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఆలయ సిబ్బంది, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

సేవా సంఘం కార్యవర్గం

దర్శి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాకతీయ కమ్మ సేవా సంఘం దర్శి పట్టణ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గోనుగుంట్ల శ్రీధర్, కార్యదర్శిగా మానికొండ మల్లికార్జున, సహాయ కార్యదర్శిగా కూరపాటి హనుమంతరావు, కోశాధికారిగా దామా తిరుపతిస్వాములు, మరికొంతమంది గౌరవ సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పామూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన రైతు సమస్యలను పరిశీలించి పరిష్కరానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు సూచిం చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై పలు దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేష్, ఏపీవో బి.మాల్యాద్రి, అసిస్టెంట్ సీడీపీవో పి.లావణ్య, సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టుపెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

ముండ్లమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టుపెట్టిన మండలంలోని కొమ్మారం గ్రామానికి చెందిన వైసీపీ నేత మేకల వెంకటేశ్వరరెడ్డిపై సోమవారం టీడీపీ మండల నాయకులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని మేకల వెంకటేశ్వరరెడ్డి కించపరిచే విధంగా మాట్లాడి వీడియో క్లిపింగ్స్ పలు గ్రూపుల్లో పెట్టాడు. దీనిపై స్పందించిన ఈదర గ్రామానికి చెందిన ఎరబోలు చంద్రశేఖరరెడ్డితో పాటు టీడీపీ నాయకులు ఎస్‌ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపీపీ కోడిగ మస్తాన్‌రావు, కొర్రపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు, బిజ్జం వెంకటసుబ్బారెడ్డి, మేదరమెట్ల కోదండరామయ్య, నిడిగంటి నారాయణ, రమణాల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.


గౌరు చరిత దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పాణ్యం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ ఉగ్ర

పామూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి దంపతులను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం కర్నూల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గౌరు దంపతులకు పుష్పగుచ్ఛం అందజేశారు. నంతరం పలు అంశాలపై చర్చించారు. గౌరు చరిత వెంకటరెడ్డి దంపతులను కలిసిన వారిలో పువ్వాడి తిరుపతమ్మ, పువ్వాడి రామకృష్ణ ఉన్నారు.

పొట్టకూటి కోసం వచ్చి అనంతలోకాలకు..

» ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు » యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ అశోక్‌బాబు

పామూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కో సం ఊరు గాని ఊరుకు వ చ్చి ఆదివారం అర్ధరాత్రి జరి గిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలానికి చెందిన అశోక్ (21) మృత్యువాతపడ్డారు. ఈఘటన పామూరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ టి.అశోక్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..

పామూరు పంచాయతి పరిధిలోని గోపాలపురం వద్ద ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు రంపచోడవరం మండలం బూసిగూడెంకు చెందిన విష్ణు, అశోక్‌లు ఆదివారం ఉదయం గోపాలపురం గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో సరుకుల కోసం ఇటుక బట్టీ యజమానికి చెందిన ద్విచక్ర వాహనంపై పామూరుకు వచ్చి పనులు ముగించుకొని తిరిగి గోపాలపురం గ్రామానికి వెళుతున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి నెల్లూరు జిల్లా వరికుంటపాడు గ్రామానికి వెళుతున్న కారు గోపాలపురం జాతీయ రహదారి సమీపం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చొన్న అశోక్(21) ఎగిరి కారును తగిలి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న విష్ణుకు స్వల్ప గాయాలయ్యాయి. విష్ణును మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మృతుడు, క్షతగాత్రుడు అవివాహితులు. విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'గొంతెత్తి చాటేలా డప్పులతో కదలిరండి'


జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ కృషి ఫలితాన్ని చాటిచెప్పేలా ఈనెల 7న హైద్రాబాద్‌లో జరిగే లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యక్రమానికి తరలి రావాలని ఎమ్మార్పీఎస్ కనిగిరి ఇన్‌చార్జ్ కోటయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్కు వద్ద జగ్జీవన్ విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కోటయ్య మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ కృషితో ఎస్సీ వర్గీకరణ పోరాటం ఫలించిందన్నారు. అందుకోసం కృతజ్ఞతగా కేంద్రానికి తెలియచేసేలా ప్రతిఒక్కరూ డప్పుతో కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హెచ్‌ఎంపాడు మండల అధ్యక్షుడు జుటికే రామయ్య, వెలిగండ్ల అధ్యక్షుడు గూడూరి శేఖర్, పీసీపల్లి అధ్యక్షుడు గంగవరపురాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైను

» కలుషితమవుతున్న తాగునీరు

పీసీపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వంతో ప్రజల దాహాన్ని తీర్చాల్సిన నీరు వృథాగా పోతున్నది. మండలంలోని పెద్దన్నపల్లి గ్రామప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు గ్రామం వెలుపల రెండు కి.మీ దూరంలో బోరు వేసి అక్కడినుంచి పైపుల ద్వారా నీరు సరఫరా అవుతోంది. వారం రోజుల క్రితం గ్రామంలో వి ద్యుత్‌స్తంభాలు వేసేందుకు ఎక్స్‌కవేటర్ ద్వారా గుంతలు తీశారు. ఆసమ యంలో రామాలయం సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేసేక్రమంలో తాగునీరు సరఫరా అయ్యే పైపులైను పగిలిపోయింది. అప్పటినుంచి అటు విద్యుత్‌శాఖ అధికారులు, ఇటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ పాలకవర్గం కానీ పైపులైను మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన నీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తుంది. పగిలిన పైపులో బురద కలవడంతో తాగునీరు కలుషిత మవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిన పైపులైనుకు మరమ్మతులు చేయించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పైపు పగిలిన ప్రదేశంలో కలుషితమైన నీరు


రోడ్డుమీద వృథాగా పోతున్న నీరు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 4 ఫిబ్రవరి 2025



దోపిడీకి.. ఏఐ వల



నిన్నటి వరకు సీబీఐ, లేక ఢిల్లీ పోలీసుల మని బెదిరింపు కాల్స్ చేయటం, రిజర్వ్ బ్యాంక్ నుంచి, టెలికమ్ సర్వీసు సంస్థల నుంచి ఫోన్ చేసి సిమ్ బ్లాక్ చేస్తామని, ఖాతాలు స్థంబింపచేస్తామంటూ కాల్స్, మెసేజ్‌లు చేసిన పరిస్థితి ఉండటంతో కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ జనాన్ని అప్రమత్తం చేసేందుకు ఏకంగా అందరి సెల్ ఫోన్‌లో కాల్ చేసేప్పుడు ఒక కాలర్ టోన్ కింద ఈ మోసాలకు సంబంధించి జాగ్రత్తలు వివరిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు వీటిని కూడా దాటి సరికొత్త మోసాలకు సైబర్ కేటుగాళ్లు సిద్ధమై పోతున్నారు. మన ఫోన్ నుంచి ఏ తరహా ఆర్థిక లావాదేవీ చేసినా, చేసేముందు అప్రమత్తతతో ఉండాలనేది నిపుణుల మాట.

సైబర్ మోసాలపై ప్రభుత్వం ఎంత అవగాహన కల్పించినా... ఒకసారి మోసపోయాం కదా! మరోసారి జాగ్రత్త పడదామని అంతకు మించిన అప్రమత్తతోఉన్నా, సాంకేతికను ఉపయోగించుకుని సైబర్ బూచోళ్లు జనం ఖాతాల్లోని డబ్బును దోచేస్తూనే ఉన్నారు. నిన్నటి వరకు మెసేజ్‌లు, బెదిరింపు కాల్స్ రూపంలో దోచుకున్న సైబర్ దొంగల బండారం అందరికీ తెలిసిపోవటంతో, ఆ తరహా మోసాల స్థానంలో కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) సాయంతో నయా మోసాలకు బరి తెగిస్తున్నారు. దీంతో సాంకేతికత తెలిసిన వారు, గత అనుభవాలున్న వారూ ఈ ఏఐ తరహా దోపిడీ వలలో చిక్కుకు పోతున్నారు. రూ. వేలల్లోనే దోపిడీ జరుగుతుండటంతో మోసపోయినవాళ్లు చాలా వరకు మన గ్రహ పాటని మిన్నకుంటుంటే, మరి కొందరు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు.



డబ్బు దోచేసేందుకు పంపిన మెసేజ్‌లు

- సాంకేతికతను ఉపయోగించి మరిన్ని కొత్త దారుల్లోనూ..
- అమాయకులను మోసం చేసి దోచేస్తున్న సైబర్ బూచోళ్లు
- గ్రహించేలోపే ఖాతాల్లో డబ్బు మాయం
- రోజుకొక కొత్త మోసంతో జనం భయం భయం

తెనాలి, ఫిబ్రవరి 03, (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ఓ వ్యాపారి కుటుంబంలో పెద్దకుమారుడు సురేష్ ఢిల్లీలో గ్రూప్స్ రాసేందుకు కోచింగ్ సెంటర్‌లో చదువుకుంటున్నాడు. నా ఫోన్ పోయిందని, డబ్బంతా ఎకౌంట్‌లోనే ఉండటం, యూపీఐ యాప్‌లు ఫోన్‌లో ఉండటంతో ఇబ్బందిగా ఉందని, కొత్త ఫోన్ కొనుక్కునేందుకు రూ. 40 వేలు పంపాలంటూ తండ్రికి ఒక ఫోన్ వచ్చింది. మిత్రుని ఫోన్ నుంచి వాట్సప్ కాల్ చేస్తున్నానని చెప్పి తమ కుమారుడే వీడియో కాల్‌లో మాట్లాడటంతో ఆ తండ్రి ఖంగుతిన్నాడు. తీరా అసలు విషయమేమంటే... ఫోన్ పోయిందని, డబ్బులు పంపాలంటూ వీడియో కాల్‌తో మాట్లాడిన కుమారుడు ఆ సమయంలో ఆయన పక్కన ఉండటమే. వారం క్రితమే ఓ స్థలం రిజిస్ట్రేషన్ కోసం ఎక్కడెక్కడో ఉన్న ఆయన కుటుంబ సభ్యులంతా ఇంటికి వచ్చారు. కుమారుడు పక్కనే ఉండగా మరో నంబర్ నుంచి అచ్చం తన కుమారుడే మాట్లాడుతున్నట్టు వీడియో కాల్ రావటంతో అప్రమత్తమైన ఆ తండ్రి వెంటనే సమాచారాన్ని 1930 నంబర్‌కు అందించారు. ఆ తర్వాత వారికి ఏఐ సాంకేతికతను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు ఫేక్ వీడియో కాల్‌తో వల విసిరారనే విషయం తెలిసింది. అదే సమయంలో కుమారుడు ఇంటిలో లేకుంటే ఆ తండ్రి డబ్బు పంపి మోసపోయేవారే. ఇదే తరహాలో గడచిన పది రోజుల నుంచి ఏఐ యాప్‌ల ద్వారా ఫేక్ వీడియోలు తయారుచేసి ఫోన్ చేస్తుండటం ఒక సంచలనమైతే, అసలు తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్‌లు, వారి సంబంధాలు మోసగాళ్లకు ఎలా తెలుస్తున్నాయనేది అంతుబట్టని ప్రశ్న. ఫోన్ చేసే వ్యక్తి ఎక్కడ ఉంటున్నారనేది కానీ, ఏం చేస్తున్నారనేది కానీ కాల్ మాట్లాడేటప్పుడు ప్రస్తావనకు రావటంలేదని, అయితే కుమారుడా? కుమార్తా, లేక ఇతర బంధుత్వాలా అనేది వరసలు మాత్రం కచ్చితంగా చెబుతున్నారనేది బాధితులు చెబుతున్న మాటలతో అర్థమవుతోంది. ఒకరిద్దరికి మాత్రం సంబంధంలేని వరసలు కలిపి మాట్లాడటంతో వారు తమ కుమారుడు కాదని, అల్లుడని చెప్పటం, తర్వాత వారికి వచ్చింది ఫేక్ కాల్ అని తెలుసుకుని అప్రమత్తమయిన పరిస్థితి ఉందంటే, పెద్ద ఫోన్‌లు వాడే వారిలో సాంకేతికత గురించి పెద్దగా తెలియనివారికి కనుక ఫోన్ వస్తే వారు మోసపోయినట్టే.

అయితే మన ఖాతాకు ఏదైనా నగదు జమ అయినా వెంటనే యూపీఐ యాప్‌లలో చూడటం కాకుండా, సంబంధిత బ్యాంక్ ఫోన్ యాప్‌ల ద్వారా చెక్ చేసుకుంటే సురక్షితంగా ఉంటుందని, లేక ఏదైనా మెసేజ్ వచ్చిన వెంటనే కాకుండా కొంత సమయం వేచి ఉంటే, సైబర్ మోసగాళ్లు మరో ఖాతా పనిలో ఉండటం వల్ల మనకు వెంటనే రిక్వెస్ట్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని, ఇటువంటి జాగ్రత్తలతో వారి పే రిక్వెస్ట్‌ల మోసాల నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్న మాట. ఇది కాక... అనేక రూపాల్లో కొత్త తరహా మోసాలకు సైబర్ బూచోళ్లు తెగబడుతూనే ఉన్నారు. మన ప్రాంతాల్లో జరగకున్నా, రాష్ట్రంలో పలుచోట్ల మోసాలు జరుగుతున్నాయంటూ కాల్ ఫార్వర్డ్ తరహాలో జరుగుతున్న దోపిడీపైనా వీడియోలు వైరల్ అవుతున్నాయి. అపరిచితులు తమ ఫోన్ చార్జింగ్ అయిపోయిందని, లేక బ్యాలెన్స్ లేదని, ఒక ఫోన్ చేసుకుని ఇస్తానని అడిగి మన ఫోన్ తీసుకుని దానిలో 'స్టార్ 401 హ్యాష్' తర్వాత వారి ఫోన్ నంబర్ టైప్‌చేసి మన ఫోన్‌లో కాల్ కొడితే మన ఫోన్‌కు వచ్చే కాల్స్, ఓటీపీలు, పాస్వర్డ్‌లు వారి నంబర్‌కు ఫార్వర్డ్ అవుతాయని, దీనిద్వారా మన ఖాతాలో డబ్బు సునాయాసంగా వారు దోచేసే అవకాశం ఉందంటూ ఒక పోలీస్ అధికారి డ్రెస్‌లో వ్యక్తి చైతన్యం కలిగించేలా ఒక వీడియో వైరల్ అవుతోంది.


చిన్న మొత్తంలో డబ్బు ఎరవేసి.. పెద్ద మొత్తం కొట్టేసి..

మన ఖాతాకు డబ్బు జమ అయినట్టు మెసేజ్ వస్తే మనకు ముందుగా గుర్తొచ్చేది ఫోన్‌పే, గూగుల్‌పే కానీ, యూపీఐ యాప్‌లే. వాటిని ఓపెన్ చేసి బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలనే ఆలోచనచేస్తారెవరైనా. ఈ అలవాటు ను దోపిడీకి బలహీనతగా ఉపయోగించుకుని మరికొందరు వల వి సురుతున్నారు. ముందుగా మన ఖాతాకు రూ. 200 కానీ, రూ. 2వేలు కానీ, పంపటం, లేక పంపినట్టు ఒక మెసేజ్ పంప టం వీరుచేసే మోసంలో తొలి ప్రయత్నం. డబ్బు రాగానే ఫోన్‌పే ద్వారా బ్యాలెన్స్ చెక్‌చేసుకోటానికి ప్రయత్నించేలోపే యూపీఐ యాప్‌లకు మనమే డబ్బు పంపటానికి ఒక రిక్వెస్ట్ మోసగాళ్ల నుంచి రావటం, యాదృచ్ఛికంగా దానిని ఓపెన్‌చేసి, బ్యాలెన్స్ చూస్తున్నామన్న ఆలోచనతో కానీ, తొందరపాటుతోకానీ మన యూపీఐ యా ప్ పాస్వర్డ్‌ను ఎంటర్ చేస్తే మన ఖాతాకు డబ్బు రావటం అటుంచి, మన ఖాతాలోని డబ్బు మాయమవటం ఈ మోసం ప్రత్యేకత.



ఏఐ సాయంతో ఫేక్ కాల్ కోసం వీడియో తయారు చేసేందుకు అందుబాటులో ఉన్న యాప్

తెనాలిలో ఓ ప్రముఖ ప్రయివేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న పేరుచెప్పటానికి ఇష్టపడని ఒక ఉద్యోగికి తాజాగా ఇదే పరిస్థితి ఎదురయింది. ఈయన ఖాతాకు రూ. 2,000 జమ అయినట్టు మెసేజ్ రావటంతో వెంటనే తన ఫోన్‌పే యాప్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకునే ప్రయత్నం చేయటం, వెంటనే దానికి రూ. 20,000 ఆయనే పేచెయ్యటానికి వీలుగా మోసగాళ్లనుంచి పేమెంట్ రిక్వెస్ట్ రావటంతో ఆయన దానిపై క్లిక్ చేసి పాస్వర్డ్ కొట్టేయటంతో రూ. 20వేలు ఖాతా నుంచి వెళ్లిపోయాయి. తర్వాత బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే రూ. 2వేలు తన ఖాతాలోకి జమ కావటం అటుంచితే, తన ఖాతాలోనే ఉండాల్సిన నగదు నిల్వలోని రూ. 20వేలు వెళ్లిపోవటం కలవరపాటుకు గురిచేసిన పరిస్థితి. యాప్‌లోనే చెల్లింపుల వివరాలు చూస్తే తన డబ్బు పోయిన ఖాతా నంబర్ చివరి అంకెలు కనిపించటంతో అప్రమత్తమయ్యారు. బ్యాంక్ ఉద్యోగి కావటం తో వెంటనే తన ఖాతా నుంచి ఫేక్ ఎకౌంట్‌కు డబ్బు పంపినట్టు, తాను మోసపోయినట్టు తన ఖాతాఉన్న బ్యాంక్ నంబర్‌లకు, మెయిల్స్‌కు ఆ మొత్తం పెండింగ్‌లో పెట్టేలా రిక్వెస్ట్ పంపటం, తర్వాత చెయ్యాల్సిన రికవరీ పనులు బ్యాంకుకు వెళ్లి ప్రయత్నించటంతో రెండు వారాల తర్వాత ఆయన డబ్బు తిరిగి సొంత ఖాతాకు జమ అవటంతో ఊ పిరి పీల్చుకున్నారు. అదే బ్యాంకు ఉద్యోగులు, అవగాహన ఉన్న వారు కాకుండా ఇతరులైతే ఆ డబ్బు పోయినట్టే.



భూ దందాలపై.. కదలిక

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఆక్రమణలు
- ప్రభుత్వం మారి నెలలు గడుస్తున్నా ఇంకా మీనమేషాలే
- టీడీపీ అధినేత పేరు మీద ఉన్న స్థలానికే దొంగ డాక్యుమెంట్లు
- ఘటనతో ఉలిక్కిపడిన సంబంధిత వ్యవస్థలు
- భూ మాఫియా మూలాలపై దృష్టి



బాపట్ల శ్రీనివాస నగర్ కాలనీలో టీడీపీ కార్యాలయం కోసం విరాళంగా ఇచ్చిన స్థలం

టీడీపీ నేతలు ఎక్కడ ఏ సమావేశం పెట్టినా ప్రజల నుంచి అర్జీలు అందుతూనే ఉంటాయి. ఇలా అందేవాటిలో ఎక్కువశాతం భూ బాధితులవే ఉంటూ వస్తున్నాయి. ఇక ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అయితే వేల సంఖ్యలో అర్జీలు...ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రజాదర్బార్ ఇలా ఎక్కడయినా సరే భూములకు సంబంధించిన వివాదాలే అధికశాతం...వీటిలో సాంకేతిక తప్పిదాలు, కుటుంబాల గొడవలు మినహాయిస్తే మిగిలినవన్నీ కూడా గత ప్రభుత్వం భూములను కొల్లగొట్టడంలో అడ్డగోలుగా వ్యవహరించడమే. 22ఏ భూములను ఫ్రీహోల్డ్ చేయడం మొదలుకుని, దొంగ దస్తావేజులు పుట్టించి ఒకే భూమిని ముగ్గురు, నలుగురికి రిజిస్ట్రేషన్ చేసిన బాగోతాలు లెక్కలేనన్ని, ఇక అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే నెపంతో వైసీపీ నేతలు భూ బకాసురులుగా మారిన చిత్రాలకు కొదవలేదు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల పట్టణంలో ఏకంగా టీడీపీ అధినేత చంద్రబాబు పేరు మీద ఉన్న స్థలానికే దొంగ దస్తావేజులు పుట్టించి విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించిన మాయాజాలం బయటపడడంతో సదరు వ్యవస్థలన్నీ ఉలిక్కిపడ్డాయి.అది కూడా ఈ ప్రభుత్వం ఏలుబడిలో గతేడాది డిసెంబరులో ఈ తంతు అంతా జరగడంతో వ్యవస్థల పనితీరుపైనే సవాల్ విసిరినట్లైంది. రిజిస్ట్రేషన్ విభాగంతో పాటు మున్సిపాలిటీ, రెవెన్యూ ఇలా దాదాపు సంబంధిత వ్యవస్థలన్నీ ఎంతటి నిద్రావస్థలో ఉన్నాయో ఈ ఉదంతం నిరూపించింది. ఖాళీగా ఉన్న స్థలాలు, భూముల విషయంలో యజమానులు జాగ్రత్తగా ఉండాల్సిన అగత్యాన్ని కూడా ఇది తెలిపింది. ఏకంగా సీఎం పేరు మీద ఉన్న స్థలం విషయంలోనే భూ మాఫియా కన్నేయడం, వారి పనిని కూడా గుట్టుచప్పుడుగా కానిచ్చుకోవడంతో మూలాలపై అటు పోలీస్‌శాఖ, ఇటు రెవెన్యూ విభాగాలు దృష్టిపెట్టాయి. జిల్లాలో గతంలో ఇలా భూములకు సంబంధించి దొంగ డాక్యుమెంట్లు సృష్టించిన ముఠాల ఆనుపానుల మీద కూడా పోలీస్ విభాగం విచారణ చేపడుతోంది. గతంలో వచ్చిన ఫిర్యాదుల మీద కూడా ఆరా తీస్తూ భూ బకాసురుల మీద కఠిన చర్యలు తీసుకుని అడ్డగోలుగా వ్యవహరిస్తే సహించేది లేదన్న సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపాలనే కృతనిశ్చయంతో వ్యవస్థలు అడుగులేస్తున్నాయి

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ విషయంలోనూ...

నిరుపేదలకు కేటాయించిన అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే నెపంతో గత ప్రభుత్వం పెద్ద ఎత్తున భూ అక్రమాలకు తెరతీసింది. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం కొలువుదీరాక చేపట్టిన విచారణలో దాదాపు 268 ఎకరాల అసైన్డ్ భూమి నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో 5,087 దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిలో దాదాపు 650 వరకు భూములకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లవే ఉండడం గమనార్హం. వీటన్నింటి విషయంలో విచారణ నత్తనడకనా సాగుతూ వస్తోంది.

పోలీసుల అదుపులో నలుగురు...

టీడీపీ అధినేత చంద్రబాబు పేరు మీద ఉన్న స్థలాన్ని నకిలీ పత్రాలతో విక్రయించి వేరే వాళ్లకి రిజిస్ట్రేషన్ చేశారని బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం టీడీపీ నేతలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి పోలీసులు వెంటనే బాపట్ల మండల పరిధిలోని కొత్తఓడరేవుకు చెందిన సత్తార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సోమవారం మరో ముగ్గురిని స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు. మొత్తం నలుగురు నిందితులు పోలీసులు అదుపులో ఉండగా మాఫియాలో భాగంగా ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న సత్తార్ రెడ్డితో పాటు మరో ముగ్గురిపేరు మీద గత ఐదేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ వివరాలపై కూడా ఖాకీలు దృష్టి పెట్టాయి. పార్టీ కార్యాలయం ఉదంతంతో పాటు మరో మూడు స్థలాల విషయంలో ఇలానే నకిలీలతో క్రయవిక్రయాలు జరిపినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. వీరి వెనక వైసీపీకి చెందిన బడాబాబుల పాత్రపై కూడా అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. సోమవారం రెవెన్యూతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భూ మాఫియా బాగోతాలకు సంబంధించి రికార్డులను జల్లెడ పట్టే కార్యక్రమం కొనసాగింది. మొత్తం వివరాలతో నిందితుల అరెస్టును మంగళవారం అధికారికంగా చూపడానికి పోలీసు శాఖ కసరత్తు చేస్తోంది.

విలువైన స్థలాలను చెరబట్టారు...

గత ప్రభుత్వంలో నేతాగణం అండతో పలు చోట్ల విలువైన భూములను, స్థలాలను వారి అనుచరగణం చెరబట్టింది. అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలం చెన్నుపల్లిలో దాదాపు రూ.50 కోట్ల విలువైన ఈనాం భూములను నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేతలు దక్కించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా బాపట్ల, చీరాల పరిధిలో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ భూములు ఉండడంతో అధికారం అండతో చాలా వరకు తమ హద్దుల్లో కలిపేసుకుని దర్జాగా అనుభవిస్తున్న ఉదంతాలు ఈ ప్రభుత్వం విచారణలో వెలుగులోకి వచ్చాయి. సూర్యలంకలో అటవీ భూములకు వైసీపీ నేతలు దొంగ పట్టాలు సృష్టించి వాటిని తాకట్టు పెట్టి కోట్లలో రుణాలు పొందిన చిత్రాలు కూడా గత ప్రభుత్వంలోనే బహిర్గతమయ్యాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ వెసులుబాటును ఉపయోగించుకుని బాపట్లలో భూమిని నరసరావుపేటలో రిజిస్ట్రేషన్ చేసిన ఘటన కూడా ఇటీవల వెలుగులోకి రావడం, అదంతా కూడా నకిలీల మాయాజాలం అని విచారణలో తేలడంతో అక్కడి పోలీసులు నిందితులను అరెస్ట్ కూడా చేయగా, మరో ఇద్దరు ఇప్పటికీ పరారీలోనే ఉన్నారు.

అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు

వేటపాలెంలో ఇసుకాసురుల బరితెగింపు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. నిత్యం రాత్రుళ్లు అడ్డగోలుగా అక్రమ తవ్వకాలు జరిపి ఇసుక రవాణా సాగిస్తున్నారు. వేటపాలెం వంతెన సమీపంలోని స్ట్రయిట్ కట్ సమీపంలోని సుమారు ఎకరం ఎసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా ఇసుకను ఇప్పటికే భారీగా తవ్వేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో అక్రమార్కులకు ఇసుక దండాకు కలిసొచ్చింది. దీంతో రాత్రయితే చాలు నిత్యం సుమారు 50 నుంచి 100 ట్రాక్టర్‌ల వరకు ఇసుక తరలిస్తున్నారు. ఇటీవల చీరాల మండలంలో చోటుచేసుకున్న ఘటనతో జిల్లా యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాపై సీరియస్‌గా ఉండగా, క్షేత్రస్థాయిలో అధికారుల్లో కదలిక వచ్చింది. అయినా ఇసుకాసురులు రాజకీయ పలుకుబడితో తప్పించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ దందాపై వేటపాలెం తహసీల్దార్ పార్వతిని వివరణ కోరగా, ఇసుక తవ్వకాలపై ఉన్నతాధికారుల నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణా సాగిస్తే ఊరుకునేదిలేదు. గతంలో కొంత మందిపై కేసులు పెట్టాం. సుమారు రూ.3లక్షలు వరకు అపరాధ రుసుము విధించాం. తాజాగా మరొకరికి రూ.6 లక్షల వరకు జరిమానా విధిస్తూ మైనింగ్ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. వెంటనే నోటీసులు అందించనున్నాం. అలాగే నిత్యం దాడులు నిర్వహిస్తున్నాం. అయితే కళ్లుగప్పి ఇసుకను తరలించే ప్రయత్నాలు చేస్తున్నవారిపై చర్యలు తప్పవని వివరించారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు... నోటిఫికేషన్ విడుదల

- తొలి రోజున ఒక నామినేషన్ దాఖలు



పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి నోటిఫికేషన్‌ని అధికారికంగా విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకార ప్రక్రియని ప్రారంభించారు. తొలి రోజున పల్నాడు జిల్లా గురజాల మండలం గంగవరం గ్రామానికి చెందిన కనకం శ్రీనివాసరావు తన నామినేషన్‌ను ఆర్వో నాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్వో నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సమయంలో నామినేషన్లు దాఖలు చేయవచ్చ న్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం, వెలుపల పటిష్ఠ పోలీసు బందోబస్తుని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

అనుబంధ పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ప్రతిపాదించిన అనుబంధ పోలింగ్ స్టేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి ఖరారు చేస్తే జాబితాను ప్రధాన ఎన్నికల అధికారికి పంపడం జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో ఆమె తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్వో షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కె శ్రీనివాసరావుతో కలసి పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో వెయ్యి ఓట్లకు పైన వున్న పోలింగ్ స్టేషన్లకు అదనంగా వేరొక పోలింగ్ కేంద్రాన్ని అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు 39 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో చర్చించి 8 అనుబంధ పోలింగ్ కేంద్రాలను తగ్గించడం జరిగిందన్నారు. దీని ప్రకారం జిల్లాలో 149(118+31) పోలింగ్ స్టేషన్ల జాబితాను సీఈవోకు పంపించడానికి ఏఆర్‌ఓలు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మిగిలిన ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్ , బాపట్ల, పల్నాడు జిల్లాలో అనుబంధ పోలింగ్ కేంద్రాల వివరాలు అందిన తర్వాత మొత్తం పోలింగ్ కేంద్రాలను ప్రకటించడం జరుగుతుందన్నారు. అలానే సోమవారం వరకు నమోదు అయిన ఓటర్లలో పురుషులు 2,06,225 మంది, మహిళలు 1,40,344 మంది, ట్రాన్స్ జెండర్స్ 45 మంది మొత్తం 3,46,614 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు.



ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ జైసన్‌బాబు, పక్కన పాలేటి రామారావు, పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు

ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి శంకుస్థాపన

పాల్గొన్న వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్

చీరాలటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మాజీ మంత్రి డా.పాలేటి రామారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. గతంలో పాలేటి ఎన్టీఆర్ చీరాలకు చేసిన సేవలను వివరిస్తూ కౌన్సిల్‌కు లేఖ రాశారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో పాలేటి కోరారు. దీంతో శనివారం జరిగిన కౌన్సిల్లో ఆమోదం తెలిపారు. ఈనేపథ్యంలో జరిగిన జరిగిన శంకుస్థాపన ఆసక్తికరంగా మారింది. పాలేటి ఆధ్వర్యంలో మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్‌లు బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, వైస్ చైర్మన్ కుమారుడు శిఖాకొల్లి వెంకటేశ్వర్లు సైతం హాజరై కొబ్బరికాయ కొట్టారు. అయితే ఎన్టీఆర్ వంటి మహనీయులకు విగ్రహం ఏర్పాటుకు సహకరించడంలో తప్పు లేదని కొందరు ముచ్చటించుకున్నారు. కార్యక్రమంలో బుర్ల సాంబశివరావు, శవనం నాగేశ్వరరెడ్డి, కటకం శ్రీనివాసరావు, కట్టెబోయిన శివప్రసాద్, పిట్టు పోలయ్య పాల్గొన్నారు. దీనిపై పోలీసులకు, నాయకులకు మధ్య స్వల్ప వివాదం జరిగింది.

పార్కులో నాటిన పండ్ల మొక్కలు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి- వేలమూరిపాడు రోడ్డులో పంచముఖ అంజనేయస్వామి దేవాలయం పక్కన రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మినీ పార్కులో 35రకాల పూలు, పండ్ల మొక్కలను సోమవారం నాటారు. దాత, రిటైర్డ్ ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ కొల్లిపర నాగయ్య ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ

- 58-1 సర్వే చేయించి వివరాల సేకరణ
- నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపిన సబ్ కలెక్టర్



వైపాలెంలోని అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలో నకిలీ పత్రాలు సృష్టించి సర్వే నెంబరు 58-1 అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ఆర్అండ్‌బీ రోడ్డును రిజిస్ట్రేషన్ చేసిన ఘనులపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. ఆమె ఆదేశాలతో సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ విచారణ చేపట్టారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ, సబ్ రిజిస్ట్రార్‌ను విచారించారు. అనంతరం అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిన ప్రదేశాన్ని ఆయన సిబ్బందితో పరిశీలించారు. రెండు డాక్యుమెంట్‌లకు సంబంధించి సర్వే మ్యాప్, రికార్డులను పరిశీలించారు. హద్దుల ప్రకారం సర్వేయర్‌లతో కొలతలు వేయించారు. ఫిర్యాదు చేసిన వారి రికార్డులను పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రికార్డులు తీసుకు రావాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివాదాస్పద భూమి రికార్డులను పరిశీలించామన్నారు. తహసీల్దారు సెలవులో ఉండటంతో విచారణ చేపట్టలేదని చెప్పారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనన్నుట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ నలగాటి మల్లికార్జున నాయుడు ఉన్నారు.

సుజాతనగర్‌లో పారిశుధ్యం మెరుగు..!

- ఇప్పటికే ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చొరవతో సమస్యలకు పరిష్కారం

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరం అండగా, పరిష్కారం అజెండా కార్యక్రమంతో 37వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కారానికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈనెల 28వ తేదీన స్థానిక ఎన్టీఆర్ పార్కులో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల మధ్య నిర్వహించిన చర్చవేదికతో ఒక్కొక్కటిగా పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే చెన్నకేశవ స్వామి లేఅవుట్ ఎన్టీఆర్ పార్కులోని సమస్యల పరిష్కారానికి కమిషనరు డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుతో కలిసి పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నాలుగు రోజులుగా సుజాతనగర్‌లోని దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని పారిశుధ్యం సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు సమతానగర్ నుంచి తాలూకా పోలీస్ స్టేషన్ వరకు సైడు కాలువల్లో పూడికతీత పనులు, అలాగే కాలువలపై ర్యాంపులు తొలగింపుతోపాటు, ఇకపై మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపడే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా అవసరమైన సైడు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలను మునిసిపల్ ఇంజనీర్లు సిద్ధం చేశారు. దీంతో ఆ డివిజన్‌లోని పలు కాలనీల్లో చర్చవేదికలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారంవైపు అటు అధికారులు, ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించారు. దీంతో స్థానిక డివిజన్ ప్రజలు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చొరవతో సమస్యల పరిష్కారం కావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కనిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన చాంపియన్స్ కరాటే డో స్పోర్ట్స్‌కు చెందిన 14మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి మెడల్స్ అందుకున్నారు. 8వ జాతీయస్థాయి కరాటే పోటీలు గత రెండు రోజులుగా విశాఖపట్నంలో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడయంలో జరిగాయి. ఈ పోటీల్లో కనిగిరి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ యాసిన్ ఆధ్వర్యంలో వీరు ప్రతిభచూపారు. వెంకటేశ్వరరెడ్డి, టి.మోహన్‌ప్రదీప్‌రెడ్డి, జి.లక్ష్మీదీపక్ కటాస్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఎస్‌కే సమాన్‌సఫ్రాజ్, పి.వెంకటరాజేశ్వరి, ఎస్‌కే అబ్దుల్ అజీమ్, ఎస్‌కే సాఫీరా, జి.సుప్రియ, వి.దీక్షిత్ సుసీస్‌రెడిలు బంగారు పతకాలు సాధించారు. పి.అవినాష్, ఏ. వెంకటధరణ్‌రెడ్డి కటాస్ ఫైట్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించగా, అఫ్రుద్దీన్ సిల్వర్ మెడల్, కె.హఫీస్‌వర్ధన్‌రెడ్డి గోల్డ్‌మెడల్, వెంకటరాజ్యలక్ష్మి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని కరాటే మాస్టర్ యాసిన్ అభినందించారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం రూ.లక్షా 32 వేల 809 వచ్చినట్లు ఈవో నరసింహాబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.47,600, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ. 22,480, మహాప్రాకారానికి విరాళాల ద్వారా రూ.30,001, అన్నదానం విరాళాల ద్వారా రూ.23,596, ఇతర విరాళాల ద్వారా 9,132 వచ్చినట్లు తెలిపారు.

నిరుపయోగంగా కొత్త భవనాలు

- పగిలిన కిటికీల అద్దాలు
- మందుబాబులకు నిలయాలు

మార్టూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలు వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ప్రారంభించకుండానే శిథిల దశకు చేరుతున్నాయి. ఈ భవనాల చుట్టూ, ఎదురుగా ముళ్లచెట్లు పెరిగిపోతున్నాయి. భవనాలకు ఉన్న కిటికీల అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. మార్టూరుటౌన్‌లో చెరువు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో వైసీపీ హయాంలో కొత్తగా మూడు ప్రభుత్వ భవనాలను విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను నిర్మాణం చేశారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చి ఆరునెలలు దాటినప్పటికీ ఇంతవరకు ఈ మూడు ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. ముఖ్యంగా మార్టూరులో రెండవ గ్రామ సచివాలయం అద్దె ఇంటిలో నిర్వహిస్తుండగా, దాని కోసం రూ.40లక్షల వ్యయంతో రెండవ గ్రామ సచివాలయంగా కొత్తభవనం నిర్మించారు. కానీ అద్దె ఇంటి నుంచి రెండవ గ్రామ సచివాలయాన్ని కొత్తభవనంలోకి మార్చలేదు. అదేవిధంగా మిగిలిన రెండు భవనాలు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు మూడుభవనాల కిటికీలకు ఉన్న అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. రాత్రి సమయాలలో మందుబాబులకు భవనాల వరండాలు నిలయాలుగా మారాయి. వారిని అదేమిటని అడిగే వారే లేరు. గతంలో ఓసారి ఈ విషయమై నిలదీసిన గ్రామస్థులతో మందుబాబులు వాదనకు దిగిన సందర్భాలు ఉన్నాయి. దాంతో ఎవరూ వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఇదేవిధంగా పరిస్థితి కొనసాగితే బూత్ బంగళాలుగా మూడు భవనాలు మిగిలిపోయే అవకాశం ఉందని గ్రామస్థులు అంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పగులగొట్టిన కిటికీ అద్దాలు



తుమ్మచెట్లు పెరిగిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



నేటికీ ప్రారంభించని గ్రామ సచివాలయం

సంఘ సేవకుడు జ్యోతయ్య మృతి

- మొక్కలు నాటడం, శ్మశానాల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న పంతంగి

అద్దంకి, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత మిలటరీ ఉద్యోగి, సంఘ సేవకుడు పంతంగి జ్యోతయ్య (76) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. అద్దంకి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురు నివాసం ఉండే పంతంగి జ్యోతయ్య మిలటరీలో పనిచేసి అనంతరం ఎస్‌బీఐ గార్డ్‌గా కొంత కాలం పని చేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జ్యోతయ్య ఇటీవల బెంగళూరులో కుమార్తె వద్దకు వెళ్లి మిలటరీ వైద్యశాలలో వైద్య చికిత్సలు పొందుతున్నారు. సోమవారం అనారోగ్యంగా ఉందని చెప్పటంతో మిలటరీ వైద్యశాలకు తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయానికి జ్యోతయ్య మృతదేహం అద్దంకి తీసుకు వస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఒక వైపు బ్యాంక్‌లో పనిచేసేటప్పటి నుంచి ఉద్యోగ విరమణ చేసిన తరువాత కూడా నిత్యం సమాజ సేవలో నిమగ్నమై ఉండే వారు. చిట్టడవిని తలపించేలా ఉన్న నర్రావారిపాలెం శ్మశానాన్ని అభివృద్ధి చేయడంలో కీలక భూమిక పోషించారు. అదే సమయం లో పలు శ్మశానాల్లో మొక్కలు నాటి, పూర్తి సంరక్షణ చేశారు. ప్రస్తుతం ఆయా శ్మశానాలలో జ్యోతయ్య నాటిన మొక్కలు పెద్ద పెద్ద వృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. అద్దంకి పట్టణంలో మొక్కలు పెరగవు అనే అభిప్రాయం ఉండగా అది నిజం కాదని నిరూపిస్తూ పలు రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని జ్యోతయ్య సంరక్షించారు. వీటన్నిటికీ మించి అనాథలు, సమీప బంధువులు లేని వారు మృతి చెందితే నేనున్నానంటూ అన్ని తానై వ్యవహరించి దహన సంస్కారాలు కూడా చేసేవారు.

ఫంక్షన్‌లు, వివాహాలు జరిగే సమయంలో ఆహార పదార్థాలు మిగిలి పారవేసే పరిస్థితి ఏర్పడుతుండగా, మిగిలిన పోయిన ఆహార పదార్థాలను అర్ధరాత్రి సమయంలో కూడా ఆర్టీసీ బస్టాండ్ తో పాటు పలు కాలనీలలో నివశించే పేద ప్రజల వద్దకు ప్రత్యేక వాహనంలో తీసుకుపోయి పంపిణీ చేసి పేద ప్రజల ఆకలి మంట తీర్చేవారు. ఇంకా కొద్దిపాటి ఖాళీ సమయం దొరికితే తాను పనిచేసిన బ్యాంక్ వద్దకు వెళ్లి నిరక్షరాశ్యులు, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన లేని వారికి సహాయం చేస్తూ సేవలందిస్తుంటారు. ఇలా నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై నిజమైన ప్రజా సేవకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.



పంతంగి జ్యోతయ్య (ఫైల్)

నిస్వార్థ సేవకుడు జ్యోతయ్య

సంతాపం తెలిపిన మంత్రి గొట్టిపాటి

నిస్వార్థ సేవకుడు జ్యోతయ్య అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంఘ సేవకుడు పంతంగి జ్యోతయ్య మృతి పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బండలాగుడు పోటీలో తలపడుతున్న పంగులూరు ఎడ్ల జత

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలో పంగులూరు ఎడ్లకు ద్వితీయం

పంగులూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా నాదెండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలలో పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజతకు ద్వితీయ స్థానం దక్కింది. విఘ్నేశ్వర స్వామి వార్షిక మహోత్సవం సందర్భగా నాదెండ్లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో నిర్వహించిన బండలాగుడు పోటీలో గొట్టిపాటి యూత్ సారథ్యంలో పంగులూరుకు చెందిన నాగేశ్వరరావు ఎడ్ల జత పాల్గొంది. ఈ పోటీలో సోమవారం రాత్రి జరిగిన పోటీలో పాల్గొన్న పంగులూరు ఎడ్లజత నిర్ణీత 15 నిముషాలలో 39,023 అడుగుల దూరాన్ని చేరుకుని ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలో పాల్గొన్న పురుషోత్తపట్నం ఎడ్లజత 33 అడుగుల తేడాతో ప్రధమస్దానంలో నిలువగా పంగులూరు ఎడ్లజతకు ద్వితీయ స్థానం దక్కింది. గత నెలలో సంక్రాంతి సందర్భంగా అన్నంబొట్ల వారిపాలెంలో జరిగిన పోటీలతో పాటు రెంటచింతలలో జరిగిన ఎడ్ల బండలాగుడు పోటీలలో ఈ ఎడ్లజతకు రాష్ట్రస్దాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎడ్ల యజమాని నాగేశ్వరరావు తెలిపారు.

జవాబుదారీగా ఉండాలి

- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- 5 గంటల పాటు టూటౌన్ స్టేషన్ తనిఖీ



ఒంగోలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఐజీ త్రిపాఠి

ఒంగోలుక్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో జవాబుదారిగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెండోవ పట్టణం వార్షిక తనిఖీలలో భాగంగా సందర్శించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్టేషన్‌కు వచ్చిన ఐజీ రాత్రి 7 గంటల వరకు అన్నీ గదులను పరిశీలించారు. అనంతరం రికార్డులను క్షుణంగా చూశారు. పెండింగ్ కేసుల దర్యాప్తుపై లోతుగా పరిశీలన చేసిన ఆయన కొన్ని సీడీ ఫైళ్లలో ఎఫ్ఐఆర్ మినహా ఎలాంటి పేపర్లు లేవని గుర్తించారు. దీనిపై అధికారులను ప్రశ్నించారు. ప్రతిరోజు ఎన్ని బీట్లు పడుతున్నాయి, అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేస్తున్నారా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో స్టేషన్ పరిధిలో అధికంగా నేరాలు నమోదయ్యే ప్రాంతాలలో ఎలాంటి చర్యలు చేపట్టారని సీఐ శ్రీనివాసరావును ప్రశ్నించారు. పాత నేరస్థులపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని చెప్పారు. సాంకేతిక పద్ధతులను వినియోగించుకొని కేసుల దర్యాప్తు వేగంగా పూర్తిచేయాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఐజీ మొక్కను నాటారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, సీఐలు శ్రీకాంత్‌బాబు, నాగరాజు, అజయ్ బాబు, సుబ్బారావు, ఎస్ఐలు పున్నారావు, త్యాగరాజు ఉన్నారు.

యూపీ స్కూళ్లు మాయం!

- విద్యాసంస్కరణలలో భాగంగా మార్పులు
- హేతుబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిర్ణయం
- 62 యూపీఎస్‌లు పీఎస్‌లుగా డౌన్‌గ్రేడ్
- 48 పాఠశాలలు హైస్కూళ్లుగా ఉన్నతి
- 71 బడులపై వేలాడుతున్న కత్తి

ప్రాథమికోన్నత పాఠశాల(యూపీఎస్)లు ఇక కనిపించవు. జాతీయ విద్యావిధానం-2020 అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన పాఠశాల విద్య సంస్కరణ కారణంగా యూపీఎస్‌లు చాలావరకు కనుమరుగు కాబోతున్నాయి. పాఠశాల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం ప్రతిపాదించిన పాఠశాలల్లో యుపీఎస్‌లకు స్థానం లేకుండాపోయింది. దీంతో గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న యూపీ స్కూళ్లు అయితే విలీనం, లేకుంటే అప్‌గ్రేడ్, కాకుంటే డౌన్‌గ్రేడ్ కానున్నాయి. ఎలా అన్నది విద్యార్థుల సంఖ్య ప్రకారం అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. నదులు, కొండలు తదితర ఇబ్బందికర పరిస్థితులు ఉన్నచోట్ల మాత్రమే కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గతంలో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేకపోవడంతో వారు ప్రాథమిక స్థాయిలోనే చదువులకు స్వస్తి చెబుతుండేవారు. అయితే 8వతరగతి వరకు విద్యార్థులకు పాఠశాలలు అందుబాటులో భాగంగా యూపీ స్కూళ్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ వ్యవస్థను సమూలంగా మార్పు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటి దగ్గరలో బడి ఉంటే పిల్లలు అడుతూపాడుతూ బడికెళ్లి చదువుకుంటారు. అదే 6వతరగతికే విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవాలంటే ఎంత కష్టమో పాలకులు ఆలోచించడం లేదు. ప్రభుత్వం తాజా సంస్కరణల ఫలితంగా జిల్లాలో 62 యూపీ స్కూళ్లు ప్రాథమిక పాఠశాలలుగా డౌన్ గ్రేడ్ కాబోతున్నాయి. అదేవిధంగా 71 యూపీఎస్‌లపై కూడా మూసివేత కత్తి వేలాడుతుంది. మరో 48 బడులను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో 181 యూపీ స్కూళ్లు

జిల్లాలో మొత్తం 181 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 17,648 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 9,877 మంది ఉండగా 6, 7, 8 తరగతుల్లో 7,771 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు యూపీ స్కూళ్ల మనుగడకు ముప్పు పొంచి ఉంది. మొత్తంగా ఆ వ్యవస్థ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో హైస్కూళ్లకు దూరంగా ఉన్న యూపీ స్కూళ్లలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను హైస్కూళ్లలో విలీనం చేసి యూపీఎస్‌లను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించడానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు మెమో ఇచ్చారు. అవి ఇప్పుడు యూపీ స్కూళ్ల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

62 యూపీలు డౌన్‌గ్రేడ్

పాఠశాలల హేతుబద్ధీకరణకు ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల మేరకు 6, 7, 8 తరగతుల్లో 30మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న యూపీ స్కూళ్లను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేస్తారు. తదుపరి ఆ పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ నిబంధనల ప్రకారం 30మందిలోపు పిల్లలు ఉన్న 62 యూపీ స్కూళ్లు మండల ప్రాథమిక పాఠశాలగా డౌన్‌గ్రేడ్ కాబోతున్నాయి. ఈ పాఠశాలలకు హైస్కూళ్లు దూరమైనా సరే విలీనం చేయాల్సిందే. అవసరమైతే వారికి సంవత్సరానికి రూ.6వేలు ప్రయాణ భత్యం చెల్లిస్తామని అధికారులు చెప్తున్నారు. 30మందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలల్లో కొన్నింటిలో ముగ్గురు, నలుగురు, పదిమందిలోపు సుమారు 10 యూపీ స్కూళ్లలో పిల్లలు ఉన్నారు. ఈ పాఠశాలలు అనివార్యంగా డౌన్‌గ్రేడ్ కావాల్సిందే.

71 పాఠశాలలపై వేలాడుతున్న కత్తి

71 యూపీ స్కూళ్లపై మూసివేత కత్తివేలాడుతుంది. నిబంధనల ప్రకారం 6, 7, 8 తరగతుల్లో 31 నుంచి 59మంది వరకు 6, 7, 8 తరగతుల విద్యార్థులు పాఠశాలలకు సంబంధించి ప్రతి పాఠశాలను కేస్‌స్టడీ చేసి తగు నిర్ణయం తీసుకోమన్నారు. ఈ పాఠశాలలకు సమీపంలో హైస్కూళ్లు ఉంటే ఇక్కడి యూపీ సెక్షన్ల విద్యార్థులను విలీనం చేయమన్నారు. అయితే యూపీ స్కూలుకు హైస్కూలుకు మధ్య కుంటలు, వాగులు, వంకలు, జాతీయ రహదారులు తదితర అవరోధాలు ఉంటే ఈ పాఠశాలలను కొనసాగించమన్నారు. ఈ పాఠశాలలను యూపీ స్కూళ్లగానే కొనసాగిస్తే ఈ పాఠశాలలకు స్కూలు అసిస్టెంట్లకు బదులుగా కేవలం ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను మాత్రమే కేటాయిస్తారు.



ప్రాథమిక పాఠశాలగా మారనున్న పెల్లూరులోని యూపీ స్కూల్

హైస్కూళ్లుగా 48 యూపీ స్కూళ్లు

6, 7, 8 తరగతుల్లో 60మంది అంతకంటే ఎక్కువమంది విద్యార్థులు ఉన్న యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయమన్నారు. ఈ నిబంధనల ప్రకారం జిల్లాలో 48 యూపీ స్కూళ్ల అప్‌గ్రేడ్ కానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలకు 9వతరగతి వస్తుంది. గెజిటెడ్ హెచ్ఎం, పీడీ/పీఈటీ పోస్టులు మంజూరు చేస్తారు. చదువు చెప్పేందుకు ప్రతి సబ్జెక్టుకు స్కూలు అసిస్టెంటను నియమిస్తారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్పులు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు యూపీ స్కూళ్ల మనుగడపై చర్యలు తీసుకుంటాం. అరవై మందిపైగా యూపీ సెక్షన్‌లో విద్యార్థులు ఉంటే ఆ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్‌చేస్తాం. అరవై మందిలోపు పిల్లలు ఉన్న యూపీ స్కూళ్లను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా డౌన్ గ్రేడ్ చేస్తాం. అక్కడ 6, 7, 8 తరగతుల పిల్లలను సమీపంలోని హైస్కూల్‌కు పంపుతాం. హైవే, నీటివనరులు, కొండలు తదితర ఇబ్బందికర ప్రాంత యూపీఎస్‌ను అలాగే కొనసాగించే అవకాశం ఉంది. ఆ స్కూళ్లకు కేవలం ఇద్దరు ఎస్జీటీలను మాత్రమే ఇస్తాం

- ఏ.కిరణ్‌కుమార్, డీఈవో

ఒంగోలు రైల్వేస్టేషన్‌కు మహర్దశ

అమృత్ భారత్ పథకంలో ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే అభివృద్ధిలో భాగంగా భారత రైల్వే శాఖ ఈనెల 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించింది. దేశవ్యాప్తంగా 56 స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేయగా, అందులో ఒంగోలు రైల్వేస్టేషన్ ఉంది. ఈ మేరకు ఇకపై ఒంగోలు రైల్వే స్టేషన్ అత్యాధునిక సౌకర్యాలతో ప్రయాణికులకు మరింత సేవలు అందనున్నాయి. ఆధునికమైన ప్లాట్‌ఫాం, ఏసీ వెయిటింగ్ హాల్, మొదలు నుంచి చివరి వరకు స్టేషన్ బిల్డింగ్ అభివృద్ధి, ఎయిర్‌పోర్ట్ లైటింగ్, ఆధునికంగా పార్కింగ్‌తోపాటు, క్యాంటిన్‌లు, మినరల్ వాటర్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఈ తరహాలో ప్రయాగ, అయోధ్య, షిర్డీ వంటి రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చెందాయి. అదే తరహాలో ఒంగోలు రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

కుమారుడు పట్టించుకోలేని

- ఎలుకల మందు తిని దంపతులు ఆత్మహత్యాయత్నం
- భర్తకు నడుంనొప్పి, భార్య క్యాన్సర్

ముండ్లమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బిడ్డల భవిష్యత్తే పరమావధిగా భావించి అహర్నిశలు శ్రమించారు. పిల్లలతోపాటే తమ జీవితమని భావించారు. వారి ఉజ్వల భవిష్యత్ కోసం చమటోడ్చి పని చేశారు. కాస్తోకూస్తో కూడబెట్టిన సొమ్మును బిడ్డలకే పంచిపెట్టారు. అవసాన దశలో అదరిస్తారని భావించిన కన్నబిడ్డలే మమకారాన్ని వీడి పట్టించుకోకపోవటంతో ఆ వృద్ధ జంట తీవ్ర మనోవేదనకు గురైంది. వ్యాధులు వారిని పట్టిపీడిస్తున్నాయి. తట్టుకోలేని దంపతులు ఆత్మహత్యే శరణమ్మని ఎలుకల మందు తిన్నారు. ఈ ఘటన సోమవారం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని వేములలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాతం వెంకటేశ్వరరెడ్డి, నారాయణమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఆడపిల్లలు ఇద్దరూ మృతిచెందారు. కుమారుడికి పెళ్లైంది. భార్య పిల్లలు ఉన్నారు. తండ్రీ కొడుకులు వేర్వేరుగా ఉంటున్నారు. వెంకటేశ్వరరెడ్డి నడుమునొప్పితో, భార్య నారాయణమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. బాగోగులు చూడాల్సిన కుమారుడు పట్టించుకోకపోవటంతో చేసేదేమీ లేక సోమవారం ఉదయం ఎలుకల మందు తిన్నారు. వారిని ఇరుగుపొరుగు వారు చూసి వెంటనే దర్శిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

సొంత భవనం లేని తహసీల్దార్ కార్యాలయం

- దశాబ్దాల నుంచి పంచాయతీరాజ్ గెస్టుహౌస్‌లోనే విధులు
- ఇరుకు గదులు.. భూ రికార్డులకు రక్షణ కరువు
- శిథిలమైన భవనంలో భయంభయంగా పనిచేస్తున్న ఉద్యోగులు
- మీ కోసంకు వచ్చే ప్రజలకు నరకం

బల్లికురవ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖలకు సంబంధించిన భవనాల నిర్మాణానికి స్థలాలు ఇచ్చే రెవెన్యూ కార్యాలయానికే దశాబ్దాలుగా స్థలం లేక పంచాయతీ రాజ్ విశ్రాంతి భవనంలోనే కొనసాగుతోంది. దీంతో వివిధ పనులకు వస్తున్న మండల ప్రజలు ఇరుకు గదులలో ఉన్న ఉద్యోగుల వద్దకు వెళ్లలేక వారి సమస్యలు సకాలంలో పరిష్కరించుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒకే గదిలో అందరు అధికారులు, రికార్డులు ఉండడంతో రైతులకు సంబంధించిన భూ రికార్డులకు కూడా రక్షణ లేకుండా పోతుంది. దీనికి తోడు పంచాయతీ రాజ్ భవనం కూడా శిథిలావస్థకు చేరి పై కప్పు అచ్చులు ఊడి పడుతుండడంతో పనిచేసే ఉద్యోగులు సైతం భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం అన్ని గ్రామాలలో కోట్లు వెచ్చించి గ్రామానికి రెండు మూడు చొప్పున ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ తహసీల్దార్ కార్యాలయానికి మాత్రం నిధులు మంజూరు చే యడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ రెవెన్యూ శాఖ తహసీల్దార్ కార్యాలయం పంచాయతీ రాజ్ శాఖ విశ్రాంతి భవనంలో 1997 నుంచి కొనసాగుతోంది. గతంలో రెవెన్యూ కార్యాలయానికి భవనం దొరక్క పోవడంతో అప్పట్లో అధికారులు పంచాయతీ రాజ్ భవనంలో తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఎన్ని ప్రభుత్వాలు మారినా పర్మినెంట్‌గా తహసీల్దార్ కార్యాలయాన్ని మాత్రం నిర్మించలేదు. గత పదేళ్ల కిందట తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు నిధులు మంజూరైనా స్థలం దొరక్క నిధులు వెనక్కి వెళ్లాయి. అప్పటి నుంచి మరలా నిధులు మంజూరైన దాఖలాలు లేవు. ప్రతి రోజూ వివిధ రకాల పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే మండల ప్రజలు ఇరుకు గదుల మధ్య ఉన్న ఉద్యోగుల వద్దకు వెళ్లి పనులు చేయించుకోనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రెవెన్యూ రికార్డులు కూడా భద్రత పరిచే గదులు లేకపోవడంతో వరాండాలోనే ఉం చుతున్నారు. ఒకే గది కావడం అం దరూ అధికారులకు సంబంధించి కంప్యూటర్‌లు ఉంచుకోవాల్సి రావడంతో ఉద్యోగులు సైతం తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పలు మార్లు తహసీల్దార్లు నూతన భవనం ఏర్పాటుకు ప్రతిపాదనల తయారు చేసి పంపుతున్నా ఫలితం కనిపంచడం లేదు. ముఖ్యంగా కార్యాలయం ఏర్పాటుకు స్థలం అందుబాటులో లేదని ఉద్యోగులు తలలు పట్టుకొంటున్నారు.

ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే మీ కోసం (ప్రజా ఫిర్యాదుల విభాగం) కార్యక్రమం అంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకే గదిలో మండల స్థాయి అధికారులు ఇరుకు గదుల్లో ఉండడం, అక్కడే వీడియో కన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయడం, కంప్యూటర్ ఆపరేటర్‌లు కూడా అదేచోట ఉండడం ప్రజలు లోపలకు వెళ్లేందుకు కూడా ఇబ్బంది ప డుతున్నారు. కార్యాలయానికి సంబంధించి ఏదైనా ముఖ్యమైన ఫైల్ కావాలన్నా సిబ్బంది పాట్లు పడుతున్నారు. ఇరుకు గదులలో ఎక్కడ ఏవి ఉన్నాయో కూడా తెలియక ఒక్కో సమయంలో రికార్డులన్నీ ఆరు బయటకు తెచ్చి వెతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తహసీల్దార్ కార్యాలయ భవనానికి స్థల సేకరణ చేపట్టి, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ముఖ్యమైన రికార్డులు కనిపించక ఆరు బయట రికార్డులు పరిచి వెతుకుతున్న సిబ్బంది (ఫైల్)


పంచాయతీ రాజ్ విశ్రాంతి భవనంలో కొనసాగుతున్న బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం .. వసతులు లేక పోవడంతో ఇరుకు గదులలో పడవేసి ఉన్న భూ రికార్డులు .. శిథిలావస్థకు చేరిన గదిలో కూర్చుంటున్న అధికారులు (ఫైల్)


అంబడిపూడిలో ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న సీతారామాలయం

10న సీతారామాలయం ప్రతిష్ఠ

ప్రారంభానికి ముస్తాబవుతున్న నూతన ఆలయం

బల్లికురవ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో ఈనెల 10వ తేదీన శ్రీ సీతారామస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. గతంలో జీర్ణావస్థలో రామాలయం ఉండగా, గ్రామస్థులు సమష్టి కృషితో పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి ఏడాదిగా నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. గ్రామానికి నడి బొడ్డున పురాతన కాలం నుంచి సీతారామాలయ పునర్నిర్మాణం చేపట్టేందుకు భక్తులు పనులను శరవేగంగా చేపడుతున్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 8-49 నిమిషాలకు దేవాలయ ప్రతిష్ఠ చేసేందుకు వేద పండితులు ముహూర్తం నిర్ణయించారు. 8వ తేదీ నుంచి ప్రతిష్ఠ పూజలు ప్రారంభం కానున్నాయి. గ్రామంలో నూతన దేవాలయ ప్రతిష్ఠ నిర్వహించనుండటంతో ప్రజలు రానున్న వారం రోజులు ఆపనుల్లో పనులలో పూర్తిగా నిమగ్నం అయ్యారు.

7న సీతారామస్వామి బాలాలయం ప్రతిష్ఠ

చినగంజాం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో సీతారామస్వామి బాలాలయం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు సీతారామస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు తెలిపారు. 7వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, చతుర్థశ కలశస్నపన, అభిషేకాలు, అఖండ స్థాపన, సకల దేవతాహ్వానం, అంకురారోపణం, 8వ తేదీ ఉదయం 11.22 గంటలకు సీతారామస్వామి ప్రతిష్ఠమహోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామసుబ్బారావు తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ

మార్టూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023-2024కు సంబంధించి మండలంలోని గ్రామాలలో చేసిన సామాజిక తనిఖీపై మంగళవారం ఉదయం 9 గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వైశ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని తెలిపారు.

పలువురిని పరామర్శించిన బలరాం


శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బలరాం

బల్లికురవ. ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి కుమారుడు శ్రీనివాసరావును పరామర్శించారు. అలాగే జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి మామ సుబ్బయ్య మృతి చెందగా, అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో నాయకులు దర్శి రామకృష్ణయ్య, చింతల సుబ్బారావు, సాంబయ్య పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకుపోయిన బస్సు

తప్పిన పెనుప్రమాదం


పర్చూరు సమీపంలో కాలువలోకి దూసుకుపోయిన బస్సు

పర్చూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాలువలోకి బస్సు దూసుకుపోయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి పర్చూరు - చీరాల ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా, నర్సరావుపేట పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడం, దట్టంగా పొగ మంచు కారణంతో ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు చెప్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బస్సు కాలువలో పడితే పెనుప్రమాదం జరిగి ఉండేది.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఈనెల 7న తలపెట్టిన లక్షల డప్పులు - వేల గొంతులు కార్యక్రమానికి హైదరాబాద్‌కు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీ నర్సయ్య కోరారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆయన పలువురు నాయకులతో కలిసి విడుదల చేశారు.

ఎపిఫని మెరిట్ టెస్ట్ ఫలితాల విడుదల

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్ ఫలితాలను సోమవారం విజయవాడలో స్కూల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ వి.విజయ్‌రామరాజు తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ ఎపిఫని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టి.వెంకటరావు, కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన 94 మంది విద్యార్థులకు రూ.5,03,000 నగదు బహుమతులు ప్రకటించించారు. వీటితో పాటు టోపీలు, జ్ఞాపికలు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 8న విజయవాడలో ఎంబీ విజ్ఞాన క్రేందంలో జరిగే కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 7వ తరగతిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన వారికి రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, పదివ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన వారికి రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు అందిస్తామని తెలిపారు. జిల్లా, మండల స్థాయి విద్యార్థులకు కూడా నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు.


ఫలితాలను విడుదల చేస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ్‌రామరాజు


చిన్నపిల్లల అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల

చదువు ఆటపాటలా సాగాలి

మార్టూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలు బడిలో ఆడుతూపాడుతూ చదువు సాగేలా ఉండాలని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. సోమవారం వసంత పంచమి సందర్భంగా మార్టూరులోని శ్రీహర్షిణి ఒలంపియాడ్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ గోరంట్ల రవికుమార్ కవిత దంపతులు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సరస్వతీ పూజా కార్యక్రమంలో రవికుమార్ దంపతులతోపాటు పలువురు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమానికి విచ్చేసిన చిన్నపిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పలకలును, పుస్తకాలను రవికుమార్ దంపతులు పంపిణీ చేశారు. అంతేగాకుండా వారితో అక్షరాలును దిద్దించారు. వారితలపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లలను ప్రేమతో బడిపట్ల వారికి ఆసక్తి కలిగించేవిధంగా ప్రవర్తించాలన్నారు. వారికి కూడా బహుమతులను పంపిణీ చేశారు తరువాత. అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఉపాధ్యాయినులు పార్వతి, నిర్మల, అంజలి, సంపూర్ణ, మాధవి, పద్మ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

బల్లికురవ. ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించేలా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని విద్యాశాఖ చీరాల డిప్యూటీ ఈవో అబ్బరాజు శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం బల్లికురవ విద్యావనరుల కేంద్రానికి వచ్చిన అయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందన్నారు. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులను ఏర్పాటు చేశామని, సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చామన్నారు. చీరాల డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో ఉన్న ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదం నుంచి రక్షించిన వారికి పారితోషికం

ఆర్డీవో రామకృష్ణారెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో, ఆరోగ్య సిబ్బంది

చీరాలటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి స్పందించి తక్షణ వైద్య సాయం అందించిన వారికి ప్రభుత్వం నుంచి పారితోషికాలు అందించనున్నట్లు చీరాల ఆర్డీవో బొమ్మ రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం చీరాల ఏరియా వైద్యశాల వద్ద ఆరోగ్య సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి ప్రతి నిముషం ఎంతో విలువైనదని చెప్పారు. వారికి అత్యవసర వైద్యం అందించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే వాహన దారులు విధిగా జాగ్రత్తలు పాటించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో డా.నరేంద్ర, డా. రాజా శెల్వన్, యాకోబు తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తులపై కేసు

చినగంజాం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు వ్యక్తులను గాయపరిచిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం రమేష్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన ఆట్ల శ్రీనివాసరెడ్డి, ఆట్ల సుబ్బరామిరెడ్డి, కోకి పవన్‌కుమార్‌రెడ్డి ట్రైరు బండ్లతో అదే గ్రామానికి చెందిన నిద్ర మల్లికార్జునరెడ్డి పొలంలోని వడ్లు ఇంటికి చేర్చేందుకు సోమవారం ఉదయం వెళ్లారు. ఈ క్రమంలో వడ్లు తోలే విషయంలో ఆట్ల శ్రీనివాసరెడ్డి, సుబ్బరామిరెడ్డికి కోకి పవన్‌కుమార్‌రెడ్డి, భాస్కరరెడ్డి, లక్ష్మరెడ్డి, కోటిరెడ్డి, శివరామిరెడ్డికి వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదంలో సుబ్బరామిరెడ్డికి తలకు గాయమైంది. శ్రీనివాసరెడ్డి ట్రైరు బండి తోలుకొని ఇంటికి వెళుతుండగా, పవన్‌కుమార్‌రెడ్డి తన ఇంటి ముందు నుంచి వెళ్తున్న శ్రీనివాసరెడ్డిని దుర్భాషలాడుతూ, కర్రతో కొట్టగా చేతికి గాయమైంది. గాయపడిన సుబ్బరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా, వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు

ఆటోల్లో ప్రయాణించే కూలీలకు, డ్రైవర్లకు సీఐ సుబ్బరాజు సూచన

అద్దంకి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కూలీలు ఆటోల్లో ప్రయాణించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సీఐ సుబ్బరాజు అన్నారు. సోమవారం అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో వాహనాలను సీఐ సుబ్బరాజు తనిఖీలు చేశారు. ప్రధానంగా కూలీలలు పెద్ద సంఖ్యలో ట్రాలీ ఆటోలలో ప్రయాణించడం, పరిమితికి మించి ఆటోలలో ప్రయాణించడం గుర్తించి కూలీలను దించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గూడ్స్ ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో ప్రయాణికుల ఆటోల్లో కూడా పరిమితికి మించి ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్సై ఖాదర్‌బాషా ఉన్నారు.


భవానీ సెంటర్‌లో ఆటోల్లో ప్రయాణిస్తున్న కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు

రాష్ట్ర స్థాయి షటిల్ విన్నర్స్‌గా సెయింట్ ఆన్స్ జట్టు

చీరాలటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ విన్నర్స్‌గా చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు నిలిచింది. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో క్రీడాకారులు కావటి రిషి, సూర్యకిరణ్‌ను అభినందించారు. అనంతరం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల జరిగిన ఇంటర్ పాలికెట్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ (ఐపీఎస్‌జీఎం-24)లో జిల్లా స్థాయిలో గెలుపొంది ఇప్పుడు విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడి విన్నర్స్‌గా నిలవడం హర్షనీయమన్నారు. ప్రిన్సిపాల్ డా.కె.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యమే కాకుండా లక్ష్యాలపై గురి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కరరెడ్డి, మేనేజర్ ఆర్‌వీ రమణ, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

కేన్సర్ సెంటర్‌కు శిరోజాల అందజేత


కటింగ్ చేసిన శిరోజాలతో భవిష్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సాయం చేయడానికి వయసుతో పనిలేదని, చేయాలన్న గుణం ముఖ్యమని ఓ విద్యార్థిని రుజువు చేసింది. అంతర్జాతీయ కేన్సర్ నివారణ దినం సందర్భంగా చీరాల్లోని ఓప్రైవేట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న భవిష్య సుమారు 14 అంగుళాల శిరోజాలను కేన్సర్ సెంటర్‌కు అందజేసింది. ఆమె క్లాసికల్ డ్యాన్స్‌లో కూడా ఎన్నో అవార్డులు పొందింది. దీంతో ప్రజలు చిన్నారి ఆలోచనలను అభినందిస్తున్నారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలుక్రైం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గొట్టిపాటి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కోర్టులోని పోక్సో కోర్టులో అద్దంకికి చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా న్యాయాధికారి భారతిని కలిసి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వరన్యాయం అందిచేందుకు కృషి చేస్తానన్నారు. నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

శనగలో విస్తరిస్తున్న ఎండు తెగులు

రైతుల్లో ఆందోళన

పంగులూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : శనగలో ఎండు తెగులు విస్తరిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవని, పంట మార్పిడి విధానంతోనే తెగులు అరికట్టే అవకాశం ఉందన్న శాస్త్రవేత్తలు సూచిస్తుండగా, తెగులు రోజురోజుకూ పైరంతా విస్తరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చందలూరు, పంగులూరు, తూర్పు కొప్పెరపాడు, కోటపాడు పరిసర గ్రామాలలో 2,500ఎకరాల్లో రైతులు రబీ పంటగా శనగ సాగు చేపట్టారు. ఆయా గ్రామాలలో తెగులు సోకి పైరు కల్లాలుగా ఎండుతూ కనిపించడంతో రైతులు పైరు చేతికి దక్కదని వాపోతున్నారు. సుమారు 200 ఎకరాలలో ఎండు తెగులు సోకినట్లు గుర్తించామని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. గత నెల మూడవ తేదీన చందలూరులో తెగులు సోకిన తొలిదశలో పలువురు శాస్త్రవేత్తలు పైరును పరిశీలించారు. మొక్క దశలో తెగులు ఆశించిన పైరుపై పాలిక్యూర్ మందు ద్రావణాన్ని వేరు తడిచేలా పిచికారీ చేయడం కొంత ఉపశమనంగా సూచించారు. దీర్ఘకాలం ఒకే పంట సాగు చేయడంతో ఇలాంటి తెగుళ్లు ఆశిస్తాయని, పంట మార్పిడితోనే తెగుళ్లను నివారించ వచ్చన్నారు. తెగులు నివారించే అవకాశం ఉందన్న శాస్త్రవేత్తల సూచనలు, తెగులు విస్తరించి పైరు ఎండుతున్న తీరుతో వాటిల్లే నష్టం తలుచుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు.


చందలూరులో తెగులు సోకి ఎండుతున్న శనగ పైరు

వాగ్దేవీ.. విద్యనొసగుమా!

వైభవంగా వసంత పంచమి



నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో పలకపై అక్షరాలు రాసిస్తున్న పురోహితుడు



సరస్వతీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ అమ్మవారి ఆలయాల్లో సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీ పూజలు, హోమాలు, సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. పిల్లలతో కలసి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

సప్తాశ్వ రథమూరూఢాం!



వైష్ణవాలయాల్లో సప్తవాహన సేవలు

రేపే రథసప్తమి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యుడు ప్రత్యక్షదైవం. సకల చరాచర జీవరాసులన్నింటికీ ప్రాణదాత, ఆరోగ్య ప్రదాత. విశ్వమంతటికీ వెలుగునిచ్చి ఆ దినకర కోటి ప్రభాకరుడ్ని పూజించే పర్వదినమే రథసప్తమి. జిల్లాలోని అన్ని వైష్ణవాలయాల్లో మంగళవారం రథసప్తమి పర్వదిన వేడుకలు జరగనున్నాయి. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి, పెంచలకోన, వేదగిరిలోని నరసింహ స్వామి ఆలయాల్లో సప్తవాహన సేవలు నిర్వహించనున్నా రు. అలాగే స్వామివార్లకు విశేష అభిషేకాలు, అలంకరణ లు జరగనున్నాయి. ఇందుకోసం పాలక మండళ్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. రంగనాథస్వామి ఆలయంలో ఉదయం 6గంటలకు సూర్యప్రభ వాహనం, 9.30కి గరుడసేవ, 12కి హంస వాహన సేవ, ఒంటిగంటకు స్నపన తిరుమంజనం, 3.30కి బంగారు తిరుచ్చి, 4.30కి పెద్దశేషవాహనసేవ, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి ఆలయం, మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయం, మూలస్థానేశ్వరాలయంలో సూర్యభగవానుడికి అభిషేకాలు, విశేష పూజలు జరగనున్నాయి.

సింహపురి నుంచే ఉద్యమ కార్యాచరణ

- నెల్లూరులో ముగిసిన సీపీఎం రాష్ట్ర మహాసభలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై పలు తీర్మానాలు



నగరంలో జరిగిన ప్రదర్శనలో అభివాదం చేస్తున్న బృందాకారత్, పక్కన ఎంఏ బేబి,బీవీ. రాఘవులు వి.శ్రీనివాసరావు తదితరులు



నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : 47 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత సింహపురిలో జరిగిన సీపీఎం 27వ మహాసభలు సోమవారం ముగిశాయి. నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో 1వ తేదీన ప్రారంభమైన ఈ సభలకు రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులు పాల్గొని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు. 500 మంది ప్రతినిధులు పాల్గొన్న సభల్లో మొదటిరోజున సీపీఎం జెండా ఆవిష్కరించిన నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై దిశానిర్ధేశం చేశారు. బీజేపీ మతతత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని, రైతాంగ, కార్మిక, ఇతర వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలపైనా దుయ్యబట్టారు. మొత్తం 37 తీర్మానాలు చేసిన మహాసభ భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణకు బాటలు వేసింది. అలాగే సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా వి.శ్రీనివాసరావుకు రెండోసారి అవకాశం ఇచ్చి, 15 మందితో రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులను ఎనుకున్నారు

● ఆకట్టుకున్న భారీ ప్రదర్శన

ఈ మహాసభల ఆఖరి రోజు సోమవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన భారీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి బహిరంగ సభ జరిగే వీఆర్సీ మైదానం వరకు సాగిన ప్రదర్శనలో సీపీఎం అగ్రనేతలు బృందాకారత్, బీవీ రాఘవులు, ఎంఏ బేబి, గఫూర్ తదితరులు దారి పొడవునా ప్రజలను అభివాదం చేశారు. అనంతరం వీఆర్సీ వద్ద తెలంగాణ రైతాంగ, సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వారాజ్యం వేదిక వద్ద జరిగిన సభలో నేతలు ప్రసంగించారు. దామర మడుగు నుంచి జక్కా వెంకయ్య పేరిట వచ్చిన విజయోత్సవ కాగడాను బీవీ రాఘవులతోపాటు వి.శ్రీనివాసరావు స్వీకరించారు. దీంతో సీపీఎం 27వ మహాసభలు ముగిసినట్టు నేతలు ప్రకటించారు.

● నిధులు రాబట్టడంలో బాబు వైఫల్యం

కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సభలో ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ విధానంలో జగన్మోహన్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ పోలవరం జలాశయం నుంచి బనకచర్లకు నీళ్ల ఇస్తామని చంద్రబాబు చెబుతున్నారన్నారు. 800 అడుగుల ఎత్తులో ఉన్న బనకచర్లకు నీళ్ల సాధ్యమేనా అని ప్రశ్నించారు. ముందుగా హింద్రీనీవా, సోమశిల ప్రాజెక్టులను పూర్తి చేయాలని హితవు పలికారు. ఈ సభలో సీపీఎం నేతలు మూలం రమేష్, విఠపు బాలసుబ్రహ్మణ్యం, మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, డాక్టర్ రాజేశ్వర రావు, డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు



బృందాకారత్‌తో మాట్లాడుతున్న బేబి, రాఘవులు



కాగడాను అందుకుంటున్న రాఘవులు, శ్రీనివాసరావు తదితరులు

అభివృద్ధికి నిధులేవీ!?

కందుకూరు మున్సిపాలిటీకి విడుదలకాని ప్రత్యేక నిధులు 6

ఆ రెండూ టీడీపీ ఖాతాలోకే!

నెల్లూరులోని డిప్యూటీ మేయర్, బుచ్చి నగర పంచాయతీలోని రెండు వైస్‌చైర్మన్ పదవులు తెలుగుదేశం పార్టీయే దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా బరిలో నిలిచిన తహసీన్‌కు 41 మంది మద్దతు ప్రకటించగా, బుచ్చిలో పఠాన్ నస్రీన్, శివకుమార్‌లకు 15 మంది మద్దతు ప్రకటించడంతో వీరు గెలిచినట్లు ప్రిసైడింగ్ అధికారులు ప్రకటించారు. కట్టుదిట్టమైన పోలీస్ భద్రత నడుమ జరిగిన ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

టీడీపీ అభ్యర్థి తహసీన్‌కు మద్దతుగా చేతులెత్తిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు





తహసీన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, అబ్దుల్ అజీజ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు

నగర డిప్యూటీ మేయర్‌గా తహసీన్ ● బుచ్చి వైస్‌చైర్మన్లుగా నస్రీన్, శివకుమార్ ● కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ఎన్నికలు

● తహసీన్‌కు 29 ఓట్ల మెజారిటీ

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు నగరపాలక సంస్థలోని డిప్యూటీ మేయర్ పదవి టీడీపీ కైవసమైంది. సోమవారం జరిగిన ఎన్నికలో 48వ డివిజన్ కార్పొరేటర్ తహసీన్‌కు 29 ఓట్ల మెజారిటీ లభించడంతో ఆమె డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి కార్తీక్ ప్రకటించారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్‌లోని కౌన్సిల్ హాలులో ఎన్నిక ఉద్దేశాన్ని వివరించిన ప్రిసైడింగ్ అధికారి అయిన జేసీ కార్తీక్ డిప్యూటీ మేయర్‌గా పోటీ చేయాలనుకునే వారిని ఒకరు ప్రతిపాదించి మరొకరు బలపరచాలని సూచించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లాను తమ అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్న వైసీపీకి చెందిన కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తాను బలపరస్తున్నానని మరో కార్పొరేటర్ మహేష్ తెలిపారు. అనంతరం టీడీపీ తరఫున 48వ డివిజన్ కార్పొరేటర్ తహసీన్‌ను డిప్యూటీ మేయర్‌గా ప్రతిపాదిస్తున్న కరణం మంజుల తెలిపగా, బలపరుస్తున్నట్లు మరో కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. దీంతో పోలింగ్ అనివార్యం కావడంతో చేతులెత్తే పద్ధతి ద్వారా అభ్యర్థులకు తమ మద్దతు తెలపాని ప్రిసైడింగ్ అధికారి కోరారు.

● 29 ఓట్ల మెజారిటీ

ఖలీల్‌అహ్మద్ రాజీనామాతో 54 మంది కార్పోరేటర్ల సంఖ్య కాస్త 53కు చేరింది. వీరితోపాటు సిటీ ఎమ్మెల్యేగా మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌లతో కలుపుకుని 57 ఓట్లకు కార్పొరేషన్ సంఖ్యబలం చేరింది. వీరిలో మంత్రి నారాయణ, ఎంపీ వీపీఆర్‌లు రాకపోవడం, ఇద్దరు కార్పొరేటర్లు గైర్హాజరవడంతో 53 మందితో ఓట్లు లెక్కగట్టారు. వైసీపీ అభ్యర్థి కరిముల్లాకు 12 మంది, టీడీపీ అభ్యర్థి తహసీన్‌కు 41 మంది చేతులెత్తి మద్దతు ప్రకటించారు. 29 ఓట్ల మెజారిటీతో తహసీన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు కార్తీక్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం ప్రిసైడింగ్ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంత్రి నారాయణ చేతులమీదుగా తహసీన్ అందుకున్నారు.

● మేయర్, మరొకరు డుమ్మా!

ఈ ఎన్నికకు మేయర్ స్రవంతితోపాటు మరో కార్పొరేటర్ డుమ్మా కొట్టారు. 12వ డివిజన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేయర్ ఎన్నిక ప్రక్రియ ముగిసిన తర్వాత కౌన్సిల్ హాల్లోకి అడుగుపెట్టారు. 38వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న దాసరి అమృత ఎన్నికకు రాలేదు. ఈ ఎన్నికకు వీరు తటస్థంగా ఉండటం వెనుక పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎన్నిక జరుగుతున్న సమయంలో తహసీన్ వ్యక్తిగతంగా పోటీలో ఉన్నారా? టీడీపీ నుంచి పోటీలో ఉన్నారా? అంటూ బొబ్బల శ్రీనివాస్ ప్రిసైడింగ్ అధికారిని ప్రశ్నించగా జోక్యం చేసుకున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ ఎన్నికను నిబంధనల మేరకు జరుపుతుంటే అడ్డు రావద్దంటూ మండిపడ్డారు. దీంతో కొంతసేపు వీరిద్దరి మధ్య జరిగిన వాదన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది.

బుచ్చి వైస్‌చైర్మన్లుగా నస్రీన్, శివకుమార్

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచయతీలోని రెండు వైస్‌చైర్మన్ల పదవులు టీడీపీ కైవసం అయ్యాయి. నగర పంచాయతీ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం ఎన్నికల అధికారి అయిన డీపీఓ ఎల్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైస్‌చైర్మన్ల ఎన్నికలు జరిగాయి. నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు 20మంది, ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ మద్దతుతో 8వవార్డు కౌన్సిలర్ పఠాన్ నస్రీన్ భాను, 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రటపల్లి శివకుమార్‌రెడ్డిలను ప్రతిపాదించగా, 14 మంది కైన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే చేతులెత్తి మద్దతు తెలిపారు. ఇక వైసీపీ తరఫున 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ, 12వ వార్డు కౌన్సిలర్ కందుకూరు యానాదిరెడ్డి బరిలోకి దిగగా, ఆరుగురు కౌన్సిలర్లు మద్దతు ఇచ్చారు. పఠాన్ నస్రీన్, ఎర్రటపల్లి శివ కుమార్‌రెడ్డిలకు మెజారిటీ రావడంతో వైస్ చైర్మన్లుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించి, పాసులు ఉన్న వారినే అనుమతించారు.



టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్యే ప్రశాంతి, కౌన్సిలర్లు

121 కేంద్రాల్లో ఇంటర్ ప్రాక్టికల్స్

రేపు ప్రారంభం ● సీసీ కెమెరాల నిఘా ● ఆర్ఐవో శ్రీనివాసులు

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్ష(ప్రాక్టికల్స్)లు ఈనెల 5వతేదీ నుంచి 20వతేదీ వరకు మూడు దశల్లో ఒకేషనల్ విద్యార్థులకు, ఈనెల 10 నుంచి 20వతేదీ వరకు జనరల్ పెద్యార్థులకు రెండు దశల్లో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల అనంతరం థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న జాగ్రత్తలపై ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆంధ్రజ్యోతి తో పలు అంశాలను తెలియచేశారు.

ఇంటర్వ్యూ



జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్లు కలిపి మొత్తం 187 జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 53,003 మంది చదువుకుంటున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 28,176 మంది, ద్వితీయ సంవత్సరంలో 25,024 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఈనెల 5వతేదీ నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానుండడంతో సిబ్బందిని సన్నద్ధం చేశాము. జిల్లాలో ఒకేషనల్ విద్యార్థులు 2,275 మందికి ప్రాక్టికల్స్ నిర్వహణకు 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే 10 నుంచి 20వతేదీ వరకు 121 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 23,507 మందికి ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నాము. ఒకేషనల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, జనరల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. సీసీ కెమెరాల నిఘాతో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తాము. అన్నీ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇంటర్‌బోర్డు అధికారులు నిత్యం పరిశీలిస్తుంటారు. మార్చి 1 నుంచి 20వతేదీ వరకు జరిగే థియరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 79 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని 28 జోన్లుగా విభజించాము. 53,200 మంది విద్యార్థులు ఆ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు.

● కమిటీ పర్యవేక్షణ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ(డీఈసీ)ని నియమిం చాము. ఇప్పటికే ప్రాక్టికల్స్ జరిగే కళాశాలల్లోని ల్యాబ్‌లను పరిశీలించి సమస్యలున్న ప్రాంతాల్లో వెంటనే సరిదిద్ది సరైన పద్ధతిలో ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాము. పరీక్షల నిర్వహణకు నియమించిన సిబ్బంది, ఇన్విజిలేటర్లు పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించాము. పరీక్షల సమయంలో ఆకస్మిక తనిఖీలు చేపడతాము. ఎక్కడైనా ఇబ్బందులున్నా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవు. పరీక్షల పేరుతో అనధికార వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాము.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

అయ్యో.. మీరే దిక్కు!

- తోడుంటానన్న భర్త ఎటో వెళ్లిపోయాడు
- కన్నబిడ్డ అసువులు బాసాడు!
- ఇంట్లోకి రానివ్వని మెట్టినింటివారు
- ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్న ఓ మాతృమూర్తి
- న్యాయం చేస్తామని హామీ

- వివరాలు 6లో..



కుమారుడు హృతిక్ నందన్ మృతదేహంతో కలెక్టరేట్‌కు చేరుకుని విలపిస్తున్న వరలక్ష్మి



జనార్దన స్వామి ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాలు పరిసమాప్తం

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. ఆయన చేతుల మీదుగా స్వామివారి విగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్, కాకర్ల సునీల్, వెంకట్, మాలేపాటి చైతన్యలు చినజీయర్‌స్వామి ఆశీర్వాదాలు పొంది ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కావలి డీఎస్పీ శ్రీధర్, ఉదయగిరి సీఐ వెంకటరావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదాల బాబురావు, గ్రామపెద్దలు గోగినేని రామచంద్ర, మాదాల తిమ్మయ్యచౌదరి, మల్లంపాటి గురవయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అజెండాతో ఉద్యమాలకు కార్యాచరణ

● రాష్ట్రంలోని 5లక్షల ఎకరాలను పేదలకు పంచాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల డిమాండ్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహాసభల ద్వారా ప్రజాఅజెండాతో రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం తీర్మానించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమా మహేశ్వరరావు, రమాదేవి పేర్కొన్నారు. నెల్లూరు అనీల్ గార్డెన్‌లోని రాష్ట్ర మహాసభల వేదిక వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఎప్పుడు బయటకు వేస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని నిరుపేదలకు పంచిపెట్టాలన్నారు. రాష్ట్రంలోని 1.50 లక్షలమంది కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వటం లేదని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రత్యేక మార్కెట్‌ల ద్వారా నిత్యావసరాల విక్రయాలు చేయాలన్నారు. జీఎస్‌టీ నిధులను కేంద్ర నుంచి రాబట్టుకోవడంలో రాష్ట్ర వైఫల్యం చెందుతున్నదన్నారు. స్మార్ట్‌మీటర్లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని వారు కోరారు. గ్రామీణ ఉపాధి తరహాలోనే పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయకుండా సెయిల్‌లో కలపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత ఉమామహేశ్వరరావు

కోరి తెచ్చుకోవద్దు
కేన్సర్



జిల్లాలో కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. కేన్సర్‌లో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ ప్రారంభ దశలోనే గుర్తిస్తే చాలా వరకు తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కానీ, అవగాహన లోపం, నిర్లక్ష్యం, ఇతరులకు తెలుస్తుందనే భయంతో ఎంతో మంది సకాలంలో పరీక్షలు చేయించుకోక వ్యాధిగ్రస్తులవుతున్నారు. కొందరైతే కేన్సర్ సోకే ప్రమాదం ఉందని తెలిసినా కొన్ని అలవాట్లను మానుకోలేక రోగాన్ని కొనితెచ్చుకుంటున్నారు. ఆ తర్వాత తగిన చికిత్స చేయించుకోక మృత్యువుకు చేరువవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 21 వేల మందికి పైగా కేన్సర్ రోగులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీరంతా వ్యాధి రెండోదశకు చేరుకున్న వారే. వైద్య పరీక్షలు చేయించుకోక పోవటంతో ఇంకా ఎంతో మంది వెలుగులోకి రాలేదని, ఈ ఏడాది రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణుల అంచనా. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉంటూ కేన్సర్ నుంచి కాపాడుకోవాలని హెచ్చరిస్తున్నారు.

● పొగాకు నమలడం, ధూమపానం, మద్యంపానంతో ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధి
● ఇప్పటికే 21వేల మందికిపైగా బాధితులు
● నోటి, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ కేసులే అధికం
● అవగాహనలోపం, నిర్లక్ష్యంతో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
● ఈ ఏడాది మరింత పెరగొచ్చని అంచనా
● నేడు ప్రపంచ కేన్సర్ అవగాహన దినం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేన్సర్ బారినపడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించలేకపోవటంతో ఎక్కువ మంది మృత్యువుకు చేరువవుతు న్నారు. సరైన వైద్యం అందక మరెంతో మంది సతమతమవుతున్నారు. ధూమపానం, మద్యపానం కారణంగా నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఇక, మహిళల్లో అయితే రొమ్ము కేన్సర్ బాధితులు 27 శాతం, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ వ్యాధిగ్రస్తులు 18 శాతం నమోదు కావటం ఆందోళన కలిగించే అంశం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 21 వేల మందికిపైగా కేన్సర్ రోగులు ఉన్నట్లు సమాచారం. మరెంతో మంది పరీక్షలు చేయించుకోక పోవటంతో వెలుగులోకి రాలేదు. వ్యాధిగ్రస్థ మహిళల్లో ఎక్కువ శాతం రొమ్ము కేన్సర్ బాధితులే ఉండటం గమనార్హం. గుట్కా, ఖైనీ, జరదా వంటి మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు నమలడం వల్ల నోటి కేన్సర్, దవడ, నాలుక, స్వరపేటిక కేన్సర్‌కు గురవుతున్నారు. ఏడాదికేడాదికి ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నారు. అదేవిధంగా వైరల్ ఇన్‌ఫెక్షన్, సురక్షితంకాని లైంగిక సంబంధాల వల్ల మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ బాధితులు ఎక్కువవుతున్నారు. అయితే వైరల్ కేన్సర్‌ను నయం చేయవచ్చని, ఇతర అవయవాలకు సోకిన కేన్సర్ నివారణ కష్టతరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

● జిల్లాలో చికిత్సలు ఇలా ...

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వపరంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొంత వరకు చికిత్సలు అందుతున్నాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ విభాగం ఏటా 5 వేల మందికిపైగా బాధితులకు సేవలు అందిస్తు న్నారు. అలాగే మెడికవర్ ఆసుపత్రిలోనూ కేన్సర్‌కు ప్రత్యేక విభాగం ఉంది. అయితే జిల్లా నుంచి పెద్దసంఖ్యలో వ్యాధిగ్రస్తులు హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఎంతో మంది వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. చెన్నై లోని ఆసుపత్రులు, తిరుపతి స్విమ్స్‌లోనూ పలువురు చికిత్స పొందుతున్నారు.

రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో చికిత్సలు ఇలా..

సంవత్సరం	సర్జరీలు	రేడియేషన్	కీమో
2021	1114	547	4220
2022	886	536	6011
2023	834	547	7405
2024	615	409	5240

అత్యుత్తమ వైద్య చికిత్సలు

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నాము. అవసరమైన వారికి కీమోథెరపీ, శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నాము. సగటున ప్రతి రోజూ ఐదుగురు కేన్సర్ రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. ఇక్కడ ముగ్గురు కేన్సర్ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటున్నారు. ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా నోటి కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ ప్రబలుతోంది. ఈ వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మహిళలు కనీసం ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి.



- డాక్టర్ పద్మావతి, కేన్సర్ వైద్య నిపుణురాలు, నెల్లూరు జీజీహెచ్ హెచ్‌వోడీ

కట్టుదిట్టంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్స్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో సోమవారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, ప్రాక్టికల్ సామగ్రి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, బోర్డు నిబంధనలకు అనుగుణంగానే ప్రాక్టికల్స్ జరగాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసి న 21 ఒకేషనల్ ప్రాక్టికల్స్ కేంద్రాల్లో ఈనెల 5 నుంచి 9 వరకు తొలివిడత, 10 నుంచి 14వ తేదీ వరకు రెండో విడత, 15 నుంచి 19వతేదీ వరకు మూడోవిడతలో ప్రాక్టికల్స్ నిర్వహిం చనున్నామని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో మొత్తం 1,245 మంది, రెండో సంవత్సరంలో మొత్తం 1,030 మంది ప్రయోగ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

● ప్రశాంతంగా పరీక్షలు

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో తొలి ఘట్టమైన తప్పనిసరి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్‌ఐవో తెలిపారు. ఒకటిన జరిగిన మానవీయ విలువల పరీక్షకు 27,929 మంది, 3న జరిగిన పర్యావరణ విద్య పరీక్షకు 27,921 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఆర్‌ఐవోతో పాటు డీఈసీ సభ్యులు కేంద్రాలను పరిశీలించారు.ఈ పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. సమావేశంలో డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి అవగాహన సమావేశాలు

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్, ఎగ్జామినర్లకు ఈనెల 6, 7వతేదీల్లో నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నీ యాజమాన్య కళాశాలలకు సంబంధించి ఫిజిక్స్, బాటనీ లెక్చరర్స్‌కు 6వతేదీ ఉదయం 11 గంటలకు, కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్స్‌కు 7వతేదీ ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. అలాగే 7వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు చీఫ్ సూపరింటెండ్‌లకు, ఒకేషనల్ ప్రాక్టికల్ ఎగ్జామినర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్నీ కళాశాలల లెక్చరర్లు ఆయా రోజుల్లో తప్పక హాజరయ్యేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు


పర్యావరణ విద్య పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐవో డాక్టర్ శ్రీనివాసులు

నేడు ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి మంగళవారం నెల్లూరుకి రానున్నారని ఐఅండ్‌పీఆర్ డీడీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పీడీఎస్ పథకం అమలు తీరును ఆయన పరిశీలిస్తారని, బుధవారం ఉదయం 11గంటలకు క్షేత్రస్థాయిలో ఆయన పర్యటిస్తారని తెలిపారు.

అయ్యా.. మీరే దిక్కు!

● తోడుంటానన్న భర్త ఎటో వెళ్లిపోయాడు ● కన్నబిడ్డ అసువులుబాసాడు! ● ఇంట్లోకి రానివ్వని మెట్టినింటివారు ● ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్న తల్లి ● న్యాయం చేస్తామని అధికారి హామీ

జీవితాంతం తోడుంటానని వాగ్దానం చేసిన భర్త బిడ్డకు అనారోగ్యమని తెలిసి పత్తాలేకుండా పోయాడు. చివరకు చనిపోయిన బిడ్డను తీసుకుని ఆమె అత్తారింటికి చేరుకుంది. మెట్టినింటివారు ఇంట్లోకి రానివ్వలేదు. ఇక తనబాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ తల్లి బిడ్డ మృతదేహంతో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుంది. కలెక్టర్ ఆనంద్ ఎదుట గోడు వెల్లబోసుకుంది. న్యాయం చేయాలని వేడుకుంది. స్పందించిన కలెక్టర్ ముందు మీరు బిడ్డను తీసుకుని ఇంటికి వెళ్లండి. న్యాయం చేస్తానని చెప్పడంతో ఆమె వెనుదిరిగింది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

తనకు న్యాయం చేయాలని కోరుతూ బిడ్డ మృతదేహంతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను వేడుకుంది. బాధితురాలు వరలక్ష్మి వదిన శ్రీలక్ష్మి ఆంధ్రజ్యోతికి వివరాలు వెల్లడించారు. మూలాపేటలో ఉంటున్న శ్రీకాంత్, వరలక్ష్మిలకు హృతిక్‌నందన్ అనే కొడుకు ఉన్నాడు. గూడూరు మండలం చెన్నూరుకు చెదిన రమణయ్య, వెంకటమ్మల కుమార్తె వరలక్ష్మికి మూలాపేటలో ఉంటున్న శ్రీకాంత్‌కు పెళ్లి అయ్యింది. వీరికి హృతిక్‌నందన్ అనే కుమారుడు ఉన్నాడు. పెళ్లి సందర్భంగా రెండున్నర సవర్ల బంగారం, రూ.5లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. వరలక్ష్మి గర్భం దాల్చాక పుట్టినింటికి తీసుకువెళ్లారు. కుమారుడు పుట్టాక కాలం వెళ్లతీ స్తూ శ్రీకాంత్ తప్పించుకుని తిరిగేవాడని శ్రీలక్ష్మి తెలిపారు. చివరకు బిడ్డకు 9వ నెల వచ్చాక అత్తవారింటికి తీసుకుని వచ్చా రు. ఆ తరువాత శ్రీకాంత్ తన భార్యతో కలిసి వేరు కాపురం పెట్టారు. కొద్దిరోజుల తర్వాత హృతిక్‌నందన్ అనారోగ్యం పాలవడంతో శ్రీకాంత్ ఎటో వెళ్లిపోయాడు. మెట్టినింటి వాళ్లు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో వైద్యం కోసం చెన్నైకు వెళ్లింది. డాక్టర్లు హృతిక్‌నందన్‌ను పరిశీలించి బ్రెయిన్ కేన్సర్ అని, నాలుగో స్టేజీలో ఉందని చెప్పారు. ఆపరేషన్ చేసినా ఏడాది కంటే ఎక్కువకాలం బతకదని చెప్పారు. దీంతో వరలక్ష్మి దిక్కులేని స్థితిలో నెల్లూరుకు చేరుకుంది. వదిన సాయంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డను చేర్పించింది. రెండు నెలలు ఆ బిడ్డకు వైద్యం చేయించాక సోమవారం మృతిచెందాడు. మరణించిన బిడ్డను తీసుకుని అత్తవారింటికి వరలక్ష్మి వెళ్లగా అత్త, ఆడపడుచు, మరిది ఇంట్లోకి రానివ్వలేదు. పైగా ఇంటికి తాళం వేయడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె నేరుగా కలెక్టర్‌ను ఆశ్రయించారు.

అభివృద్ధికి నిధులేవీ!?

● కందుకూరు మున్సిపాలిటీకి విడుదలకాని ప్రత్యేక నిధులు
● గత ప్రభుత్వం రూ.23కోట్లు మంజూరు
● వచ్చింది రూ.10కోట్లు మాత్రమే
● ఆర్థికసంఘం, జనరల్ ఫండ్స్‌తోనే అరకొరగా పనులు


ఆధునీకరణ మొదలైన పార్కు స్థలం

కందుకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అభివృద్ధి పనులు నిధుల లేమితో మందకొడిగా సాగుతున్నాయి. ఆర్థికసంఘం నిధులు, జనరల్ ఫండ్స్ మినహా ప్రత్యేకనిధులు విడుదల కాకపోతుండటంతో ఈ సమస్య నెలకొంది. గత ప్రభుత్వంలో రూ.23కోట్లు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. ఎన్నికలకు ఆరునెలల ముందు నిధులు మంజూరు చేస్తే రూ.10కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈ సమయంలో పనులుచేస్తే బిల్లులు మంజూరవుతాయా లేదా అన్న మీమాంసలో కాంట్రాక్టర్లు పనులు చేయకుండా జాప్యం చేశారు. దీంతో నిధుల్లో రమారమి రూ.కోటి మిగిలిపోయాయి. ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం ఈ నిధులతో పామూరు రోడ్డు కార్నర్ నుంచి ఆదిఆంధ్రకాలనీకి వెళ్లేమార్గంలో డ్రైను, కొత్త కుమ్మరిపాలెం, మరికొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టగా ఈ పనులు కూడా నేటికీ పూర్తికాలేదు. ఈ పనులకు సంబంధించిన రూ.13కోట్లు విడుదల కాలేదు. అనేకప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం వినతులు వస్తున్నా అధికారులు ఏ పనులు చేయలేక పోతున్నారు. జనరల్ ఫండ్స్‌తో మెయింటనెన్స్ పనులకు పోను గాయత్రీనగర్‌లో కేవలం రెండు సిమెంటు రోడ్లను రూ.20లక్షలతో ఇటీవల కాలంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్‌తో నిర్మించారు. మరోపక్క పాలక వర్గం లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడం మున్సిపాలిటీలో అభివృద్ధికి శాపంగా మారింది.

● పార్కు పనుల ప్రారంభం

రూ.40లక్షల అంచనాతో 2022లో ప్రారంభ మైన దివి లింగయ్యనాయుడు మున్సిపల్ పార్కు ఆధు నీకరణ పనులు మాత్రం ఎట్టకేలకు ఇటీవల ప్రారంభమ య్యాయి. అప్పట్లో సాధారణ నిధులను పార్కు ఆధునీకర ణకు కేటాయించగా సగం వరకు మాత్రమే కాంట్రాక్టరు పను లు చేపట్టి ఏడాది కిందటే నిలిపివేశారు. ప్రస్తుతం మిగిలిన పనులకు సాధారణ నిధులు సమకూర్చేందుకు అధికారులు హామీ ఇవ్వటంతో నాలుగురోజుల కిందట కాంట్రాక్టరు పను లు ప్రారంభించారు. పార్కు ఆధునీకరణలో భాగంగా చెట్లు, పాత భవనాలు, ప్రజలు సేదదీరే అరుగులను పూర్తిగా తొలగించారు. ఈ పనులు పూర్తి చేయకపోవటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ పార్కు పట్టణ ప్రజలకే కాకుండా గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన వారు సేదతీరేందుకూ అనువుగా ఉండేది. ప్రస్తుతం పార్కు పనులు ప్రారంభించినందున పిల్లలకు ఆడుకునే ఉపకరణాలు, ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, పచ్చదనానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

● నుడా నిధులతో ప్రతిపాదనలు

ఇటీవల కాలంలో రూ.2కోట్ల నుడా నిధులు మున్సిపాలిటీకి మంజూరు చేసేందుకు అనుమతి రాకపటంతో పామూరు రోడ్డు జంక్షన్ అభివృద్ధి.. అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు డివైడర్.. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి అనుమతులు వస్తే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిధుల లేమితో అభివృద్ధికి ఆటంకం

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు నిధులలేమి సమస్యగా మారింది. ప్రస్తుతం అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు లేవు. జనరల్ ఫండ్స్‌తో అత్యవసర మెయింటనెన్స్ పనులు చేయించగలుగుతున్నాం. నుడా నిధులకు సాంకేతిక అనుమతులు వస్తే పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

- గణపతి, డీఈఈ

బోగస్ అయితే
మళ్లీ పరీక్షలు!

జిల్లాలోని దివ్యాంగుల పింఛన్లపై విచారణ ప్రారంభమైంది.ఈ విచారణ సోమవారం మొదలు కాగా నాలుగు నెలలపాటు కొనసాగనున్నది. వారికిచ్చిన సర్టిఫికెట్ నకిలీదని తేలితే మళ్లీ దివ్యాంగులకు నిర్ధారణకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని వైద్యులే కాకుండా తిరుపతి, చిత్తూరు నుంచి వచ్చిన వైద్యనిపుణుల తో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో వైద్యులు వారికి అందించిన దివ్యాంగుల గుర్తింపు పత్రాలతోపాటు పరీక్షల ద్వారా వాస్తవికతను తేటతెల్లం చేసేందుకు వైద్యులు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.


జీజీహెచ్‌లో వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

● దివ్యాంగుల పింఛన్లపై విచారణ
● ఏడు కేంద్రాల ద్వారా సర్టిఫికెట్ల పరిశీలన
● కొందరు నకిలీ గుర్తింపు పొందినట్లు అనుమానం
● ఏరివేతపై ప్రభుత్వ దృష్టి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 32,638 మంది దివ్యాంగులు ఉన్నట్లు, వారంతా ప్రభుత్వం నుంచి పింఛన్లు తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పంపిణీలో పలు అవకతవకలు జరిగాయని, వైసీపీ ప్రభుత్వం నకిలీ గుర్తింపు పత్రాలను వైద్యుల చేత అందించి వారికి పెన్షన్‌లు అందిస్తున్నట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుమానిస్తున్నది. పైగా గతంలో దివ్యాంగులకు రూ. 3,400 పింఛను అందిస్తుండగా, ప్రస్తుతం రూ. 6వేలు అందిస్తుంది. ఈ నేపథ్యంలో వాస్తవాలు గుర్తించేందుకు దివ్యాంగులకు మరోసారి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా సోమవారం (ఈనెల 3వతేదీ) నుంచి మే నెల 28 వరకు దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. నకిలీల ఏరివేతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించటంతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

● ఏడు కేంద్రాల ఏర్పాటు

నెల్లూరులోని జీజీహెచ్, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులతపాటు కోవూరు, పొదలకూరు, ఉదయగిరి సీహెచ్‌సీల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. అయితే ఆయా కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు, వారి సహాయకులకు భోజన వసతులు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయకపోవటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. డీఆర్‌డీఏ నిర్వహణలో జీజీహెచ్‌లో ఈపరీక్షలు ఏర్పాటు చేశారు. రోజుకు 400 మంది దివ్యాంగులను పరీక్షించేలా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయి. కన్ను, ఈఎన్‌టీ, ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి దివ్యాంగుల పాత గుర్తింపు పత్రాలతోపాటు తాజాగా పరీక్షలకు సంబంధించి వైద్య నిపుణులు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎమ్మారై వంటి పరికరం జీజీహెచ్‌లో ఉండటంతో ఇక్కడకు దివ్యాంగుల తాకిడి ఎక్కువగా ఉంది.


వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న దివ్యాంగులు

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులను క్షుణ్ణంగా పరీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్షల కోసం వచ్చే వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం ప్రస్తుతం 32,638 మందికి పెన్షన్ అందిస్తున్నాం. రూ. 6వేల వంతున ఒక్కొక్కరి ఇస్తున్నాం. అయితే ప్రభుత్వం నుంచి వచ్చిన తాజా ఆదేశాల మేరకు దివ్యాంగుల గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నది.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

కంకర రోడ్డుపైనే ప్రయాణం

● రేణమాల, నేకునాంపేట, తూర్పుపాలెం గ్రామాల ప్రజల అగచాట్లు

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రేణమాల, నేకునాంపేట పంచాయతీ తూర్పు పాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. తారురోడ్డు నిర్మాణానికి చేపట్టిన పనులు మధ్యలోనే ఆపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పడుతున్నారు.

● ఏఐఐబీ పథకం నిధులు మంజూరు

పంచాయతీరాజ్ విభాగంలోని ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ విభాగంలోని ఏషి యన్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు ద్వారా రేణమాల పంచాయతీలోని కొత్తఊరు, పాత ఊరులను కలిపేందుకు 1.2కిలోమీటర్లు, నేకునాంపేట పంచాయతీ తూర్పుపాలెం వెళ్లేందుకు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి (1.5 కిలోమీటర్లు) సుమారు రూ.3కోట్ల నిధులు విడుదలను మంజూరు చేసింది. 2022 ఫిబ్ర వరిలో నెల్లూరు కాంట్రాక్టరు పనులు ప్రారం భించారు. మరమ్మత్తులు ప్రారంభించి కల్వ ర్టు లు, బ్రిడ్జిలు నిర్మించి రోడ్లకు కంకర తోలగించారు. ఈ నిర్మాణ పనుల ప్రక్రియ ఏడాది పాటు కొనసాగించి 2023 ఆగస్టు నుండి పను లను పూర్తిగా నిలిపివేశారు.

● ప్రయాణికులకు తప్పని తిప్పలు

రోడ్డు వేయకపోయినా సరే గతంలో ఉన్న రోడ్డును ధ్వంసం చేసి కంకరరాళ్లను వేయడంతో ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉన్నది. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పలుమార్లు పడిపోయిన సంఘటనలున్నాయి. మందువైపు ఆటో వెళ్తుంటే దుమ్ము రేగి కళ్లలోకి చేరుతుంది. ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోక పోవడం వలనే తమకు ఈ కష్టాలు అని గ్రామల ప్రజలు వాపోతున్నారు.



తూర్పుపాలెం గ్రామానికి వేళ్లే రోడ్డు

అత్యవసరంలో వాహనాలు రావు

రోడ్డు నిర్మాణం ఆగిపోయి రెండేళ్లు కావస్తోంది. రోడ్డు బాగులేక పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో కూడా వాహనాలు గ్రామానికి రావడం లేదు. అధికారులు పట్టించుకొని రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

వెంకట రమణయ్య, తూర్పుపాలెం

రోడ్డు నిర్మాణం చేసుకోవచ్చు

గతంలో మంజూరైన రేణమాల, తూర్పుపాలెం లింకురోడ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. సదరు కాంట్రాక్టరు అగ్రిమెంటు ముగిసింది. గ్రామంలో 500 జనాభా పైన ఉంటే ప్రధానమంత్రి గ్రామసడక్‌యోజన పథకం కింద రోడ్డు నిర్మాణాలను పూర్తిచేస్తాం.

విశ్వేశ్వరరావు, పీఆర్ డీఈ, ఉదయగిరి

న్యూస్ బాక్స్

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4,69,840

అల్లూరు, ఫ్రిబవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.4,69,840వచ్చినట్లు ఆలయ ఈవో చిట్టిబాబు సోమవారం తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టామన్నారు. తిరునాళ్ల సందర్భంగా వచ్చిన భక్తులు, ఆలయానికి నిత్యం వచ్చే భక్తులు ముడుపులు సమర్పించారని చెప్పారు.

రోడ్డు మరమ్మతులు



కోతకు గురైన రోడ్డులో చేపట్టిన కాంక్రీట్ గోడ నిర్మాణం

కావలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలుగోళ్లమ్మ పేట నుంచి అన్నపుగుంట మీదుగా వైకుంఠపురం వైపు వెళ్లే మార్గంలోని రోడ్డు గతేడాది కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా ఉండేది. వాహనదారులు గుంతల్లోకి వెళ్లకుండా స్థానికులు రాళ్లు అడ్డం పెట్టారు. కొన్ని రోజులు అలాగే వదిలేసిన మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించి ఆ ప్రాంతంలో కాంక్రీట్ గోడ నిర్మించి గుంతను పూడ్చి వేయించారు.

చేపల పెంపకానికి వేలం

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొమ్మిపంచాయతీ గండికట్ల చెరువులో చేపల పెంపకానికి ఇరిగేషన్‌అధికారులు సోమవారం వేలం నిర్వహించారు. రామాలయం వద్ద ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన షేక్ ఖాజామస్తాన్ రూ.40వేలకు పాడి దక్కించుకున్నారు. ఆరునెలలు (జూన్) చేపలు పెంపకం, అమ్ముకునేందుకు అవకాశం ఉందని ఏఈ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ వేణుగోపాల్

సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు కూడలిలో ఎస్‌ఐ రాజేష్ సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దువ్వూరు ఎలైట్ ప్రైవేటు స్కూలు వేణుగోపాల్ సహకారంతో దువ్వూరు కూడలిలో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

సభలకు తరలిన నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు ఆత్మకూరు నుంచి సీపీఎం నేతలు, కార్మిక, కర్షక, ఉద్యోగులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆత్మకూరు నాగయ్య, ఎం నాగేంద్ర, సలారుద్దీన్, కెవిపిఎస్ నాయకుడు పేమల వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు

కందుకూరు, ఫ్రిబవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓగూరు గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. కందుకూరులోని శాకలిపాళెంకు చెందిన ముగ్గురు యువకులు ఒంగోలుకు వెళ్లి తిరిగి బైక్‌పై బయలుదేరారు. ఓగూరు వద్ద నూతనంగా నిర్మిస్తున్న జాతీయరహదారిపై స్పీడ్‌బ్రేకర్‌ను గమనించక అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో తీవ్రగాయాలై ఒకరు మృతి చెందగా, గాయపడిన ఇద్దరిని ఏరియా వైద్యశాలకు తరలించారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాకర్ల



హైస్కూల్‌లో స్టేజీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ నాయకులతో కలిసి వెంగమాంబ పేరంటాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామినేని పెదవెంగయ్య, విజయకుమారి దంపతులు రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన స్టేజీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్లు వెంకటరత్నం, బయ్యన్న, సర్పంచ్ నాగయ్య, టీడీపీ నాయకులు కాకర్ల వెంకట్, సునీల్, శ్రీకుర్తి రవీంద్రబాబు, మాదాల తిమ్మయ్య, ఉండేలా గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గోడపత్రికల ఆవిష్కరణ

వింజమూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్షల డప్పులు.. వేల గొంతుల ప్రదర్శన గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, టీడీపీ నాయకులు మాలేపాటి చైతన్య, బెజవాడ గురవయ్యమాదిగ, గొల్లపల్లి మోహన్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: లక్షల డప్పులు..వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పిడతల కిరణ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చలో హైదరాబాద్ గోడపత్రి కలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు జాషువా, ఇజ్రాయిల్, తిరుపతయ్య, రాజేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో సోమవారం వసంత పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

● నేడు రథసప్తమి వేడుకలు

కావలి: స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం మాల్యాద్రి సోమవారం ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్న సంతర్పణ, రాత్రి ఉపాహారం, రథసప్తమి అన్నదాన కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తారన్నారు.

దివ్యాంగులు, వయోవృద్ధులకు అవగాహన

● సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కాంపోసిట్ రీజనల్ సెంటర్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వయోవృద్ధులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ (ఫిజియోథెరపీ) రాకేష్ మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఇవోపీఆర్డి భార్గవి, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ వాడకం నేరం

లింగసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు వీఆర్.కోట, మొగలి చెర్ల, చినపవని సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ తీగల నుంచి రైతులు పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు అక్రమంగా విద్యుత్ వాడుతున్నారని ఇది చట్టరీత్యా నేరమని కందుకూరు రూరల్ ఏడీఈ వి జయ్‌బాబు సోమవారం తెలిపారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంఘటనల్లో ప్రాణాలు పోతే రైతులలే బాధ్యత అన్నారు.

అందని పశు వైద్య సేవలు

లింగసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశు వైద్యశాలకు రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు సౌమ్య మూడునెలల కిందట బదిలీ అయ్యింది. ఇన్‌చార్జి వైద్యులుగా వలేటివారిపాలెం మండలం పోకూరు పశువైద్యాధికారి పులి రమేష్‌ను ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన వారానికి మూడురోజులు వైద్యశాలకు వచ్చి వెళుతుంటారని పాడిరైతులు వాపోతున్నారు.

ప్రైవేటు వ్యక్తుల నిఘాలో పేకాట స్థావరాలు

● రోజుకో చోటు మార్చి ఆడుతున్న వైనం
● పోలీసుల సమాచారం కోసం నలుగురు కుర్రాళ్లు
● నిర్వాహకులకు భారీగా ఆదాయం
● అధిక వడ్డీలకు డబ్బులిస్తున్న వ్యాపారులు

లింగసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాట ప్రైవేటు వ్యక్తుల నిఘాలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా తాతాహోటల్ సెంటర్ సమీపంలోని చిల్లచెట్లు, అలాగే కొన్ని ఎంపిక చేసిన ఇళ్లు.. లింగసముద్రం, మొగిలిచెర్ల సమీపంలోని దత్తాత్రేయస్వామి సమీపంలోని అటవీ ప్రాంతం.. స్థానిక హైస్కూల్ ఎగువన ఉన్న అటవీ ప్రాంతం, పెదపవని నుంచి షోడారం వెళ్లే మార్గంలో పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కేంద్రాల్లో ఆడేందుకు కందుకూరు, గుడ్లూరు, కావలి ప్రాంతాల నుండి పేకాటరాయుళ్లు మండ లానికి వస్తున్నారని తెలిసింది. ఈ ఆట లక్షల రూపాయల్లో జరుగుతున్నట్లు సమాచారం. మూడునెలల క్రితం తాతా హోటల్ సమీపంలోని ఓ యువకుడికి రూ.20లక్షలు వచ్చిన ట్లుగా పేకాటరాయుళ్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. పేకాటరాయుళ్లు అందరూ ముందుగా ఫోన్లలో ఎక్కడికి వెళ్లాలో మాట్లాడుకొని వెళుతున్నారు. కొందరైతే తాతాహోటల్ వద్ద వాహనాలు ఉంచి వెళుతున్నారని తెలుస్తోంది. రెండురోజుల క్రితం బదిలీ అయిన ఓ పోలీస్ అధికారి పేకాట నిర్వాహకుల వద్ద అప్పుడప్పుడు డబ్బులు తీసుకుం టున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాక పోలీసులు వస్తున్నారనే సమాచారం కూడా పోలీస్‌స్టేషన్ నుంచే పేకాటరాయుళ్లకు వస్తున్నట్లు విమర్శలున్నాయి.

● ఒక్కొక్కరు ఒక్కో సెంటర్‌లో..

అయితే ఎక్కడ పేకాట ఆడినా తాతాహోటల్ సమీపంలోని ఓ కాలనీకి చెందిన నలుగురు యువకులను నియమించుకొని వారి ద్వారా పోలీసుల సమాచారం తెలుసుకుంటున్నారు. వీరు ఒక్కొక్కరూ ఒక్కో సెంటర్‌లో ఉండి పోలీసుల సమాచారాన్ని పేకాట నిర్వాహకులకు అందిస్తుండటంతో పేకాటరాయుళ్లు పోలీసులకు దొరకడం లేదు. అందుకు యువకులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.1000 ఇస్తున్నట్లు తెలిసింది.

● సమకూరుస్తున్న అన్ని వసతులు..

పేకాట ఆడించే కొందరు నిర్వాహకులకు ప్రతిరోజూ భారీగా ఆదాయం వస్తోంది. వీరు పేకాట ఆడే వారికి అన్ని వసతులు సమకూరుస్తారు. గత కొన్నేళ్ల నుండి వీరి ఆదాయం లక్షల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. అలాగే కొందరు వడ్డీ వ్యాపారులు కూడా నేరుగా పేకాట ఆడే చోటుకే వెళ్లి ఆడే వారికి వేలల్లో డబ్బులు అధిక వడ్డీలకు ఇస్తూ, వేలల్లో ఆదాయం గడిస్తున్నారు. దీంతో పేకాట మండలంలో యథేచ్ఛగా కొనసాగుతోంది.

వీరజవాన్‌ను ఘన నివాళి



నివాళులర్పిస్తున్న చెంచలబాబు

కలిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణలో విధులు నిర్వహిస్తూ వీరమరణం పొందిన తెల్లపాడుకు చెందిన జవాన్ లింగుంటి వెంకటనరసయ్యకు సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఘన నివాళులర్పించారు. స్వగ్రామానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, కుంకు ఉమా మహేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, ఫిబ్రవరి 3: గీతకులస్థులు మద్యంషాపుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినట్లు సోమవారం కలిగిరి సర్కిల్ ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. కలిగిరి సర్కిల్ పరిధిలో కలిగిరి, వింజమూరు మండలాలకు ఒక్కొకటి వంతున ప్రభుత్వం షాపులను కేటాయించిందన్నారు. ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం రూ.2లక్షలని ఒక్కొక్కరు ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చన్నారు. గీత కులస్థులకు మాత్రమే అందుకు అర్హులన్నారు.

విట్స్ అధ్యాపకుడు ఫణిభూషణ్‌కు డాక్టరేట్



కావలి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ వేమూరు ఫణి భూషణ్‌కు ఎస్వీ యూనిర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విభాగంలో ఇమేజ్ ప్రాసెసింగ్‌లో రీసెర్చ్ అంశమైన ఎ నావెల్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్ ఆఫ్ థర్మల్ వేవ్ ఇమేజింగ్ ఫర్ నాన్ డెస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్‌పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చినట్లు ఫణిభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

అటవీ భూములపై విచారణ

చిట్టగుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):తహసీల్దారు సురేష్‌బాబు సోమవారం కార్యాలయంలో సోమవారం కోపూరుపల్లిలో జరుగుతున్న భూ రీసర్వేపై అధికారులతో సమావేశమయ్యారు. కొన్నేళ్లుగా జరుగుతున్న అక్కరాజువారి కండ్రిక ఈనామ్, అటవీ భూముల వివాదంపై కొనుగోలుదారులు, గ్రామస్థులను పిలిపించి విచారణ జరిపారు. పూర్తిస్థాయి విచారణ, రికార్డులను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి

దగదర్తి, (చిట్టగుంట) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తహసీల్దారు కృష్ణను కోరారు. సోమవారం ఆయన దగదర్తి మండల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో పలు గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులతో కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, వడ్డే,వినయ్‌కుమార్ ఉన్నారు.

దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి సోమ, మంగళ, బుధవారాల్లో దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం వైద్యశాలలో ప్రారంభమైన పరిశీలన శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు సదరం సర్టిఫికెట్, ఆధార్ జెరాక్స్‌ను తీసుకురావాలని కోరారు.

● ఉదయగిరి : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం దివ్యాంగ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలను వైద్యులు పరిశీలించారు. నెల్లూరు వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సీఎస్ రాజు లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఏపీఎం ఖాజారంతుల్లా, డిజిటల్ అసిస్టెంట్ అబ్దుల్‌సమద్, జూనియర్ సహాయకులు సరస్వతి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

93 శాతం ఈక్రాప్ పూర్తి

● ఎన్ శ్రీహరి, ఏవో, సంగం



సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20పంచాయతీల్లో సాగులో ఉన్న వరి పంటను 93 శాతం ఈక్రాప్ పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీహరి తెలిపారు.

? మిగిలిన 7 శాతం ఈక్రాప్ ఎప్పుడు పూర్తిచేస్తారు.

! డిఫామ్ భూములన్నీ పెండింగ్ చూపిస్తున్నాయి. ఈ భూముల వివరాలను సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లో ఏవో లాగిన్‌కి అప్‌లోడ్ చేస్తే భూముల వివరాలను అప్రూవల్ కోసం తహసీల్దారు లాగిన్‌కు పంపిస్తాం. తహసీల్దారు అప్రూవల్ చేసిన వెంటనే ఈక్రాప్ చేయడానికి వీలవుతుంది.

? ఈకేవైసీ పరిస్థితి ఏమిటీ. ఎంతమేరకు వచ్చింది.

! ఇప్పటివరకు 23శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయింది. రైతులు అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను సంప్రదించి త్వరగా ఈకేవైసీ చేయించుకోవాలి.

? ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తున్నారు.

! మండలంలో ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ముమ్మరంగా వరి నూర్పిళ్లు ప్రారంభమవుతాయి. ఈలోపు సంగం, దువ్వూరు పీఏసీఎస్‌ల్లో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు పంపాము. అధికారులు అనుమతి ఇవ్వగానే ప్రారంభిస్తాం.

కార్పొరేషన్ రుణాలివ్వాలి



ధర్నా చేస్తున్న దళిత,గిరిజనులు

కావలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనులకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణా లివ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత, గిరిజనులతో ధర్నా చేపట్టి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ రుణాలతో ఆటోలు, ట్రాక్టర్లు, చిన్న వ్యాపారాలకు రుణసౌకర్యం కల్పించేవారన్నారు. ప్రస్తుతం ఈ రుణాలు ఇవ్వకపోవడంతో చిన్న అవసరాలకు వడ్డీ వ్యాపారులు, ప్రయివేట్ బ్యాంకులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు చలంచర్ల లక్ష్మయ్య, కత్తి వెంకటరత్నం, బ్రహ్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, చలంచర్ల వెంకయ్య, సత్యవతమ్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కావలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముసునూరు బాలాజీనగర్‌లో సోమవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఏర్పాటుతో స్థానికులు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెతో పొంచి ఉన్న ప్రమాదం అని ఆంధ్రజ్యోతి ఇటీవల వార్తను ప్రచురించింది. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. .

మధ్య తరగతి ప్రజల బడ్జెట్

కావలి టౌన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి కోసమే అని బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ తెలిపారు. సోమవారం నమస్కార్ హోటల్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నేతలు బ్రహ్మానందం, అమరా సు బ్బారావుల తో కలిసి మాట్లాడారు. ఆదాయప పన్ను పరిమితిని రూ.12లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం హర్షనీయమన్నారు. అనంతరం వైసీపీ రియల్టర్లు చేయాల్సిన తప్పులపై మాట్లాడారు. తప్పు జరిగిపోయింది సరిదిద్దుకుంటామంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. రియల్టర్లు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీకి కొమ్ముకాసే నైజం మాను కోవాలన్నారు. సమాశంలో మాధవి, కమల, వీవీ రంగారెడ్డి, సీవీసీ సత్యం ఉన్నారు.

రిజర్వాయర్ పనులకు నిధులు విడుదల చేయాలి



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్ పనులకు నిధులు విడుదల చేయాలని రైతుసంఘం, జేవీవీ నాయకులు కోరారు. సోమవారం ఆయా సంఘాలకు చెందిన నాయకులు రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోని రిజర్వాయర్‌కు రూ.400 కోట్ల నిధులు అవసరమన్నారు. సాగునీరు అందించి వలసలు నియంత్రించాలన్నారు. అనంతరం రైతులు, ప్రజలతో చర్చించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ కేవీ శేషారెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ జీ.సుధాకర్‌రెడ్డి, కె. శ్రీని వాసులురెడ్డి, ఏపీ రైతుసంఘం నాయకులు ఎల్ కృష్ణప్రసాద్, ఉదయగిరి డివిజన్ జేవీవీ నాయకులు దస్తగిరిఅహ్మద్ పాల్గొన్నారు.

రోడ్లు, హద్దు రాళ్ల తొలగింపు

కావలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ రోడ్డులోని అనధికారిక లేఅవుట్‌లోని కాలువలు, రోడ్లు, హద్దురాళ్లను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, టీపీవో వివేకానందలు సిబ్బందితో తొలగింపజేశారు. దాని పక్కన ఉన్న నుడా లేఅవుట్‌లోని ప్రభుత్వ కాలువను ఎక్సకవేటర్‌తో తిరిగి పునరుద్ధరించారు. అనధికార లేఅవుట్ల నిర్మాణాలకు అనుమతులను మున్సిపాలిటీ ఇవ్వదని ఈ విషయాన్ని గమనించాలన్నారు.



ఎక్సకవేటర్‌తో పనులు చేయిస్తున్న అధికారులు